ఆదివారం గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తిరుపతి
: fb.com/vaartha Digital
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 350 పేజీలు: 10+4 వెల: 6.50

టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల 2లో

కర్ణాటక ఎన్ఫోర్స్‌మెంట్ డిజిపి సస్పెన్షన్ 5లో

# టెక్నాలజీలో ఎపి ముందంజ



మంగళవారం దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ పోరంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**ఏ దేశంలో లేని యువశక్తి భారత్‌లో ఉంది..**

**పారిశ్రామికవేత్తలకు అతిపెద్ద మార్కెట్ ఎపి**

**వెయ్యి కి.మీ. సముద్రతీరం, పోర్టులు, ఎయిర్‌పోర్టులే ఎపి బలం**

**వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో సిఎం చంద్రబాబు**

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుని అద్భుత ఫలితాలను తమ రాష్ట్రంలో సాధిస్తున్నామని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.వచ్చిన ప్రతిసారి నిపుణుల నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటున్నా, కొత్త ఆలోచనలు పంచుకుంటున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పారిశ్రామికవేత్తలతో భారత పరిశ్రమల సమాఖ్య బ్రేక్ ఫాస్ట్ సెషన్ నిర్వహించింది.ఈ సెషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, మాస్టర్ కార్డ్ సిఇఒ, కాగ్నిజెంట్ సిఇఒ రవికుమార్ సహా విదేశీ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సదసుల్లో భారత్ కేంద్రంగా అభివృద్ధి ఎపి సానుకూలతలపై సిఎం చంద్రబాబు ప్రసంగిస్తూ ఇంధనం, డిజిటల్ ఇన్ ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు నెలకొన్న అవకాశాలపై,రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ తదితర రంగాల్లో పెట్టుబడుల గురించి వివరించారు.క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సహా 25 పాలసీలు, గ్రీన్ అమ్మోనియా, గూగుల్ పెట్టుబడుల గురించి సీఎం వివరించారు.విశాఖ సిఐఐ భాగస్వామ్య సదస్సులో సాధించిన పెట్టుబడులు, ఎపి బ్రాండ్ ఇమేజ్‌పై పారిశ్రామిక వేత్తలకు. స్పేస్ సిటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవే కనెక్టివిటీ తదితర >>2



మంగళవారం దావోస్‌లో గూగుల్‌క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

## గూగుల్ తలుపు తెరవండి

**సిఇఒ థామస్ కురియన్‌ను కోరిన సిఎం చంద్రబాబు**

**విజయవాడ,జనవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి:** దావోస్ పెట్టుబడుల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో గూగుల్ క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్ సమావేశమయ్యారు..విశాఖలో 'గూగుల్ ఎఐ డేటా సెంటర్' నిర్మాణంపై ఇరువురి మధ్య కీలకంగా చర్చ జరిగింది.ఎలాంటి జాప్యం లేకుండా డేటా సెంటర్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని >>2


మంగళవారం బిజెపి నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌ను అభినందిస్తున్న ప్రధాని మోడీ

## నబీన్ నా బాస్

**నేను కార్యకర్తను మాత్రమే: ప్రధాని మోడీ**

**పార్టీ కొత్త అధ్యక్షుని ప్రమాణం**

**అభినందించిన ప్రధాని, కేంద్ర మంత్రులు**

**న్యూఢిల్లీ, జనవరి 20:** మూడుసార్లు ప్రధానిగా ఉండడం తన జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. 50 యేళ్ల వయసులో ముఖ్య మంత్రి కావడం కాదని, బిజెపి కార్యకర్తగా ఉండటమే తనకు గొప్ప గర్వమని మోడీ వ్యాఖ్యానించారు. బిజెపి నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యత స్వీకరణలో ప్రధాని మోడీ పాల్గొని పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసింగించారు. మంగళవారం ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన 'సంఘటన్ పర్వ్' కార్యక్రమంలో నితిన్ నబీన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. రిటర్నింగ్ ఆఫీసర్ కె.లక్ష్మణ్ చేతుల మీదుగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సర్టిఫికెట్‌ను నితిన్ అందుకున్నారు. ప్రధాని >>2



మంగళవారం దావోస్‌లో ఆర్‌ఎంజడ్ చైర్మన్ మనోజ్ మెండాతో మంత్రి లోకేష్

## రాష్ట్రంలో ఆర్ఎంజెడ్ రూ. లక్షకోట్ల పెట్టుబడులు

**దావోస్‌లో మంత్రి లోకేష్ సమక్షంలో సంస్థ ప్రకటన**

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేష్ చొరవతో ఎపిలో మరో భారీ పెట్టుబడికి ఆర్ఎంజడ్ సంస్థ ముందుకు వచ్చింది. మంగళవారం దావోస్‌లో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ మెండాతో మంత్రి లోకేష్ జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ఆంధ్రప్రదేశ్=లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆర్ఎంజడ్ సంస్థ ముందుకు వచ్చింది. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించడం, విశాఖనగరంలో జీసిసి పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విశాఖపట్నం కాపులుప్పాడ ఫేజ్1 ఐటీ పార్క్‌లో సుమారు 50 ఎకరాలలో 10 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో జీసీసీ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ఆర్ఎంజడ్ గ్రూప్ అంగీకరించింది. దావోస్‌లో జరిగిన 2026 వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ మెండా ఈ వ్యూహాత్మక పెట్టుబడి భాగస్వామ్యాన్ని ప్రకటించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మిక్స్ డ్ యూజ్, డిజిటల్, పారిశ్రామిక మౌలిక ఈ పెట్టుబడులు పెట్టనుంది. విశాఖపట్నం ప్రాంతంలో దశలవారీగా 1 గిగావాట్ వరకు లక్ష్య సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కూడా ఆర్ఎంజడ్ గ్రూప్ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. దీనికి విశాఖపట్నం ప్రాంతంలో సుమారు 500 నుండి 700 ఎకరాల భూమి అవసరం. ఈ ప్రాజెక్ట్ నెక్స్ట్ జెన్ డిజిటల్, ఏఐ వర్క్ లోడ్ కు మద్దతు ఇస్తుంది. స్థిరత్వం, గ్రీన్ పవర్ ఇంటిగ్రేషన్ కు ప్రాధాన్యత ఇస్తుంది. ఇదిలావుండగా రాయలసీమలో టేకులోడు వద్ద ఆర్ఎంజెడ్ గూప్ సుమారు 1,000 ఎకరాలలో పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించింది. ఈ ప్రాంతంలో పారిశ్రామిక తయారీ, గిడ్డంగులు, లాజిస్టిక్స్ కార్యకలాపాలను అభివృద్ధి చేస్తుంది. ఈ ప్రాజెక్టులన్నింటిపై కలిపి రాబోయే ఐదేళ్లలో ఆర్ఎంజడ్ సంస్థ సుమారు 10 బిలియన్ డాలర్ల సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామిక, లాజిస్టిక్స్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తానే, విశాఖపట్నాన్ని నెక్స్ట్ జెన్ మిక్స్డ్ యూజ్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా మార్చలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఆర్ఎంజడ్

## జోగి బ్రదర్స్‌కు బెయిలు మంజూరు

**నకిలీ మద్యం కేసు**

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి కల్తీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాముకు విజయవాడ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 6వ ఎఎంఎఫ్‌జె కోర్టు భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వీరిద్దరికి బెయిల్ మంజూరు చేసింది. జోగి రమేష్, జోగి రాము.. భవానీపురంలో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో ఏ18గా జోగి రమేష్, ఏ19గా జోగి రాము పేర్లు ఉన్నాయి. అయితే.. ములకల చెరువు కేసులో ఇంకా జోగి రమేష్‌కు బెయిల్ రాలేదు. దీంతో జైల్లోనే జోగి సోదరులు ఇంకా జైల్లోనే ఉండనున్నారు జోగి రమేష్‌ను విజయవాడ జిల్లా జైలు నుంచి చెయ్యి నొప్పి కారణంగా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జైలుకు తరలించారు. నకిలీమద్యం తయారీకి సంబం >>2

# అభివృద్ధిలో చేతులు కలపండి

**లోకల్ బ్రాండ్‌ల కోసం ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహం**

**దావోస్‌లో 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' విధానాలపై చర్చలో సిఎం చంద్రబాబు**

**సచివాలయం,జనవరి 20,ప్రభాతవార్త :** అభివృద్ధి అనేది ఏ ఒక్కరికో పరిమితం కాకూడదని...అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి ..అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.ఈ ఉద్దేశ్యంతోనే ఎపి ప్రభుత్వం ఒన్ ఫ్యామ్లీ--ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన సిఎం చంద్రబాబు నాయుడు తన పర్యటనలో భాగంగా రెండో రోజైన మంగళవారం వివిధ పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు.దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒన్ ఫ్యామ్లీ-ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానంపై ప్రపంచ ఆర్థిక సదస్సులో చర్చ జరిగింది.ఒన్ ఫ్యామ్లీ--ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానాన్ని తెచ్చి ఏపి ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి చొరవ తీసుకుందని చర్చా వేదికలో పాల్గొన్న ప్రతినిధులు కితాబు ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి సాధించేలా...ఆదర్శవంతంగా ఉండే విధానాన్ని తీర్చి దిద్దారని ఏపి సీఎంను ప్రశంసించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అభివృద్ధిలో అందర్ని భాగస్వాములను చేసే ఉద్దేశ్యంతోనే ఒన్ ఫ్యామ్లీ--ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానం తెచ్చాం.ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలకు మేలు జరగాలి.ఓ తరం అభివృద్ధి చెందాలి.నా ఆలోచన ఎప్పుడూ ప్రజా సంక్షేమం,రాష్ట్రాభివృద్ధి కోణంలోనే ఉంటాయి.ప్రపంచ వ్యాప్తంగా ఉండే టెక్నాలజీలను,పరిణామాలను అందిపుచ్చుకునేలా ఆలోచన చేయాలి.భారతదేశం ఇప్పుడు ఉత్పత్తి రంగం వైపు వేగంగా అడులుగు వేస్తుంది.దాన్ని అందిపుచ్చుకునే దిశగా మేం ఒన్ ఫ్యామ్లీ--ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానం తెచ్చాం అని సీఎం వెల్లడించారు.

**గైడెన్స్ ఇస్తున్నాం....ఇన్ఫ్రా ఏర్పాటు చేస్తున్నాం..**

ఒన్ ఫ్యామ్లీ--ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ అనే విధానం తేవడమే కాదు.దీనికి అవసరమైన గైడెన్స్ ఇస్తున్నాం...మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.రతన్ టాటా ఇన్నోవేషన్ ద్వారా స్టార్టప్ కంపెనీలకు,ఒన్ ఫ్యామ్లీ--ఒన్ ఎంటర్‌ప్రెన్యూయర్ ద్వారా పారిశ్రామికవేత్తలు కావాలనుకునే వారికి గైడెన్స్ ఇస్తాం.పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ఇన్‌ఫ్రాను సిద్ధం చేస్తున్నాం.అలాగే వినూత్న ఆలోచనలతో ఉన్న వారిని ప్రోత్సహించేందుకు పి-4 అనే వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నాం.పీ-4 ద్వారా పేదరికాన్ని తగ్గించడంతోపాటు..కొత్త ఆలోచనలు ఉన్న వారికి చేయూట ఇచ్చే విధంగా కూడా వ్యవస్థను తీర్చిదిద్దాం.ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా పారిశ్రామికాభివృద్ధిని ప్రమోట్ చేస్తున్నాం.గతేడాది మహిళా దినోత్సవం నాడు లక్షమందిని మహిళా పారిశ్రామికవేత్తలను చేస్తామని ప్రకటించాం.పురోగతి సాధించాం.ఇదే విధంగా విడతల వారీగా మహిళలను పారిశ్రామిక వేత్తలను చేసేలా ప్రోత్సహిస్తాం.

**ఉత్పత్తి ముఖ్యం...బ్రాండింగ్ అంతకంటే ముఖ్యం**

ఎపిలో 10లక్షల మందికి ఏఐ,క్వాంటం టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలని ఐబిఎంను కోరాను.నైపుణ్యం ఉన్న మానవవనరులును కంపెనీలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.ఇలా చేయగలిగితేనే రాష్ట్రాభివృద్ధితో పాటు ..ప్రజలు కూడా అభివృద్ధి సాధించగలుగుతారు.ఎన్నో రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది.చాలా పరిణామాలు చోటు చేసుకుంటాయి.అదనపు విలువ జోడించినప్పుడే అభివృద్ధి ఫలాలు అందుకోగలం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు వాల్యూ ఎడిషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. పారిశ్రామికవేత్తలుగా ఎదిగాక.ఉత్పత్తులను తయారు చేయడమే కాదు..వాటికి బ్రాండింగ్ కూడా ముఖ్యం.ఏపి ఉత్పత్తులకు బ్రాండింగ్ వచ్చేలా మేం కృషి చేస్తున్నాం.డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేలా తీసుకుంటున్నాం.రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి వచ్చేవారిని మేం అతిథుల్లా చూస్తాం.. గౌరవిస్తాం.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు ఇస్తాం...అని ముఖ్యమంత్రి చెప్పారు.

## 28 నుంచి బడ్జెట్ పార్లమెంటు

**27న అఖిలపక్ష భేటీ**

**న్యూఢిల్లీ, జనవరి 20:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 28 నుంచి జరుగనున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై లోక్‌సభ స్పీకర్ ఓ వైపు ప్రిసైడింగ్ అధికారులతో సమావేశం నిర్వహించగా, కేంద్రం ప్రభుత్వం ఈ నెల 27న అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఈమేరకు పార్లమెంటులో ప్రాతినిధ్యంఉన్న అన్ని పార్టీలకు లేఖలు రాసింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు పేరుతో అన్ని పార్టీలకు లేఖలు అందాయి. బడ్జెట్‌సమావేశాలు సజావుగాసాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో విపక్ష పార్టీలను కేంద్రం కోరనుంది. ఈ సమావేశాల్లో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న బిల్లుల వివరాలను అన్ని పార్టీల ప్రతినిధులకు తెలియ జేయనుంది. రాబోయే బడ్జెట్ సమావేశాల నుండి లోక్‌సభ సభ్యుల కోసం కొత్త హాజరు విధానాన్ని ప్రవేశపెడతున్నట్లు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా తెలి పారు. సభ్యులు సభలోపల తమసీట్లలో కూర్చున్నప్పుడుమాత్రమే హాజరు నమోదు చేయబడుతుందని తెలిపారు.

## మరో పోక్సో కేసు: నిందితుడికి 20 యేళ్ల జైలు

**రూ. 3వేలు జరిమానా**

**బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం**

**విజయనగరం, జనవరి 20 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీసు స్టేషనులో 2024 నవంబర్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు బొబ్బిలి మండలం గొల్లపల్లికి చెందిన సింగారపు అజయ్ (20) అనే వ్యక్తికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించారు. అలాగే నిందితుడికి రూ.3 వేలు జరిమానా విధించడంతో పాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలను మంజూరు చేయాలని జడ్జి ఆదేశాలు జారీచేశారు. వివరాల్లోకి వెళితే.. బొబ్బిలి మండలం, గొల్లపల్లి గ్రామంలో ఒక మైనరు బాలిక తన అమ్మమ్మ వాళ్ల ఇంటిలో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుకొనుటకు రోజూ బొబ్బిలి వెళ్లి వస్తుండేది. సింగారపు అజయ్ ఆ మైనరు బాలికను ప్రేమ పేరుతో >>2


మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న డి.సిఎం పవన్

## 50% గ్రీన్ కవర్ ఉగాది నుంచి అమలు

**దీనిలో అన్ని శాఖలు భాగస్వాములు కావాలి**

**కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటాలి: డిసిఎం పవన్**

**విజయవాడ.జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు కావాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ.. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని నిర్దేశం చేశారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి >>2

## ఉగాదికి 700 అన్నా క్యాంటీన్లు 2లో

# ఆ గవర్నర్లకు కోపమొచ్చింది!


తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి


కేరళ గవర్నర్ విశ్వనాథ్ అర్లేకర్

**తమిళనాడు అసెంబ్లీ నుంచి ఆర్ఎన్ రవి వాకౌట్**

**కేరళ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం వివాదాస్పదం**

**గవర్నర్ల తీరుపై స్టాలిన్, విజయన్ మండిపాటు**

**స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన కేరళ సిఎం**

**రాజ్యాంగ సవరణ చేయాలన్న తమిళ ముఖ్యమంత్రి**

**చెన్నై/ తిరువనంతపురం, జనవరి 20:** దేశంలో పలు రాష్ట్రాలలో ప్రధానంగా దక్షిణాదిలో గవర్నర్లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. చట్టసభల్లో ఆమోదం పొందిన బిల్లులను రాజ్‌భవన్‌లకు పంపగా, వారాలు, నెలల తరబడి పెండింగ్ పెట్టడం. ఆ వివాదం చివరకు దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరిన విషయం తెలిసిందే.

తాజాగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ల వ్యవహరించిన తీరుపై ఆ రాష్ట్రాలలోని పాలక పక్ష పార్టీలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి.

**దక్షిణాదిన ముదురుతున్న సెంట్రల్ వర్సెస్ స్టేట్ వార్..**

ఒకే రోజు రెండు దక్షిణాది రాష్ట్రాల్లో గవర్నర్ల తీరు వివాదాస్పదం కావడం విశేషం.

ఇక అసలు విషయానికొస్తే, ఏడాది తొలి శాసనసభ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం చేయాల్సి ఉండగా.. ఆయన తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపివేసి సభ నుంచి వాకౌట్ చేయడం దేశవ్యాప్తంగా >>2



మంగళవారం న్యూఢిల్లీలో రిటర్నింగ్ ఆఫీసర్ కె.లక్షణ్ చేతుల మీదుగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సర్టిఫికెట్ అందుకుంటున్న నితిన్ నబీన్

# నబీన్ నా బాస్

>> నరేంద్ర మోడీ, బిజెపి మాజీ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొత్త అధ్యక్షుడిగా నితిన్ బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షుడిని ప్రధాని సహా పలువురు నేతలు సత్కరించి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. "మోడీ దేశానికి ప్రధానమంత్రి అని, మూడోసారి ప్రధాని అయ్యారని, 50ఏళ్ల చిన్న వయసులో ముఖ్యమంత్రి అయ్యారని, 25 ఏళ్ల నుంచి నిరంతరంగా పాలిస్తున్నారని ప్రజలు అనుకోవచ్చు. అదంతా నిజమే కానీ, నా జీవితంలో వీటన్నింటికంటే గొప్పది మరొకటి ఉంది. మొదట తాను బిజెపి కార్యకర్తను. అదే నాకు గొప్ప గర్వం. పార్టీ విషయానికొస్తే నేను ఒక కార్యకర్తను. ఇప్పుడు నితిన్ నబీన్ నా బాస్" అని పేర్కొన్నారు. పార్టీ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రజాస్వామ్యబద్ధంగా సంస్థాగత ఎన్నికలు జరిగాయని తెలిపారు. "ప్రభుత్వ అధినేతగా నాకు ఎంత అనుభవం ఉన్నా, అన్నింటి కంటే ముందు నేను బిజెపి కార్యకర్తను. ఈ విషయంలో గర్వపడతాను" అని మోడీ పునరుద్ఘాటించారు. "ప్రజలకు సేవ చేయడం బిజెపికి ఎల్లప్పుడూ అత్యంత ముఖ్యమైనదన్నారు. తాము అధికారాన్ని ఆనంద సాధనంగా కాకుండా సేవ మాధ్యమంగా మార్చాం. అందువల్ల బిజెపిపై ప్రజల విశ్వాసం నిరంతరం బలపడింది. గత 11 సంవత్సరాల గురించి మాట్లాడుకుంటే, బిజెపి ప్రయాణం ప్రజల విశ్వాసాన్ని సంపాదించే అద్భుతమైన ప్రయాణం" అని ప్రధాని మోడీ వివరించారు. "వికసిత భారత్ నిర్మాణానికి రానున్న 25 ఏళ్లు చాలా కీలకం. ఈ ముఖ్యమైన సమయంలో నితిన్ నబీన్ పార్టీని ముందుకు నడిపిస్తారు. ఆయన ఒక మిలీనియల్ (జనరేషన్ వై... జెన్ జెడ్‌కు ముందు తరం), యువ శక్తితో పాటు సంస్థాగత అనుభవం కూడా ఉంది" అని ప్రధాని ప్రశంసించారు.అటల్ జీ, అద్వానీజీ నుంచి జెపి నడ్డా వరకు పార్టీ అధ్యక్షులుగా చేసిన సేవలను మోడీ గుర్తు చేసుకున్నారు. నాయకులు మారినా పార్టీ సిద్ధాంతాలు, దిశ మారవని స్పష్టం చేశారు. అనంతరం మాజీ అధ్యక్షుడు జెపి నడ్డా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన యువకుడైన నితిన్ నబిన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం చరిత్రాత్మకమని అన్నారు.

### ఉగాదికి రాష్ట్ర వ్యాప్తంగా
# 700 అన్నా క్యాంటీన్లు

**విజయవాడ.జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉగాది రోజున రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో 700 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు దిశగా ముహూర్తం ఫిక్స్ చేసారు. ఉగాది నాటికి రెండు నిర్ణయాలు అందుబాటులోకి తీసు కొచ్చే విధంగా నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రయోజనం దక్కనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన వేళ ఈ మేరకు కొత్త నిర్ణయాలు ప్రకటించారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు మరో హామీ అమలు దిశగా స్పష్టత ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల విస్తరణ.. పేదలకు ఇళ్ల పథకం అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు పలు ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఇక.. గ్రామీణ ప్రాంతంలోనూ ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేసారు. ఉగాది నాడు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో 700 అన్నా క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించారు.
అదే విధంగా పేదలకు ఇళ్ల పథకం పైనా ప్రకటన చేసారు. ఉగాది నాడు రాష్ట్ర వ్యాప్తంగా అయిదు లక్షల కొత్త ఇళ్లను లబ్ధిదారులకు అందించి.. ఒకే ముహూర్తాన గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఉగాదినుంచి మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు అవుతాయన్నారు. మండల కేంద్రాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేల నుంచి వినతులు వచ్చాయని.. దీనికి అనుగుణంగా సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.
తొలుత ప్రభుత్వం ఈ సంక్రాంతికే కొత్త అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని భావించింది. అయితే, ఉగాది నుంచి ప్రారంభించాలని డిసైడ్ అయ్యారు. ఇక, వచ్చే మూడేళ్లల్లో 17 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. ఇళ్ల లబ్ధిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తేల్చిచెప్పారు. ఇప్పటి నుంచే లక్ష్యాలు పెట్టుకుని హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమా న్ని 2029 జనవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం గుర్తించిన లబ్ధిదారులే కాకుండా ఇంకా అర్హులైన వారిని గుర్తించి చేర్చేందుకు చేస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేసి జాబితా సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు.
ఆ జాబితాను గ్రామాల వారీగా ప్రదర్శించాలని చెప్పారు. ప్రజలు తృప్తి చెందితేనే తనకు సంతృప్తి అని వెల్లడించారు. గృహ నిర్మాణాల్లో భాగంగా ఎవరైనా స్థలం కావాలని అడిగితే స్థలం ఇవ్వాలని, తమకు స్థలాలు ఉన్నాయని లబ్ధిదారులు చెబితే వాళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతి పురోగతి ఆన్‌లైన్‌లో ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

# టెక్నాలజీలో ఎపి ముందంజ

>> అంశాలపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుపెట్టుబడుల్లో 25 శాతం ఎపి ఆకర్షించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు.సెషన్‌కి హాజరైన జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను స్వయంగా దగ్గరకు వెళ్లి ఆత్మీయంగా పలకరించిన సిఎం చంద్రబాబు భారత్ కేంద్రంగా అభివృద్ధి ఎపి సానుకూలతలపై వారికి వివరించారు.దశాబ్దాలుగా దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరవుతున్నానని దావోస్‌కు వచ్చిన ప్రతిసారీ పారిశ్రామికవేత్తలు, నిపుణుల నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటూన్నా, కొత్త ఆలోచనలు పంచుకుంటూన్నా అని చంద్రబాబు అన్నారు.
టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులను తెలుసుకుని పాలసీలు రూపొందిస్తానని వెల్లడించారు. దావోస్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల ఆలోచనలు అర్థం చేసుకుని రాష్ట్రాన్ని బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్‌గా మారుస్తున్నామని తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీ దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తుందని సంపద సృష్టి జరుగుతుందని వ్యాఖ్యానించారు. భారతీయులు, అందులోనూ తెలుగు ప్రజలు టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందుంటారని స్పష్టం చేసారు. మరే దేశంలో లేని యువశక్తి భారత్‌లో ఉందన్నారు. దేశానికి నేడు తిరుగులేని సమర్థ నాయకత్వం ఉందని తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీ దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తుంది. సంపద సృష్టి జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఏ రంగంలో అయినా పెట్టుబడులకు భారతదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అత్యుత్తమ గమ్య స్థానాలు. 2047కు భారత్ ప్రపంచ శక్తిగా మారుతుంది. ప్రతి ఒక్కరూ ఈ గ్రోత్ స్టోరీని చూస్తారు. గతంలో పారిశ్రామిక వేత్తలను ఏపీకి తేవాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేది. ప్రస్తుతం తెలుగు ప్రజల విజయాలు, ఎపి బ్రాండ్ సానుకూల అంశంగా మారాయి. ప్రతీ రంగంలో నిర్దిష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది అన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. 1000 కిలోమీటర్లకు పైగా సముద్ర తీరం, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఏపీకి ఉన్న బలం.వచ్చే 3, 4 ఏళ్లలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోంది. ఎపికి వచ్చి అమలు చేస్తున్న పాలసీలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితుల్ని స్వయంగా చూడాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాను,స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లాంటి విధానాలను పరీక్షించాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను
ఏపీకి వచ్చి అమలు చేస్తున్న పాలసీలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితుల్ని స్వయంగా చూడాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లాంటి విధానాలను పరీక్షించాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఎపికి మించిన అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానం మరొకటి లేదని ఎపి పారిశ్రామికవేత్తలకు అతిపెద్ద మార్కెట్ అవుతుందని స్పష్టం చేశారు. ఇక ప్రపంచ ఆర్థిక సదస్సులో పార్టనర్ విత్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్, ఝార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్, గుజరాత్ ఉపముఖ్యమంత్రి హర్ష్ రమేశ్ కుమార్ సంఘవి, కేరళ మంత్రి పి.రాజీవ్, యుపి మంత్రి సురేశ్ కుమార్ ఖన్నా, తెలంగాణా మంత్రి డి.శ్రీధర్ బాబులు హాజరయ్యారు. అంతర్జాతీయ జాతీయ వేదిక ప్రపంచ ఆర్థిక సదస్సులో నేషన్ ఫస్ట్ అనే స్ఫూర్తిని చాటేలా ఇండియా లాంజ్ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. టీమ్ ఇండియాగా

# గూగుల్ తలుపు తెరవండి

>> సిఎం చంద్రబాబు గూగుల్ క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్ కోరారు,.గూగుల్ ఎఐ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ కేవలం పెట్టుబడుల గమ్యస్థానం మాత్రమే కాదని, అది ఒక వ్యూహాత్మక ప్రయోజనం (స్ట్రాటజిక్ అడ్వాంటేజ్) అని థామస్ కురియన్‌కు సిఎం చంద్రబాబు వివరించారు. 'భారత్‌లోకి వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో దాదాపు నాలుగో వంతు వాటాతో, మా వ్యాపార నిర్వహణ వేగం ఎపిని ఒక ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టింది. దీర్ఘకాలిక వృద్ధి కోసం మాతో భాగస్వాములు కావాలని ప్రపంచ పరిశ్రమలను ఆహ్వానిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.
2047 నాటికి భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతుందని, ఈ పరివర్తనలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో నిలుస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని వెల్లడించారు. భారతీయులు, ముఖ్యంగా తెలుగు ప్రజలు టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందున్నారు. టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలం. ప్రపంచంలో మరే దేశానికీ లేని యువశక్తి భారత్‌కు ఉంది. దేశానికి ప్రస్తుతం అసమానమైన, సమర్థవంతమైన నాయకత్వం ఉంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామికవేత్తలను తీసుకురావడం చాలా కష్టంగా ఉండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. తెలుగు ప్రజల విజయాలు, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఒక సానుకూల అంశంగా మారాయి" అని చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ పాల్గొన్నారు.
**వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్ మూర్తితో సీఎం చంద్రబాబు భేటీ**
దావోస్‌లోనే వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్ మూర్తితో సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎపిలో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మేధోసంపత్తి హక్కుల రక్షణ, స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి, పరిశోధన-అభివృద్ధి, పేటెంట్ వ్యవస్థ బలోపేతం అంశాలపై ఇరువురు మధ్య చర్చ జరిగింది.ఆర్థిక వృద్ధికి ఆవిష్కరణలు కీలకమని, ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ, ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో స్టార్టప్ వ్యవస్థకు డబ్ల్యుఐపీఓ సహకారం అందించాలని సిఎం చంద్రబాబు ప్రతిపాదించారు. వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్ మూర్తి సిఎం ప్రతిపాదనలపై సానుకూల రీతిలో స్పందించారు.అభివృద్ధిని నూతన ఆవిష్కరణలతో ముందుకు తీసుకుని వెళ్లాలన్న సిఎం చంద్రబాబు

### వారం - వర్జ్యం

21-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం,ఉత్తరాషాఢ కార్తె
తదియ రా.2.46, ధనిష్ఠ మ.1.55
వర్జ్యం : రా.9.16-10.54
దు. ఉ.11.56-12.41
శుభసమయం : ఉ.6.30-7.30,
సా.6.30-7.10
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలు చేస్తారు. మానవసేవే మాధవసేవని సమ్మతారు.

**వృషభం:** నూతన కాంట్రాక్టులకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటారు. పెట్టుబడులకు అనుకూల కాలం.

**మిథునం:** ఉద్యోగులకు పదోన్నతుల సూచన. అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. వాహనాలు కొనుగోలు.

**కర్కాటకం:** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**సింహం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. దూరప్రాంత నుండి శుభ వార్తలు అందుకుంటారు. వస్తు కొనుగోలు.

**కన్య :** మనస్సు మారుమూలలోని ఆశ నెరవేరేటట్లు తోస్తుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.క్రయ విక్రయాలలో లాభాలు.

**తుల :** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. శ్రమ అధికం.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగావకాశాలు అనుకూలిస్తాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి.

**మకరం:** ఏకాగ్రత లోపించడం వల్ల కొన్ని కార్యక్రమాలను వాయిదా వేస్తారు. ఆరోగ్య సూత్రాలు పాటించండి.

**కుంభం:** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి.

**మీనం:** మనోధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో శ్లాఘించ బడతాయి. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 50% గ్రీన్ కవర్ ఉగాది నుంచి అమలు

>> వృక్ష జాతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత వర్గాలకు సూచనలు చేశారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపు ప్రాజెక్టుకి సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. రాష్ట్రం మొత్తం భూ భాగంలో 2047 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ లక్ష్యంలో భాగంగా 2030 నాటికి 37 శాతం పచ్చదనం నింపాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం గ్రీనరి ఉండగా.., వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం గ్రీనరీ పెంచాల్సి ఉంది. అందుకోసం 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలి. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు భాగస్వామ్యం పోషించాల్సి ఉంది. అందులో ఉద్యానవన శాఖ 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాల్సి ఉంది అన్నారు.
వీటితోపాటు అటవీ, పర్యావరణ శాఖలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలు, నీటిపారుదల శాఖ, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, పరిశ్రమల శాఖ, వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న రైల్వే తదితర శాఖలు తమ తమ పరిధిలో లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు. జాతీయ రహదారులకి ఇరువైపులా మొక్కలు నాటే సంప్రదాయం ఉంది. దీన్ని రాష్ట్ర పరిధిలోని రహదారుల నిర్మాణంలోనూ అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 50 శాతం గ్రీనరీ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు సిఎంతో చర్చిస్తాం.. లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసే బాధ్యతను యంత్రాంగం నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్లాలి. అన్ని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఫిబ్రవరి 5వ తేదీన జరిగే తదుపరి సమావేశానికి పూర్తి స్థాయి ప్రణాళికలతో రావాలని అన్నారు.

# ఆ గవర్నర్లకు కోపమొచ్చింది!

>> సంచలనం సృష్టించింది.
**జాతీయగీతం వివాదం.. మైక్ కట్ ఆరోపణలు**
సమావేశం ప్రారంభంలో తమిళతల్లి ప్రార్థనా గీతం ముగిసిన వెంటనే.. జాతీయ గీతం ఆలపించాలని గవర్నర్ సభాపతిని కోరారు. అయితే సభా నిబంధనల ప్రకారం ప్రసంగం ముగిసిన తర్వాతే జాతీయ గీతం ఆలాపాన ఉంటుందని ప్రభుత్వం నిరాకరించడంతో వివాదం మొదలైంది. ముఖ్యంగా జాతీయ గీతాన్ని పాడడం లేదన్న కోపంతో.. గవర్నర్ ఆర్.ఎన్ రవి వెంటనే అక్కడి నుంచి వాకౌట్ చేశారు. అయితే దీనిపై స్పందించిన రాజ్‌భవన్.. "తమిళనాడు ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే జాతీయ గీతాన్ని అవమానిస్తూ, ప్రాథమిక రాజ్యాంగ విధిని విస్మరించింది. అంతేకాకుండా గవర్నర్ మాట్లాడుతున్న సమయంలో ఆయన మైక్‌ను పదేపదే స్విచ్ ఆఫ్ చేశారు" అని ఒక ప్రకటనలో ఆరోపించింది.
గవర్నర్ తీరుపై ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రంగా మండిపడ్డారు. గవర్నర్ సభ నుంచి వాకౌట్ చేయడం సంప్రదాయాలకు, నైతికతకు విరుద్ధమని అన్నారు. "ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ కాపీలో గవర్నర్ తన సొంత అభిప్రాయాలను చేర్చాలని చూడటం రాజ్యాంగ విరుద్ధం. కావాలనే సభను అవమానించడానికి ఆర్.ఎన్. రవి ఇలాంటి పనులు చేస్తున్నారు. ఆయనకు రాష్ట్ర సంక్షేమం కంటే రాజకీయాలే ముఖ్యం అయ్యాయి" అని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
**కేరళ అసెంబ్లీలోనూ వివాదం..**
బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తన సాంప్రదాయక ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం కాపీలోని పలు అంశాలను చదవకపోవడంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. మంత్రిమండలి ఆమోదించిన ప్రసంగం కాపీలోని రెండు భాగాలను గవర్నర్ చదవకుండా వదిలేశారని సిఎం పినరయి విజయన్ పేర్కొన్నారు. అర్లేకర్ సభ నుంచి వెళ్లిన తర్వాత సిఎం ప్రసంగిస్తూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రసంగం కాపీలో 12వ పేరా ప్రారంభ అంశాలను, 15వ పేరా ముగింపు అంశాలను గవర్నర్ చదవలేదని స్పీకర్ దృష్టికి సిఎం తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం.. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విధాన ప్రసంగాన్నే అధికారికంగా భావిస్తామని పేర్కొన్నారు. కొన్ని అంశాలను వదిలేస్తూ.. గవర్నర్ చేసిన ప్రసంగాన్ని అధికారికంగా గుర్తించబోమని స్పీకర్ స్పష్టం చేశారు. దీంతో గవర్నర్ దాటవేసిన అంశాలు కూడా అసెంబ్లీ రికార్డుల్లో భాగం కానున్నాయి.
తమిళనాడులో ఆర్.ఎన్. రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయగా.. కేరళలో అర్లేకర్ ప్రసంగ పాఠాన్ని సవరించడం ద్వారా చర్చకు తెరలేపారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వారు ప్రభుత్వ విధానాలకు అద్దం పట్టాల్సి ఉండగా.. ఇలాంటి ఘర్షణలు ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.




మంగళవారం జ్యూరిచ్‌లో ఎవో సినర్జిటిక్ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి నారా లోకేష్ భేటీ దృశ్యం

# పోర్టుల్లో హైడ్రోజన్ కోపైలట్ వాహనాలను అభివృద్ధి చేయండి

### ఎవో సినర్జిటిక్ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి నారా లోకేష్

**జ్యూరిచ్ (స్విట్జర్లాండ్):** స్పెయిన్‌కు చెందిన ఎవల్యూషన్ సినర్జెటిక్ ఆటోమోటివ్ ఎస్ఎల్ (ఇవిఓ) సంస్థ ఎండి జోస్ మెల్లాడోతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్, జీరోఎమిషన్ వెహికల్స్ (జడ్ఇవి) రంగాల్లో అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు ఆసక్తిగా ఉంది. రాష్ట్రంలోని లైవ్ పోర్ట్ వాతావరణం, ఇండస్ట్రియల్ పార్కులు, ఇంజనీరింగ్ సాండ్‌బాక్స్‌లను అందిస్తూ ఎపి గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను సాకారం చేయబోతోంది. కాంప్లెక్స్ వెహికల్స్, మొబిలిటీ సిస్టమ్స్ అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన ఎవో సంస్థ ఆధ్వర్యాన వైజాగ్/ కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్ ట్రాక్టర్స్ పైలట్ వాహనాలను అభివృద్ధి చేయండి.
ఎపి పారిశ్రామిక పార్కుల్లో ఎలక్ట్రిక్/ హైడ్రోజన్ ఆఫ్‌రోడ్ వాహనాల కోసం కో పైలట్‌ను అభివృద్ధి చేసి, రీడిజైన్, ఆప్టిమైజేషన్‌కు నేతృత్వం వహించండి. ఇందుకు అవసరమైన టెస్ట్ బెడ్‌లు, అనుమతులను ఎపి ప్రభుత్వం అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రారంభదశ ఆవిష్కరణలను ప్రోత్సహించాలని భావిస్తోంది. ఎవో పైలట్లకు మద్దతుగా ప్రోటో టైప్ అభివృద్ధికి, ఇంజనీర్ల శిక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరిస్తుంది. ఇండస్ట్రియల్ లేదా అకడమిక్ క్యాంపస్‌లో చిన్న ఇంజనీరింగ్ శాండ్ బాక్స్‌ను అందిస్తుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

### మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ 2026 విడుదలయ్యింది. మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు జరగనున్నాయి. దీనిని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ నవంబర్ 21, 2025న విడుదల చేసింది. ఈ పరీక్షలు మార్చి 16 ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయి. విద్యార్థులు పూర్తి షెడ్యూల్‌ను అధికారిక వెబ్ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫిజిక్స్, కెమిస్ట్రీలను వేర్వేరు పేపర్లుగా నిర్వహిస్తారు.
**పరీక్షల తేదీలు**
మార్చి 16న ఫస్ట్ ల్యాంగ్వేజ్
మార్చి 18న ఫస్ట్ ల్యాంగ్వేజ్ మార్చి 20న ఇంగ్లీష్
మార్చి 23న గణితం
మార్చి 25న భౌతికశాస్త్రం (ఫిజిక్స్)
మార్చి 28న జీవశాస్త్రం (బయాలజీ)
మార్చి 30న సాంఘికశాస్త్రం (సోషల్ స్టడీస్)
మార్చి 31న మొదటి భాష (పేపర్2)
ఏప్రిల్ 1న ఓఎస్ఎస్‌సీ రెండవ భాష (పేపర్2)
జరుగుతాయి

# బెయిలు మంజూరు

>> ధించి జోగి రమేష్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జోగి సోదరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు జోగి సోదరులను విచారించారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విచారణ ఆధారంగా పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు.

### వివేకా హత్య కేసులో తదుపరి విచారణ
# అవసరమని భావిస్తున్నారా?
## సిబిఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
### తదుపరి విచారణ ఫిబ్రవరి5కు వాయిదా

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎవరిని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలని అనుకుంటున్నారో చెబితే ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని సిబిఐకి సుప్రీం కోర్టు తెలిపింది. ఇదే అంశంపై విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది న్యాయస్థానం. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తుపై ట్రయల్ కోర్టు తీర్పును వివేకా కుమార్తె సునీతా రెడ్డి సుప్రీంలో సవాల్ చేశారు. సునీత పిటీషన్‌పై జస్టిస్ ఎంఎం.సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది.సునీత తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ట్రయల్ కోర్టుకు వెళ్లామని.. అక్కడ తదుపరి దర్యాప్తు అవసరమని పిటిషన్‌లో తాము పేర్కొన్న అంశాల్లో ఏ ఒక్కటీ ట్రయల్ కోర్టు పరిగణలోకి తీసుకోలేదన్నారు. అంతేకాకుండా పిటిషన్‌లో పేర్కొనని అంశాలను పరిగణలోకి తీసుకుని పరిమితమైన మేరకే పాక్షికంగా దర్యాప్తునకు అనుమతి ఇచ్చారని.. అది న్యాయబద్ధం కాదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వివేకా కేసును పాక్షికంగా దర్యాప్తునకు అనుమతించడమేంటి.. అని లూథ్రా ధర్మాసనం ముందుకు తీసుకెళ్లారు.
ఈ సందర్భంగా.. జస్టిస్ ఎంఎం.సుందరేశ్ జోక్యం చేసుకుని.. వివేకా హత్య కేసులో తదుపరి విచారణ అవసరమని భావిస్తున్నారా? అని సిబిఐని ప్రశ్నించింది. ఏయే అంశాలపై తదుపరి విచారణ అవసరమో స్పష్టంగా చెప్పాలని సీబీఐని కోరింది. ఎవరిని కస్టడీలోకి తీసుకొని విచారించాలని అనుకుంటున్నారో కూడా చెబితే దాన్ని పరిగణలోకి తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఇంకా ఎవరినైనా విచారించాల్సిన అవసరముందా అనేది ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను అడిగి చెప్పగలమని.. దీనికి రెండు వారాల సమయం కావాలని సీబీఐ తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ క్రమంలో తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది సుప్రీం ధర్మాసనం.

# నిందితుడికి 20 యేళ్లు జైలు

>> వెంటపడి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. మోసపోయానని గ్రహించిన బాలిక బొబ్బిలి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా, గత ఏడాది నవంబర్ 24న ఎస్ఐ రమేష్ పోక్సో కేసు నమోదు చేశారు. బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్ట్ చేసి, రిమాండుకు తరలించి, నిందితుడిపై న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారు. ఈ కేసులో ప్రాసిక్యూషను త్వరితగతిన పూర్తి చేసేటట్లు పోలీసు, జ్యుడిషియల్ అధికారులు చర్యలు చేపట్టారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. నిందితుడు సింగారపు అజయ్‌పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి నిందితుడికి 20 సంవత్సరాలు కఠిన కారాగారం, రూ. 3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షల మంజూరు చేస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారన్నారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసుల తరుపున పోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎస్.రామమూర్తి నాయుడు వాదనలు వినిపించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసి, నిందితుడిని శిక్షించబడే విధంగా సమర్థవంతంగా పని చేసిన అప్పటి బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఆర్.రమేష్, సి.ఎం.ఎస్. హెచ్సి సిహెచ్.రామకృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబులు ఎం.మన్మధరావు, స్పెషల్ పిపి ఎస్.రామమూర్తి నాయుడులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌కు యుఎఇ అంగీకారం

**- యుఎఇ ఆర్థిక మంత్రి అల్ మార్రీతో సిఎం చంద్రబాబు భేటీ - మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుపైనా చర్చ**



యూఎఇ ఆర్థిక మంత్రి అల్ మార్రీతో సిఎం చంద్రబాబుతో సహా మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ తదితరులు

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థికపర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ - యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో యూఏఈ దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు అల్ మార్రీ అంగీకారం తెలిపారు.

అలాగే యూఈఏకి చెందిన సుమారు 40 సంస్థలు ఏపీలో ఏర్పాటు చేసేలా తోడ్పాటు అందిస్తామన్నారు. మరోవైపు ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదక శక్తి, పట్టణాభివృద్ధి, పర్యాటకం, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను అల్ మార్రీకి ముఖ్యమంత్రి వివరించారు. యూఏఈకి చెందిన షరాఫ్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై చర్చ జరిగింది. లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమింగ్ సాంకేతికతతో అమరావతిలో ఆధునిక నిర్మాణ యూనిట్ ఏర్పాటు, డీపీ వరల్డ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద స్థాయి పోర్ట్ టెర్మినల్స్, లాజిస్టిక్స్ మౌలిక వసతుల అభివృద్ధి,. ఏడీఎన్‌ఓసీ సంస్థ ద్వారా ఫ్లోటింగ్ స్టోరేజ్, రీగ్యాసిఫికేషన్ యూనిట్ ఏర్పాటు,విశాఖలో లూలూ గ్రూప్ మెగా షాపింగ్ మాల్ నిర్మాణంపైనా చర్చించారు. యూఏఈతో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఏపీలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఎగుమతులు మరింత వేగంగా పెరుగుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ భవిష్యత్‌లో యూఏఈ ప్రభుత్వంతో పాటు ప్రముఖ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ పాల్గొన్నారు.



## తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6.30 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం తో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు రెడ్డి నాలుగు, స్వర్ణకుమార్ రెడ్డి ఏడు, చెన్నైకి చెందిన శ్రీ శ్రీనివాస్ ఒకటి ఆలయానికి మొత్తం 12 పరదాలను విరాళంగా అందించారు.

## ఎపిఆర్‌సెట్2024 అభ్యర్థులకు ఫిబ్రవరి రెండు నుంచి ఇంటర్వ్యూలు

**విజయవాడ. జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఆర్సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. షెడ్యూల్‌ను మండలి కార్యదర్శి బి. తిరుమపతిరావు సోమవారం విడుదల చేశారు. అర్హత సాధించిన వారికి ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఫిబ్రవరి 6 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యా లయం, వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్టీయూ అనంతపురం, జేఎన్టీయూ కాకినాడ ప్రాంగణాల్లో ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి తిరుపతి లో వెల్లడించారు.

# బాధ్యతలు స్వీకరించిన ఆర్టీఐ నూతన కమిషనర్లు

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి :**ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీఐ నూతన కమిషనర్లు మంగళవారం బాధ్యతలను స్వీకరంచారు.ఇటీవల వారిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వారిచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ఆర్టీఐ చీఫ్ కమిషనర్ వజ్జా శ్రీనివాస రావు ప్రమాణం చేశారు.పరవాడ సింహాచలం నాయుడు, వంటేరు రవిబాబు, గాజుల ఆదెన్న, శరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటిలు పదవీ బాధ్యతలు స్వీకరించారు.నియామకాలను ఖరారు చేస్తూ.. ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ కమిషన్‌లో ఇప్పటికే ముగ్గురు సభ్యులు ఉండగా.. తాజా నియామకంతో కమిషన్‌లో సభ్యుల సంఖ్య పెరిగింది. ఈ నియామకాలతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవుతుందని.. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత మెరుగవుతుందని సర్వత్రా ఆశాభావం వ్యక్తమవుతోంది. రాష్ట్ర సమాచార హక్కు(ఆర్టీఐ) కమిషన్‌కు ఏపీ ప్రభుత్వం కొత్త సారథులను నియమిస్తూ.. ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ఎంపిక చేసింది. అలాగే మరో నలుగురు వి.శరత్ చంద్ర కల్యాణ్ చక్రవర్తి, గాజుల ఆదెన్న(అనంతపురం), ఒంటేరు రవిబాబు(కడప), పరవాడ సింహాచలం నాయుడు(విశాఖపట్నం) సమాచార కమిషనర్లుగా నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. నూతనంగా నియమితులైన వారంతా న్యాయవాదులే. వీరంతా మూడేళ్ల లేదా వారికి 65 ఏళ్లు వచ్చే వరకు(ఏది ముందైతే అది) ఈ పదవిలో కొనసాగనున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రులతో కూడిన సెలెక్షన్ కమిటీ చేసిన సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలిపింది. నియమితులంతా ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఆర్టీఐ ఉన్నతాధికారులు, నూతన కమిషనర్ల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంతృప్తికర 'అన్నం' వడ్డింపేదీ?

**వెంగమాంబ అన్నప్రసాదానికి భిన్నంగా పిఎసిలలో వితరణ - భక్తుల పెదవివిరుపు**




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా టిటిడి అన్నప్రసాద విభాగం వితరణ చేస్తున్న ప్రసాదాలపై పలువురు భక్తులు పెదవి విరుస్తున్నారు. తిరుమలకు వస్తున్న భక్తుల కోసం పలుచోట్ల అన్నప్రసాదాలను వితరణ చేసే కౌంటర్లు నిర్వహిస్తున్నారు. ఈ కౌంటర్లలో శ్రీవారి సేవ కులు, టిటిడి కాంట్రాక్టు సిబ్బంది భక్తిభావంతో సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ తిరుమలలో 1.30 లక్షలమంది వరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు. దేశవిదేశాల నుండి తరలివస్తున్న భక్తులకు నిత్యం ఎంతో రుచిగా శుచిగా తరిగొండ వెంగమాంబ అన్నదానం భవనంలో ఉదయం అల్పాహారం ఉప్మా, పొంగల్, సేమియా ఉప్మా, చట్నీ,సాంబారు వడ్డిస్తున్నారు.ఆ తరువాత ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు అన్నప్రసాదాలు(తెల్లఅన్నం, సాంబారు, రసం, మజ్జిగ, వడ, బెల్లపుపొంగలి, చట్నీ, కర్రీ), సాయంత్రం 5గంటల నుండి రాత్రి 11గంటల వరకు నిరంతరాయంగా అందిస్తున్నారు. ఇక్కడ ఒక్కసారిగా నాలుగువేలమంది భక్తులు అన్నప్రసా దాలను స్వీకరిస్తున్నారు. ఈ భవనంలో రోజుకు 80వేలమంది వరకు తృప్తిగా అన్నప్రసాదాలు స్వీకరణ జరుగు తుంది. భక్తుల రద్దీగా అను గుణంగా టిటిడి అధికారులు అనేక ప్రాంతాల్లో మినీ అన్నప్రసాద భవనాలను ఉదయం 10.30 గంటల నుండి సాయం త్రం 3గంటల వరకు, తిరిగి సాయం త్రం 6గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఆయా చోట్ల మాత్రం భక్తులకు యాత్రికుల వసతి సముదాయాల్లో పిఎసి 2,4,5లో వెంగమాంబ అన్నప్రసాద భవనంలోభోజనంకంటే భిన్నంగా కేవలం సాంబారు అన్నం, పెరుగన్నం మాత్రమే వడ్డిస్తుండటంతో పలువురు భక్తులు అసంతృప్తి వెలిబుస్తున్నారు. యాత్రికుల వసతి సముదాయాల్లో అన్ని చోట్లా భక్తులకు వెంగమాంబ అన్నదానం భవనం తరహాలో అన్నప్రసాదాలు వడ్డించాలని కోరుతున్నారు. సాంబారు అన్నం ,పెరుగుఅన్నంతో సంతృప్తి చెందడంలేదనేది భక్తుల నుండి వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇక తిరుమలలోనే వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో, పిఎసి 1 వద్ద, రాంభగీచా అతిథిగృహాలు,అంజనాద్రి నిలయం కాటేజీల వద్ద భక్తులకు ఇదే తరహాలు సాంబారు అన్నం, పెరుగు అన్నంమాత్రమే విత రణ చేస్తున్నారు. అన్నప్రసాదాలను యాత్రి కుల వసతి సముదాయాల్లోనూ వెంగమాంబ భవనం తరహాలోనే వితరణ చేస్తే బావుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు అందించేందుకు ప్రధాన తరిగొండ వెంగమాంబ అన్నదానం భవనంతోబాటు అక్షయవంటశాల, వకుళమాత వంటశాల ఉన్నాయి. తిరుమలలో భక్తులు ఎవరూ ఆకలితో ఉండకూడదనే ముఖ్య ఉద్దేశ్యంతో దాతల సహకారంతో 2,300 కోట్లరూపాయలు మేరకు ఉన్న డిపాజిట్లతో వచ్చే వడ్డీద్వారానే అన్నప్రసాదాలు తయారీ, వితరణ జరుగుతోంది. అయితే తిరుపతిలోనూ కొన్నిచోట్ల ఇదే తరహాలో సాంబారు అన్నం, పెరుగుఅన్నం వడ్డించేసి చేతులు దులుపేసుకుంటున్నారనేది భక్తుల వాదన. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న భోజనశాల, తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న భోజనశాలల్లో మాత్రమే అన్నం, సాంబారు, రసం,మజ్జిగ వడ్డిస్తున్నారు. మిగిలిన అన్ని చోట్లా టిటిడి అన్నప్రసాదం విభాగం సాంబారు అన్నం, పెరుగన్నంకే పరిమితమైంది. చాలావరకు అన్నప్రసాదం వితరణ చేస్తున్న కౌంటర్ల వద్ద సాంబారు అన్నం యాత్రికులు తినలేక వృధాగా పడేస్తుండటం బాధాకరం. ఈ మెనూలో మార్పు తీసుకువచ్చి వెంగమాంబ అన్నప్రసాదం భవనం తరహాలో మెనూను అమలుచేయాలని యాత్రికులు కోరుతున్నారు.

# తిరుమల సమాచారం

## కల్యాణవేదికలో వివాహాలకు మరింత స్పందన



**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలోని కల్యాణవేదికకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25 నుండి తిరుమల పాపావినాశనం రోడ్డులోని కళ్యాణ వేదిక వద్ద టిటిడి ఉచితంగా వివాహాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. తిరుమలలోని కల్యాణ వేదికలో 2016 ఏప్రిల్ 25 నుండి 2025 డిసెంబర్ 31వ తేదీ వరకు దాదాపు 26,777 వివాహాలు అయ్యాయి. పురోహితుడు, మంగళవాయిద్యంతో పాటు పెళ్లి సమయంలో పసుపు, కుంకుమ, కంకణంను టీటీడీ ఉచితంగా అందిస్తుంది.వివాహానికి కావాల్సిన ఇతర సామాగ్రిని మాత్రం వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్లికి రాలేని పక్షంలో అందుకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించాలి.వివాహం అనంతరం 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశం ద్వారా పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెతోపాటు ఇరువురి తల్లిదండ్రులను కలుపుకుని మొత్తం ఆరు మందికి ఏటీసీ వద్ద గల క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. దర్శనానంతరం వివాహ రశీదులో ఎంతమంది ఉంటే అంతమందికి ఉచితంగా లడ్డూలను లడ్డూ కౌంటర్ వద్ద పొందవచ్చు. తిరుమలలోని కళ్యాణ వేదికలో ఉచిత వివాహాలు చేసుకునేందుకు ఆన్లైన్లో కల్యాణవేదిక స్లాటును బుక్ చేసుకునే సదుపాయాన్ని 2016 మే 9వ తేదీ నుండి టీటీడీ కల్పించింది. ఇందుకోసం టిటిడి వెబ్ సైట్ ను సంప్రదించాలి. కల్యాణవేదిక కాలమ్ లో అబ్బాయి, అమ్మాయి వివరాలను నమోదు చేయాలి. వధూవరులు తప్పనిసరిగా తల్లిదండ్రుల వివరాలను నమోదు చేయడమే కాక ఆధార్ కార్డు వివరాలను నమోదు చేయాలి. వివాహ తేది, సమయాన్ని వారే నిర్ణయించుకుని అప్లోడ్ చేస్తే అక్నాలెడ్జ్మెంట్ పత్రం జారీ అవుతుంది. ఆరుగంటల ముందు తిరుమల చేరుకుని కల్యాణ వేదిక వద్ద ఉన్న కార్యాలయంలో జిరాక్స్ పత్రాలు అక్కడి సిబ్బందికి ఇచ్చి వారి వివరాలను మరోసారి అక్కడి సిబ్బంది ద్వారా పరిశీలించుకోవాలి.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి : ప్రముఖులు



**తిరుమల,జనవరి 20 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందరిపై ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ ఛైర్మన్ తోట త్రిమూర్తులు,సభ్యులు, అనగనగా ఒకరాజు చిత్ర బృందం నటుడు నవీన్‌పొలిశెట్టి, నటి మీనాక్షిచౌదరి, దర్శకుడు మారి, రచయిత చిన్మయి, నటుడు శివబాలాజీ తదితరులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి స్థానిక అనుబంధ ఆలయాలలో ప్రత్యేకంగా కార్పస్ ఫండ్



**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధ, స్థానిక ఆలయాల వార్షిక హుండీ ఆదాయం, ఖర్చులు ఎంత వస్తోంది, ఏఏ ఆలయాలకు బడ్జెట్‌కు లోబడి ఖర్చులు అవుతున్నా యి, ఏఏ ఆలయాలలో ఆదాయానికి మించి ఖర్చులు అవుతున్నాయనే అంశాలపై అధికారులతో టిటిడి ఇఒ అనిల్ కుమార్‌సింఘాల్ చర్చించారు. ఇకపై ప్రతి ఆలయ నిర్వహణ కోసం ఒక కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. టిటిడి స్థానిక, అనుబంధ ఆలయాల నిర్వహణ, బడ్జెట్, ఎస్వోపీ, అభివృద్ధి పనులపై టిటిడి పరిపాలనా భవనంలోని ఇఒ ఛాంబర్ లో అధికారులతో టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ, ఆలయాల రోజువారి నిర్వహణ, మరమ్మతులు తదితర సాధారణ ఖర్చులను కార్పస్ ఫండ్ కు వచ్చే వడ్డీ సొమ్ముతో ఖర్చు చేయాలని సూచించారు. పెద్ద స్థాయిలో మరమ్మతులు, వార్షిక ఉత్సవాల కోసం కేపిటల్ ఖర్చుగా భావించి టిటిడి నిధులతో ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి ఆలయానికి జనరల్ అకౌంట్, అన్నదానం కోసం మరో అకౌంట్ తెరిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, సిసిటివీలు, సెక్యూరిటీ, రవాణా, ట్రాఫిక్ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. వచ్చే వేసవి నేపథ్యంలో టిటిడి ఆలయాలలో భక్తులకు వైద్యసేవలు, తాగునీరు, వ్యర్థాల నిర్వాహణ, మరుగుదొడ్లు తదితర అంశాలపై ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. టిటిడిలోని ఆలయాలలో ఉద్యోగులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు, కార్యక్రమాల నిర్వహణపై ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని(ఎస్ఓపీ) రూపొందించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆలయానికి విరాళాలు ఇచ్చేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ వి. వీరబ్రహ్మం, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సీఇ టి.వి. సత్యనారాయణ ,సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసికి కలిసొచ్చిన సంక్రాంతి

**- ఒక్క జనవరి19న రూ.27.8కోట్లు ఆదాయం**




**విజయవాడ,జనవరి 20,ప్రభాత వార్తప్రతినిధి:** సంక్రాంతి ప్రయాణాలు ఆర్టీసీకి భారీ ఆదాయం తెచ్చి పెట్టాయి. ఒక్క జనవరి19న ఆర్టీసీకి రూ. 27.8 కోట్లు ఆదాయం లభించింది.ఆర్టీసీ చరిత్రలో ఇదే అత్యధిక ఆదాయం. ఉమ్మడి కృష్ణా జిల్లాలో జనవరి 8 నుంచి 19 వరకు నడిపిన బస్సు సర్వీసులకు రూ.18.19 కోట్ల మేర ఆదాయం వచ్చింది. స్త్రీశక్తి నేపథ్యంలో గతేడాదితో పోలిస్తే రాబడి భారీగా పెరిగింది. సెలవులకు ముందు, తర్వాత వారాంతాలు రావడం కూడా ఆర్టీసీకి కలిసి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పండగ ప్రయాణాలకు సగటున రోజుకు 735 ప్రత్యేక బస్సులు నడిపారు. ఇవికాక 1,012 వరకు సాధారణ సర్వీసులు తిప్పారు. బస్సులు సుమారు 40 లక్షల కిలోమీటర్లు ప్రయాణించాయి. జనవరి 10 నుంచి 13 వరకు ఎక్కువ బస్సులు కేటాయించారు. ఈ రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రోజుకు వెయ్యి బస్సులు తిరిగాయి. రోజుకు రూ.1.52 కోట్ల ఆదాయం వచ్చింది. సెలవులకు అనుబంధంగా వారాంతాలు రావడంతో ఎక్కువ రోజులు ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం వచ్చింది. దీంతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖ, రాయలసీమ తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపారు. గత ఏడాది ఇదే స్థాయిలో బస్సులు నడపగా 12 రోజులకు రూ.15.15 కోట్లు ఆదాయం రాగా ఈసారి రూ.3.04 కోట్లు పెరిగి రూ.18.19 కోట్లకు చేరింది. ఎన్టీఆర్ జిల్లా నుంచి రూ.15.53 కోట్లు, కృష్ణా జిల్లా నుంచి రూ.2.66 కోట్లు రాబడి వచ్చింది. ఆదాయం పెరగడానికి వారాంతాలు, ఆదివారం అమావాస్య కావడంతో కొందరు సోమవారమూ ప్రయాణాలు చేశారు. అనేక గ్రామాలకు బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. బస్సుల్లేని కారణంగా పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణిస్తూ జరిగిన ప్రమాదాలకు లెక్కేలేదు. సురక్షి త ప్రయాణాన్ని అందించడం సహా ఆర్టీసీకి ఊపిరిపోయడమే లక్ష్యంగా ప్రభుత్వం తెచ్చిన స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన లభించింది.స్త్రీశక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతో వెలవెలబోయిన గ్రామీణం,

నగరాల్లోని ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కళకళలాడుతున్నాయి. రాయితీ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2 వేల కోట్లకు పైగా ఆర్టీసీకి తిరిగి చెల్లించనుండటంతో రాబడి గణనీయంగా పెరగనుంది. ఆర్టీసీకి పూర్వపు కళను తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేసింది.ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఆర్టీసీ గ్రామీణ ప్రాంత బస్సులు వైఎస్సార్సీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో డిపోలకే పరిమితమయ్యాయి. కొత్త బస్సులను ప్రవేశపెట్టి సంస్థకు తోడ్పాటు ఇవ్వాల్సింది పోయి ప్రైవేటు వాహనాలకు విచ్చలవిడిగా అనుమతులివ్వడంతో ఐదేళ్లలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించే మహిళలంతా ఇప్పుడు కుటుంబాలతో సహా ఆర్టీసీ బస్సెక్కుతున్నారు. స్త్రీ శక్తి పథకం నేపథ్యంలో మహిళా ప్రయాణికులు ఈసారి బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు చూపారు. పండగ ప్రయాణాల్లో స్త్రీశక్తి అనుమతి ఉన్న బస్సుల్లో 70 శాతంపైగా మహిళా ప్రయాణికులున్నారు. పైసా ఖర్చు లేకుండా సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరుతున్నారు. ఆగస్టు 15 నుంచి పథకం ప్రారంభం కాగా పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు కిటకిటలాడుతున్నాయి. గతంలో 50 శాతం ఆక్యుపెన్సీ గగనమయ్యే సర్వీసుల్లో ఇప్పుడు 75 శాతం సరాసరి నమోదవుతోందని అధికారులు చెబుతున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను రక్షించడంలో గోల్డెన్ అవర్ కీలకం - ఆర్టీవో అధికారులు

- ప్రమాద బాధితులను గమనించగానే రక్షించడం పౌరుల బాధ్యత
- ప్రతి ఒక్కరు గుడ్ సమరిటన్ (రాహ్-వీర్)గా నిలవాలి

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** రోడ్డు ప్రమాద బాధితులను రక్షించడంలో గోల్డెన్ అవర్ కీలకమని ఆర్టీవో అధికారులు ఉద్ఘాటించారు.ప్రతి ఒక్కరు గుడ్ సమారిటన్ (రాహ్-వీర్)గా నిలవాలన్నారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా, ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఆర్టీవో కార్యాలయ పరిధిలోని గవర్నమెంట్ హాస్పిటల్ ,పూజిత హాస్పిటల్‌ల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న రాహ్-వీర్ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఓ ఎం. పద్మావతి మాట్లాడుతూ ,రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే వచ్చే మొదటి గంటఅత్యంత కీలకమైందన్నారు ఈ సమయంలో సరైన సహాయం అందిస్తే ప్రమాద తీవ్రతను మరియు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.దీనినే గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ఎవరైనా బాధితులను రక్షి ంచి ఆసుపత్రికి చేర్చినట్లయితే, వారిని గుడ్ సమారిటన్ (రాహ్-వీర్) గా గుర్తించి, సహాయం చేసిన వ్యక్తికి రూ. 25,000/ నగదు పారితోషికాన్ని జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా అందజేయబడుతుందని తెలిపారు. మోటార్ వాహన తనిఖీ అధికారి ఎం. పూర్ణిమ మాట్లాడుతూ,మోటార్ వాహన చట్టం - సెక్షన్ 134ఎ ప్రకారం, రోడ్డు ప్రమాద సమాచారాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు లేదా అత్యవసర సేవలకు తెలియజేసిన సందర్భంలో గానీ, క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్చిన సమయంలో గానీ, గుడ్ సమారిటన్ వ్యక్తి పేరు లేదా వ్యక్తిగత వివరాలు ఇవ్వమని పోలీసులు లేదా ఆసుపత్రి సిబ్బంది బలవంతం చేయరాదని, అలాగే అతను అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవడంపై ఎలాంటి అభ్యంతరం పెట్టరాదని స్పష్టం చేశారు.

ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌టీఓ శ్రీమతి ఎం. పద్మావతి గారు, మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీమతి ఎం. పూర్ణిమ గారు, డాక్టర్ ఎం. శ్రీనివాస రావు, డాక్టర్ దివ్య వాణి, ఛైర్మన్, వి. నాగేశ్వర రావు గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్,సత్యనారాయణ ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిట్ ముందు 23, 26 తేదీల్లో హాజరును మినహాయించండి

# కోర్టును ఆశ్రయించిన మిథున్‌రెడ్డి

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు రోజు రోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఈ క్రమంలో ఆనాటి నేతలు అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల పలువురు వైఎస్సార్సీపీ నేతలకు ఈడీ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 23న విచారణకు రావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా వైఎస్సార్సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అయితే మినహాయింపు కోరుతూ మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై విజయవాడ ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. తనకు ఈ నెల 23, 26 తేదీల్లో సిట్ దర్యాప్తు అధికారి ముందు హాజరు నుంచి మినహాయింపు కోరుతూ మిథున్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని సిట్ ను ఆదేశించిన న్యాయస్థానం తదుపరి విచారణను రేపటి (బుధవారం)కి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న రోనక్ కుమార్, అనిల్ చోక్రాల బెయిల్ పిటిషన్లపై విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. నిందితుడు రోనక్ గుంటూరు, అనిల్ చోక్రా విజయవాడ జిల్లా జైళ్లలో జ్యుడీషియల్ రిమాండ్ లో ఉన్నారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి మనీలాండరింగ్ చట్టం కింద అభియోగాలతో గతేడాది మేలో ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)ను నమోదు చేసింది. 33 మందిని అందులో నిందితులుగా చేర్చింది. 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో గత సంవత్సరం సెప్టెంబరులో సోదాలు చేసి, కీలక ఆధారాలు సేకరించినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.వైఎస్సార్సీపీ తరపున కీలకంగా పని చేసిన రాజ్ కెసిరెడ్డితో పాటు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తదితరులు ఈడీ పెట్టిన కేసులో ఉన్నారు. సిట్ నమోదు చేసిన మద్యం కుంభకోణం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి ఏ4గా ఉన్నారు. ఆయన గతేడాది జులైలో అరెస్టయ్యారు. ఈయనే ఈ కేసులో అరెస్టైన తొలి ప్రజాప్రతినిధి. మిథున్‌రెడ్డి ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు.

# పోలవరం ప్రాజెక్ట్‌లో విదేశీ నిపుణుల బృందం రెండో రోజు పర్యటన

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:**పోలవరం ప్రాజెక్ట్ లో విదేశీ నిపుణుల బృందం పర్యటన రెండో రోజు మంగళవారం కొనసాగుతోంది. విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గెర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకోలతో పాటు కేంద్ర జల వనరుల శాఖలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. రెండో రోజు మధ్యాహ్నం వీరు మెయిన్ డాం గ్యాప్ 2 ఇసుక రీచ్, మెటీరియల్ లభ్యత మొదలైన వాటిని పరిశీలిస్తారు .అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమావేశమై తోలి రోజు ఫీల్డ్ లో తమ దృష్టికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఈ ఎన్ సి కె నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి, తదితరులు అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు అందించారు. వారి వివరాలతోపాటు తాము ఫీల్డ్లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకొని సందేహాలు తీర్చుకున్నారు.

ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ఉన్నారు.



పోలవరం ప్రాజెక్ట్ పనులు పరిశీలిస్తున్న విదేశీబృందం

వార్త


ప్రతి ఒక్కరూ ఒక విషయాన్ని గురించి తరచుగా ఆలోచిస్తుంటారు. దాన్ని గురించి బహిరంగంగా చెప్పగల వాడే విజయవంతమైన రాజకీయవేత్త.

న-థియెడర్ రూజ్వెల్ట్

# వెండి.. బంగారమాయె!

ఈక్విటీ మార్కెట్లకంటే ఇప్పుడు బులియన్ రంగంవైపు ఇన్వెస్టర్ల దృష్టి మళ్లింది. అంతర్జాతీయంగా భౌగోళికంగా ఎదురవుతున్న ఉద్రిక్తతలకు తోడు సెంట్రల్ బ్యాంకులు కూడా బంగారం కొనుగోళ్లవైపు దృష్టిసారించడంతోపాటు ఫ్యూచర్ మార్కెట్లలోకూడా ధరలకు కళ్లెం వేయలేకపోతున్నారు. అటు ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర నుంచి గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్ హెచ్చరికలు, వెనిజులాపై అమెరికా సైనిక చర్య అధ్యక్ష దంపతుల అరెస్టులు వంటి పరిణామాలు ఈక్విటీ మార్కెట్లపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపించాయి. వీటికితోడు డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా కనిష్టానికి చేరుకున్నాయి.విదేశీ కరెన్సీ ఖజానాను రూపాయి క్షీణతను కట్టడిచేసేందుకే రిజర్వుబ్యాంకు ఉపయోగించాల్సి వస్తోంది.ఈతరుణంలో పసిడి, వెండిధరలకు రెక్కలు విచ్చుకున్నాయనే చెప్పాలి. చరిత్రలో ఎన్నడూలేని విధంగా కిలో వెండి రూ. 3,15,720లుగా మారిందంటే పసిడి ధరలకు రెక్కలు రావడం ఒక ఎత్తు. మరోవైపు వెండి వినియోగం పారిశ్రామికంగా విపరీతంగా పెరగడం కూడా కారణం అని అంచనా వేసుకోవచ్చు. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు 1.27 శాతం పెరిగాయి. పదిగ్రాములు రూ. 1,47,490లకు చేరింది. అదే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజిలో వెండిధరలు కూడా 1.75 శాతంపెరిగి కిలో ఒక్కింటికి 3.16 లక్షలకు చేరిందంటే బులియన్ వ్యాపారులే విస్మయానికి గురవుతున్నారు. స్పాట్ మార్కెట్‌లో పసిడి ధరలు అంతర్జాతీయంగా ఔన్స్ ఒక్కింటికి 4671.54 డాలర్లుగా ఉన్నాయి. వెండిధరలు కూడా ఔన్స్‌కు 95 డాలర్ల వరకూ పెరిగిందంటే పారిశ్రామిక వినియోగం పెరగడమేనని చెప్పక తప్పదు. అంతకుముందు రోజే 4689.39 డాలర్లుగా కూడా నడిచింది. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎనిమిది యూరోప్ దేశాలపై పదిశాతం సుంకాలు విధిస్తున్నట్లు చేసిన ప్రకటన కూడా ధరలు పెరుగుదలకు మరో కారణంగా మారింది. గ్రీన్‌ల్యాండ్‌ను తాము స్వాధీనం చేసుకోవాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకించే అన్నిదేశాలపైనా సుంకాలు తప్పవని చేసిన హెచ్చరికలు ఈక్విటీ మార్కెట్లతోపాటు ప్రధానంగా బులియన్‌రంగంపై తీవ్ర ప్రభావం చూపించింది. ఇందుకు ప్రతిగా యూరోపియన్ కూటమి దేశాలు 'ట్రేడ్‌బజూకా'ను అమలు చేస్తున్నప్పటికీ ముందు బులియన్ రంగం తీవ్ర ఒత్తిడికి లోనయింది. ఈక్విటీ మార్కెట్లలో ఎదురయ్యే ఒడిదొడుకులు ఇన్వెస్టర్లను బులియన్ రంగంవైపు నడిపిస్తాయి. ఇప్పటివరకూ పసిడి పెట్టుబడులపైనే కన్నేసిన ఇన్వెస్టర్లు ఇప్పుడు వెండి నిల్వలపైనా దృష్టిసారించి ఒక్కసారిగా పెట్టుబడులు కుమ్మరిస్తున్నారు. వీటివల్లనే సామాన్య, మధ్యతరగతికి కొనలేని పరిస్థితి ఏర్పడింది. వేచి చూద్దాం అనే ధోరణిలో ఈ వర్గాలున్నాయి.అయితే సమీపభవిష్యత్తులో కూడా ధరలకు బ్రేకులు పడే అవకాశాలే లేవు. ఈక్విటీ అనిశ్చితివల్ల పెట్టుబడులు సింహభాగం బులియన్‌రంగంవైపు మళ్లాయి. వీటికితోడు సోలార్ ప్యానెళ్ల తయారీలోను, చిప్స్ తయారీలోనేకాకుండా విద్యుత్ వాహన తయారీ విభాగంలో కూడా వెండి వినియోగం భారీగా పెరిగింది. అలాగే మార్కెట్లకు సరిపడా వెండి నిల్వలు లేకపోవడం కూడా కొరతను సృష్టించింది. మరోవైపు బులియన్ కృత్రిమ కొరత కూడా వెండిధరల పెరుగుదలకు తోడయింది. విలువైన ఖనిజవనరులు మనం దిగుమతులపైనే ఆధారపడి ఉన్నాయి. మెక్సికో, చైనా, పెరూ, బొలీవియా, పోలెండ్; చిలీ, రష్యా, అమెరికా, ఆస్ట్రేలియా, కజకిస్థాన్ వంటి దేశాల్లో ఎక్కువ ఉత్పత్తి అయ్యే వెండిని భారత్ వినియోగంకోసం విధిగా దిగుమతులు చేసుకుంటున్నాం. ఇపుడు గోల్డ్ ఈటిఎఫ్‌లతోపాటు వెండి ఈటిఎఫ్‌లకు కూడా పెట్టుబడులు భారీగా వస్తున్నాయి.ఈక్విటీరంగంపై ఇన్వెస్టర్లకున్న సందేహాలే ఇందుకు కారణం. ప్రపంచ పసిడి మండలి లెక్కలప్రకారం మొత్తం పసిడి నిల్వలు 2,16,225 టన్నులు, వెండి 17.51 లక్షల టన్నులున్నట్లు అంచనా.ప్రపంచం మొత్తంగా పదిదేశాల్లో 25 వేల మెట్రిక్ టన్నుల వెండి ఉత్పత్తి అయింది. ఈనిల్వలే ఇప్పుడు ప్రపంచ దేశాల అవసరాలను తీరుస్తున్నాయి. వీటిలో చైనా, అమెరికాల తర్వాత భారత్‌లోనే పారిశ్రామిక వినియోగం పెరిగింది. జనవరిలోనే కిలోధర రూ.2.40 లక్షలనుంచి రూ.3.15 లక్షలకుపెరిగిపోయింది. పండుగ సీజన్లు వచ్చినా ఆ తర్వాత కూడా కిలో వెండి కొంతమేర తగ్గినట్లే తగ్గిమళ్లీ ఒక్కసారిగా పెరిగింది. మూడునెలలు గడవకుండానే రెట్టింపు స్థాయికి వెండిధరలు పెరిగాయి. ఈక్విటీ మార్కెట్ల టర్నోవర్‌కంటే వెండి, పసిడిమార్కెట్ల టర్నోవర్ భారీగాపెరిగింది. బంగారం టర్నోవర్ 32.54 లక్షలకోట్లుడాలర్లవరకూ ఉంటే వెండి మార్కెట్ 5.28 లక్షలకోట్ల డాలర్లుగా ఉందంటే ఇన్వెస్టర్లకు స్వర్గధామంగా ఈ రెండు మార్కెట్లే కనిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. పారిశ్రామికరంగాలనుంచి వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా వెండి సరఫరా లేకపోవడంతో ప్రస్తుతం2500టన్నులు కొరత ఉన్నట్లు అంచనా.మార్చినెల డెలివరీ వెండిధరలు ఒక్కరోజుకే సుమారుగా పదివేలవరకూ పెరిగాయి.బంగారం కూడా ఒక్కరోజుకే రూ.2560 పెరిగింది.అంతర్జాతీయంగా కూడావెండిధరలు నింగిని తాకుతున్నాయి. ఔన్స్ వెండి 94.37 డాలర్లుగా ఉంది.డాలరుతో రూపాయి మారకం విలువలు మళ్లీ91ని చేరాయి.దీనితో కరెన్సీ మార్కెట్ ఒడిదొడుకులు మరింత ఉంటాయి. ఎగుమతులకు చెల్లింపులు కూడా డాలర్లలోనే చేయాల్సి రావడంతో రూపాయి మారకం విలువలు భారీగా పడుతుండటంతో ఆర్బీఐ కరెన్సీ ధరలను కొంతవరకూ కట్టడి చేయగలుగుతున్నా పసిడి,వెండిధరలు మాత్రం బులియన్‌రేసులో దూసుకుపోతున్నాయి.

పంచుకోబడిన సంతోషం రెండింతలవుతుంది. అదే పంచుకోబడిన దుఃఖం సగం దుఃఖం అవుతుంది.



ఖలీల్ జిబ్రాన్

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయ విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## సుంకం పూరించడమే ట్రంప్ దౌత్యం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకైక ఆయుధం సుంకం. ఇతర దేశాలతో మిత్రత్వానికి,శత్రుత్వానికి ఆయన వాడేది సుంకమే.సామ,బేధ,దాన,దండోపాయాల్లో ఆయనకి తెలిసింది దండోపాయమే.అందుకు మార్గంపన్నుల విధింపు, పెంపు. తాజాగా తన మిత్ర బృందం యూరప్ దేశాలకు తాఖీదు ఇచ్చాడు. గ్రీన్లాండ్‌పై అమెరికా వైఖరిని సమర్థించకపోతే ఇప్పటికిప్పుడు ఆయా దేశాల నుండి వచ్చే దిగుమతులపై15శాతంపన్నుపెంపు,ముందుముందు మరింత పెంపులని.గ్రీన్లాండ్‌పైఆయనవైఖరి అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్ధం. కబ్జా తరహా దౌర్జన్యం. ఆ చిన్న అంటార్కిటికా ప్రాంతం డెన్మార్క్ పాలనలో ఉంది. దాన్ని అమెరికాకు ధారాదత్తం చెయ్యమని అయ్యవారి అల్టిమేటం. అది సరికాదన్న యూరోపియా సమాఖ్యపై బెదిరింపు.కన్నుకి కన్ను సిద్ధాంతం లాగా పన్ను కి పన్ను సిద్ధాంతమే ప్రస్తుతం కరెక్ట్.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## ఉపాధి హామీ రోజులు పెంచితే లాభం ఏమిటి?

కొత్తగావచ్చిన ఉపాధిహామీ బిల్‌హక్కులకు శరాఘాతంలా కనిపిస్తుంది.ఒకటి కేంద్రం తమ బాధ్యతలు నుండి తప్పుకోవడం మాత్రమే కాదు ఎటువంటి ఆబ్లీగేషన్స్ లేకుండా కేంద్రంపక్కకు తప్పుకోవడం విచారకరం. అయితే 2005లో బిల్ వచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా కళ్యాణ్ సింగ్ నేతృత్వంలో వేసిన సలహా కమిటీ ఈ బిల్ డ్రాఫ్ట్ తయారు చేసింది. ఈ బిల్ చట్టంగా మారడానికి ముందు ఒక సంవత్సరం పాటు చర్చ జరిగింది కానీ ఇప్పుడు అంత క్షణాల్లో అయిపోయింది.కేవలంలోక్‌సభలో అధికార పక్షానికి ఉన్న సంఖ్యా ఆధిపత్యం వల్లనే సుమా.

- భారత అవినాష్, జనగామ

## ఆయుర్వేద వైద్యంపై దృష్టి

మనదేశంలో 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగామారింది.ఇటీవల జాతీయస్థాయిలో సంప్రదాయవైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు, మందులు వగైరా ఏర్పాటు నిమిత్తందృష్టిసారించారు.ఎటువంటి ఇతర అదనపు ఇబ్బందులు లేని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

- బి. రమేష్‌బాబు, నల్గొండ

## క్రీడలు గౌరవానికి చిహ్నాలు

క్రీడలు అనేవి కేవలంపతకాలు,రికార్డులకు పరిమితం కాకుండా క్రమశిక్షణ, నైతికత, పరస్పర గౌరవానికి చిహ్నాలుగా నిలవాలి. అయితే,పవిత్రమైన ఈరంగంలో లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం క్రీడా వ్యవస్థకే మచ్చ. ఇటీవల నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లైంగిక వేధింపుల ఆరోపణలపై తక్షణమే స్పందించి, ప్రాథమిక విచారణకు ఆదేశించడమే కాకుండా సదరు వ్యక్తిని విధుల నుండి తప్పించడం ఒక సానుకూల పరిణామం. గతంలో అనేక క్రీడా సంస్థలు రాజకీయ ఒత్తిళ్ల లేదా ప్రతిష్ఠ దెబ్బతింటుందనేనెపంతో ఇలాంటి ఫిర్యాదులపై మౌనం వహించేవి. కానీ నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తీసుకున్న చురుకైన చర్యలు బాధ్యతాయుతమైన మార్పును సూచిస్తున్నాయి. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చూపిన ఈ చొరవను స్ఫూర్తిగా తీసుకుని అన్ని క్రీడా సంస్థలు పారదర్శకంగా వ్యవహరిస్తే, భారత క్రీడారంగం మరింత గౌరవప్రదంగా మారుతుంది. ఇది భవిష్యత్తులో తప్పులు జరగకుండా అడ్డుకునే బలమైన హెచ్చరిక.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## హెల్మెట్ తప్పనిసరి

ఇటీవల సంభవిస్తున్న రోడ్‌ప్రమాదాల్లో హెచ్చుశాతం మోటార్ వాహన చోదకులు సరైన హెల్మెట్ ధరించక, లేక ఉన్నప్పటికీ ఎదుటి వాహనాన్ని ఢీకొట్టడం వల్ల తలభాగం మరణానికి కారణమవుతుంది. ఇది ఒక రక్షణకు ముఖ్య వస్తువు. దాన్ని ధరించడం తప్పనిసరి చేయాలి. అందరూ విధిగా చేస్తే ట్రాఫిక్ పోలీసులు లేని వారికి తనిఖీ అవసరమే లేదు. తిరుపతిలో దీన్ని ప్రత్యేకంగా ప్రచారభాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన హెల్మెట్టుబంక్‌ద్వారా అమ్మకంచేశారు.ఇది రెండు లాభాలు ఇస్తుంది. మిగిలిన జిల్లాల్లో కూడా ఇదే చేస్తే దాన్నే కొని ధరిస్తారు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## డాక్టరేట్‌లకు ప్రోటోకాల్

వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన పరిశోధకులకు ఆయా మండలాలలో జరిగే సభలు సమావేశాలు జరిగే సందర్భాలలో ప్రోటోకాల్ వర్తింపజేయాలి. డాక్టరేట్ పట్టభద్రులు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు, అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి ఉపయోగపడతారు.

-రాపాక రవీందర్, జనగాం

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# టెట్‌ను ఎత్తివేయడమే ఉత్తమం!

**టీచర్లు అనాదిగా ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు బడిలో అందిస్తూనే ఉన్నారు. వారు నిత్యవిద్యార్థులు. అనేక రకాల పుస్తకాలను చదువుతూ, జ్ఞానాన్ని మరింత పెంపొందించుకుంటారు. ఎప్పటికప్పుడు తమ బోధనను మెరుగు పరుచుకునేందుకుగాను వృత్యంతర శిక్షణలు ఉంటాయి. వృత్తిలోకి రాకముందే అకడమిక్, ప్రొఫెషనల్ విద్యార్హతలు సంపూర్ణంగా పొందియుంటారు. ఉపాధ్యాయునికి తన సబ్జెక్టులో పట్టున్నంత మాత్రాన పిల్లల బుర్రలోకి జ్ఞానాన్ని ఎక్కించలేడు. బోధన అనేది ఒక కళ. టెట్ ఉత్తీర్ణతైనంత మాత్రాన ఆ కళేమీ పెరిగిపోదు.కానంత మాత్రాన తరిగిపోదు. కాబట్టి నియామకాలకు ముందు ఎటువంటి స్క్రీనింగ్ టెస్ట్‌లు అవసరంలేదు.విధానపరమైన నిర్ణయాల గందరగోళం నుండి విముక్తి పొందడానికి ప్రభుత్వం చట్టాన్ని సవరించి టెట్ పరీక్షను పూర్తిగా ఎత్తివేయడమే ఉత్తమం.**

పిల్లా తిరుపతిరావు

గత సెప్టెంబర్ 1వ తేదీన భారత అత్యున్నత న్యాయస్థానమిచ్చిన తీర్పు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైనది. ఆ తీర్పు ప్రభావం ఎలా ఉందంటే, ఒక రాష్ట్రమా లేక రెండు రాష్ట్రాలా అనికాదు, దేశమ్మొత్తమ్మీద అరకోటికి పైగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎందుకంటే, కేంద్ర ప్రభుత్వ విధివిధానాలలో భాగంగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)లో ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా ఉత్తీర్ణత కావాల్సిందేనని ఆదేశించడం. ఐతే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు ఈ పరీక్ష నుండి మినహాయింపు ఇచ్చింది కూడా. విద్యాహక్కు చట్టం అమలు కాకముందు జరిపిన పలు ఉపాధ్యాయ నియామకాలలో ఈటెట్ పరీక్షను విధిగా పాసవ్వాలని అప్పటి ప్రభుత్వాలు ఏ విధంగానూ ప్రస్తావించలేదు. ఆనాడుఉపాధ్యాయ నియామక ప్రామాణికతల పేరిట టెట్‌ను పోలిన ఎలాంటి పరీక్షను నిర్వహించలేదు.కేవలం అర్హతలు ఉన్నవారు ఉద్యోగానికి నేరుగా ఎంపికయ్యేందుకు మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహించారు. అందులో అధిక మార్కులు వచ్చిన వారికి క్యాటగిరి వైజు, రిజర్వేషన్ల ప్రాప్తికి ఉద్యోగాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందినవారు ఇప్పుడు టెట్ పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ తీర్పును పునఃసమీక్షి ంచమని పలు రాష్ట్ర ప్రభుత్వాలు, ఉపాధ్యాయసంఘాలు ఇప్పటికే న్యాయస్థానం గడపతొక్కాయి. ఈ నేపథ్యంలో గౌరవ న్యాయస్థానం పునఃసమీక్షి స్తుందో! లేదో!వేచిచూడాలి మరి. ఐతే న్యాయస్థానమిచ్చిన తీర్పు ప్రాప్తికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు టెట్ నోటిఫికేషన్లు జారీ చేస్తున్నాయి. ఈ క్రమంలో గత డిసెంబర్ 10 నుంచి 21 వరకు ఆంధ్రప్రదేశ్లో పరీక్షలు జరిగాయి. ఈ జనవరి 3 నుంచి 20 వరకు తెలంగాణాలో జరుగనున్నాయి. దేశంలో మొట్టమొదటి టెట్ పరీక్ష 2011లో జరిగింది.కానీఆంధ్రప్రదేశ్‌లో మాత్రం2012లో టెట్ పరీక్ష నిర్వహించారు. అప్పటినుండి ఉపాధ్యాయ నియామకాల పరీక్షకు ముందుగానే ఈ టెట్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా టెట్ నోటిఫికేషన్ వెలువడింది. సర్వీస్‌లో ఉన్న 30,938 మంది ఉపాధ్యాయులు మాత్రమే టెట్ రాశారు. ఇటీవల కేంద్రానికి ఏపీ ప్రభుత్వం పంపిన గణాంకాలు బట్టి, రాష్ట్రం మొత్తం మీద ఉన్న1.51 లక్షల మంది ఉపాధ్యాయులున్నట్లు తెలుస్తోంది. వీరిలో టెట్ పరీక్ష ఉత్తీర్ణత కానివారు 1,27,802 మందిఉన్నారు. ఐదేళ్ల లోపు సర్వీసు ఉన్నవారు 23,207 మంది. వీరికి పరీక్ష నుంచి మినహాయింపు ఉంది. రాష్ట్రం మొత్తం మీద పరీక్ష తప్పనిసరిగా రాయాల్సినవారు 1,04,595 మంది. వీరి నుంచి ప్రస్తుతం రాసినవారిని తీసివేస్తే ఇంకా73,657 మంది ఉంటారు. వీరంతా టెట్ నుంచి మినహాయింపు లభించగలదనే ఆశతో ఉన్నారు. అందువల్లే వీరు ఈఏడాది పరీక్ష రాయలేదు. ఐతే ప్రతి ఉపాధ్యాయుడూ రెండేళ్ల లోపు పరీక్ష తప్పక పాసవ్వాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. కాకపోతే పరిస్థితి ఏంటి? వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తారా! లేక వేరే డిపార్ట్మెంట్స్‌కి పంపుతారా! అనేది సంశయాత్మకంగా ఉంది. దీనికై సదరు ప్రభుత్వాలు భవిష్యత్తులో ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటాయో! చూడాల్సిందే మరి. ఇది ఇలాఉంటే దేశవ్యాప్తంగా టెట్ నుండి మినహాయింపు కోరుతూ ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి పలురకాలుగా ప్రాతినిధ్యాలు ఇస్తున్నారు. పార్లమెంటులో గౌరవ సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తుతూ, టీచర్స్‌కి టెట్ నుండి మినహాయింపు కోరుతున్నారు.ఏభై





యేళ్ల పైబడినవారు, ఇరవైముప్ఫైయేళ్ళ సర్వీస్ నిండిన వారు టెట్ తప్పనిసరితో ఇబ్బందులు పడుతున్నారు. వయస్సు మీరిన వారికి ఈ పరీక్ష ఇప్పుడు అవసరమా? అంటూ విమర్శిస్తున్నారు. ఇంకా పరీక్ష సిలబస్‌ను చూస్తే, అభ్యర్థి సొంత సబ్జెక్టే కాకుండా మిగతా ఇతర సబ్జెక్టులను ప్రశ్నలుగా ఇవ్వడం ఆందోళన కలిగిస్తున్నది. ఒక సబ్జెక్టు చెప్పే టీచర్‌కి మిగతా సబ్జెక్టుల్లో పరీక్షి ంచడం ఎంతవరకు న్యాయమని వాపోతున్నారు. గణితం చెప్పాల్సిన పాఠశాల సహాయకులు క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు, తెలుగు,సైన్స్ చెప్పా ల్సిన అవసరం లేదు.అలాగే తెలుగువారికి ఇంగ్లీష్, ఇంగ్లీష్ వారికి తెలుగు అవసరం లేదు. కానీ ఈ టెట్ పరీక్షలో ఆయా ఇతర సబ్జెక్టుల ప్రశ్నలు అడుగుతున్నారు.ఇది ఎంత వరకు సహేతుకం? ఇంకా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌చెప్పే ఉపాధ్యాయులకు ఒకే విధంగా ప్రశ్నపత్రం ఉం టున్నది. ఈ సబ్జెక్టులకు టీచర్స్ వేరేగా ఉంటారు కాబట్టి, వారికి వారి సొంత విషయాంశం పైనే ప్రశ్నలివ్వాలి. అలా కాకుండా ఇరువురికీ ఒకే రకంగా పేపర్ ఇవ్వడం కరెక్టా? దేశంలో ఉపాధ్యాయ నియామకాలు పలురకాలుగా జరుగుతాయి. ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో సంబంధిత సంస్థలే నియమించుకుంటాయి. అదే కేంద్రం రాష్ట్ర విద్యా సంస్థలలోనైతే ఆయా ప్రభుత్వాలే నియమిస్తాయి. చాలా యేళ్ల నుండి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీల (డి.ఎస్.సి) ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్నవి. ఈ కమిటీలు పలుదశల్లో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి. దీనికోసం ప్రభుత్వాలు పగడ్బందీగా డి.ఎస్.సి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తాయి. ఈ డి.ఎస్.సి కి ఇంటర్ ప్లస్ డి.ఎడ్ లేదా డిగ్రీ ప్లస్ బి.ఎడ్ కనీస అర్హతగా నిర్ణయించి ప్రవేశ పరీక్షకు అభ్యర్థులను అర్హులను చేసింది. వారంతా డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేస్తారు.ఎంతో కష్టపడి చదివి ప్రవేశ పరీక్షను ఎదుర్కొంటారు. మంచి మార్కులు పొంది ఉద్యోగాన్ని కైవసం చేసుకుంటారు. మరి అలాంటప్పుడు సంబంధిత విషయాలలో నిష్ణాతులైన టీచర్లు తిరిగి టెట్‌పరీక్ష రాయాల్సిన అవసరం ఏమొచ్చింది? టెట్ పరీక్షను విద్యాహక్కు చట్టం ప్రాప్తికి కేంద్రం,రాష్ట్రాలు వేరువేరుగా నిర్వహిస్తుంటాయి. ఈ పరీక్ష ఆంధ్రప్రదేశ్‌లో రెండు విధాలుగా జరుగుతుంది. ఒకటి నుంచి ఐదు తరగతులు బోధించేవారు పేపర్1 రాయాలి. ఆరు నుంచి పది తరగతులు బోధించేవారు పేపర్2 రాయాలి. ఈ టెట్ మార్కులకు డీఎస్సీలో వెయిటేజ్ ఉంటుంది.అందువల్ల తాజా అభ్యర్థులకు ఈ టెట్ రాయడం అవసరమౌతుంది.అంతేకానీ ఎప్పుడో ఉద్యోగాల్లో చేరిన ఇన్‌సర్వీస్ టీచర్స్‌ని ఈ పరీక్షలో పాసవ్వమనడం సబబా?టెట్ పరీక్ష 150మార్కులకు ఉంటుంది. అందులో ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులు 60 మార్కులు తప్పక పొందాలని నిర్దేశించింది. ఈ నిర్దేశిత సూత్రాలను ఇన్ సర్వీస్ టీచర్లు అందుకోవడంచాలా కష్టం. అందువల్ల సర్వీస్‌లో ఉన్న టీచర్లు కేవలం 35 మార్కులు పొందితే పరీక్ష పాసైనట్టు టెట్ విధివిధానాల్లో మార్పుచేయాలి. ఏ టీచరైనా ఉద్యోగోన్నత పొందాలంటే టెట్ పరీక్ష తప్పనిసరిగా పాసవ్వాల్సిందేనని మార్గదర్శకాల్లో ఉంది. మరి మినహాయింపు పొందిన ఐదేళ్ల లోపు సర్వీసు ఉన్నవారిని కూడా ప్రమోషన్ కోసం టెట్ పాసవ్వమనడం అర్థరహితం. ఈ నిబంధన కూడా తప్పక మారాల్సిందే. ప్రభుత్వ విద్యా వ్యవస్థకు సమాంతరంగా అంతే స్థాయిలో ప్రైవేటు,కార్పొరేట్ విద్యావ్యవస్థ నడుస్తోంది.ఉపాధ్యాయులు నియామకం అథారిటేటివ్‌గా అప్రూవల్ పొందాలి.ఎన్.సి.టి. ఈ మార్గదర్శకాల ప్రాప్తికి తప్పనిసరిగా టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.ఐతే ఈ పాఠశాలల్లో జరిగే ఉపాధ్యాయ నియామకాలు ఇష్టారాజ్యంగా చేపడతారు.2011 తర్వాతప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులుగా వృత్తిలోకి చేరిన వారికి టెట్ పరీక్షను తప్పనిసరి చేయొచ్చు. అంతకుముందు వారికి మాత్రం పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాల్సిందే. టీచర్లు అనాదిగా ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు బడిలో అందిస్తూనే ఉన్నారు. వారు నిత్యవిద్యార్థులు. అనేక రకాల పుస్తకాలను చదువుతూ, జ్ఞానాన్ని మరింత పెంపొందించుకుంటారు. ఎప్పటికప్పుడు తమ బోధనను మెరుగు పరుచుకునేందుకుగాను వృత్యంతర శిక్షణలు ఉంటాయి. వృత్తిలోకి రాకముందే అకడమిక్, ప్రొఫెషనల్ విద్యార్హతలు సంపూర్ణంగా పొందియుంటారు. ఉపాధ్యాయు నికి తన సబ్జెక్టులో పట్టున్నంత మాత్రాన పిల్లల బుర్రలోకి జ్ఞానాన్ని ఎక్కించలేడు. బోధన అనేది ఒక కళ. టెట్ ఉత్తీర్ణతైనంత మాత్రాన ఆ కళేమీ పెరిగిపోదు.కానంత మాత్రాన తరిగిపోదు. కాబట్టి నియామకాలకు ముందు ఎటువంటి స్క్రీనింగ్ టెస్ట్‌లు అవసరంలేదు.విధానపరమైన నిర్ణయాల గందరగో

# మున్నేరు జల దోపిడిని ఆపాలి


విశ్వ జంపాల

అత్యంత కీలకమైన మున్నేరు పరీవాహక ప్రాంత రైతాంగ ప్రయోజనాలను ప్రక్కన బెట్టి, 5వ షెడ్యూల్ ప్రాంతాల హక్కులు,పెసాచట్టం ఉల్లంఘిస్తూ 10 టీఎంసీల మున్నేరు జలాలను మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ద్వారా రెండు పంటలు పుష్కలంగా పండుతూ నాగార్జున సాగర్ ఆయకట్టుగా వున్న పాలేరు చెరువుకు తరలించడం అన్యాయం, అక్రమం. మున్నేరు నీరు ఆ ప్రాంత ప్రజల జీవనాధారం. చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ ప్రాజెక్టులు చేపడితే అది రాజ్యాంగ ఉల్లంఘనేఅవుతుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం నుండి ప్రవహిస్తున్న మున్నేరుపై దుబ్బగూడెం మద్దివంచ గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్ నుండి మున్నేరు పాలేరు లింక్ కెనాల్ (గ్రావిటీ కాలువ) ప్రారంభించబడి గార్ల మండలంలోని బుద్ధారం సమీపంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాల్వకు అనుసంధానం చేయడం ద్వారా పాలేరు చెరువుకు 10 టీఎంసీల నీటిని తరలించనున్నారు. మే 17, 2025న మున్నేరు పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి 162.54 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 98ని ఖమ్మం జిల్లా మంత్రుల ప్రమేయంతో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మున్నేరుపాలేరు లింకు కెనాల్ నిర్మాణం కోసం గార్ల మండలంలో 9.5 కిలోమీటర్ల పొడవున భారీ కాలువ తొవ్వనున్నారు. ఈ కాలువ క్రింద చిన్న సన్నకారు పేద గిరిజన రైతులు 350 ఎకరాల వ్యవసాయ సాగు భూములను కోల్పోనున్నారు. ఒక చుక్క నీరు కూడా మున్నేరు పరివాహక ప్రాంత రైతాంగానికి ఇవ్వడం లేదు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం నియోజక వర్గాలలో 60వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకుత్రాగునీరు అందించాల్సిన మున్నేరు ప్రాజెక్ట్‌ను 60 సంవత్సరాలుగా ప్రభుత్వాలు చారిత్రక నిర్లక్ష్యం చేస్తున్నాయి. వైయస్ రాజ శేఖర్‌రెడ్డి ప్రభుత్వం మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి131.67 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 1076ను విడుదల చేసింది, కానీ మున్నేరు ప్రాజెక్ట్ నిర్మా ణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాన్ని సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టులో కలుపుతూ కేసీఆర్ ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. స్వార్థపూరిత రాజకీయ ప్రయో జనాలకు సీతరామ ప్రాజెక్ట్ బలిపశువుగా మారి మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతానికి సీతారామ జలాలురాకుండా పోయాయి. సీత రామ ప్రాజెక్ట్ విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతోచేసిన తప్పిదాన్ని ప్రస్తుతకాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దాల్సి వుండగా అదే తప్పిదాన్ని యాదాతధంగా కొనసాగించడం ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యానికి, తెలితక్కువ తనానిన్ని తేటతెల్లం చేస్తుంది. కొన్ని ప్రాజెక్టుల విషయంలో ఆయా ప్రాంతాల నీటి అవసరాలను చారిత్రక, భౌతిక, వాస్తవిక అంశాలను వెల్లడించకుండా ఖమ్మం జిల్లా మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ ప్రాజెక్ట్ ల పట్ల ఖమ్మం జిల్లా మంత్రుల వైఖరిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఐదవ షెడ్యూల్ పరిధిలోకి వచ్చే గార్ల మండల ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామసభల అనుమతి లేకుండా మున్నేరు పాలేరు లింక్ కెనాల్, నిర్మాణం చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో చట్టంప్రకారం గ్రామసభల ముందస్తు అనుమతి తప్పనిసరి. దీనిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. మున్నేరు పరివాహక ప్రాంత రైతాంగానికి సాగు, తాగునీరు అందించకుండా,10టీఎంసీల నీటిని తరలించడం సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకం. స్థానిక హక్కుల నిరాకరణగా పరిగణించబడుతుంది. 9.5 కి.మీ మున్నేరు పాలేరు లింక్ కెనాల్ నిర్మాణంవల్ల సుమారు 350 ఎకరాల సారవంతమైన గిరిజన రైతుల భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. 350 ఎకరాల సారవంతమైన గిరిజన భూములు కోల్పోవడంపై సరైన సామాజిక, పర్యావరణ ప్రభావం అంచనా జరగలేదు. భూమి కోల్పోవడమే గాక సాగుత్రాగు నీటిఅవసరాలు తీర్చకపోవడం తీవ్ర అభ్యంతరకరం. మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజాభిష్టం మేరకు మున్నేరు పాలేరు లింక్ కెనాల్‌ను విరమించుకుంటూ మున్నేరు పాలేరులింక్ కెనాల్, నిర్మాణం కొరకు ఇచ్చిన జీవోను రద్దుచేసి ప్రభుత్వం తన విజ్ఞతనుచాటాలి. మున్నేరు నీటిపై ఆప్రాంత ప్రజల హక్కులను కాపా డుకోవడానికి ప్రజాపోరాటంఅవసరం.మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కంటేమున్నేరు

# టిడిపి, బిజెపిల కొత్త రాజకీయ వ్యూహం

జయసూర్య

భారతీయ జనతాపార్టీ తెలుగు రాష్ట్రాలలో పాగా వేయడానికి పావులు కదిపే రాజకీయ క్రీడా చాతుర్యం, 2029 నాటికి భారత రాజకీయాలలో ఊహించని సంచలనాత్మక మార్పులకు కారణం కాగల పరిణామాలను స్ఫూరింప చేస్తున్నాయి. భారత జాతీయ కాంగ్రెస్ మళ్లీ తలెత్తకుండా, మట్టి కరిపించటానికి, ఎన్.టి.ఆర్ నాడు స్థాపించిన తెలుగుదేశం పార్టీని, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి నేటి ప్రభుత్వం, సుస్థాపితం చేస్తోంది. ఒకప్పుడు భారత ప్రధాని కాగల సత్తా ప్రదర్శించిన ఎన్‌టిఆర్ కుమార్తె పురంధరేశ్వరి ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కీలక రాజకీయ నేత. ఎన్.టిఆర్ వ్యక్తిగత బలహీనతలు తెలుగు దేశం పార్టీని కనుమరుగు చేయకుండా కాపాడినచంద్రబాబు ఈ వేళ మోడీకే మార్గదర్శిగా కూటమి ప్రభుత్వం ఆంధ్రాలో నడిపిస్తున్నారు. దక్షిణాది రాజకీయాలలో ప్రజలతో పెనవేసుకొన్న సినీ అనుబంధం, ప్రత్యక్షంగా కొంత పరోక్షంగా మరింత, అధికార ఆధిపత్యానికి ఉపయోగించుకొనే అవకాశాలు ఇప్పటికే బిజెపి చేజిక్కించుకొంటోంది. చంద్రబాబును లోగడ తక్కువ అంచనా వేసిన మోడీ ప్రభుత్వం, ప్రస్తుతం తప్పు సవరించుకొంటోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో బిజెపి పట్టు సాధించాలంటే చంద్రబాబే శరణ్యం అని స్పష్టమైంది. కూటమి ప్రభుత్వం పేరిట ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పాలన, రాజకీయంగా అధికారంలోని బిజెపి పాలనగా మారుతోంది. అందువల్లనే అమరావతి అయినా, పోలవరం లేదా మరేదైనా ఎంత భారీ వ్యవహారమైన చంద్రబాబుకు తిరుగులేదు. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేడు బిజెపి ఆధ్యాత్మికవేత్తగా, రాజకీయం నడిపిస్తున్నారు. రహస్య ఏజెండా మాట అటుంచి, ప్రస్తుత రాజకీయాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు సారధ్యం వహించే రెండు పార్టీలు కనీవినీ ఎరుగని రీతిలో భారతీయ జనతాపార్టీ ఆధ్యాత్మిక కార్యాచరణ చేపట్టారు. బిజెపిలో విలీనం అవసరం లేకుండానే కూటమి పేరుతో బిజెపి ప్రతిష్ట ఇనుమడింప చేస్తున్నారు.ఎన్.టి.ఆర్‌ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో జాతీయ రాజకీయాలలో అకస్మాత్తుగా కాషాయ వేషధారణ ప్రవేశించి భారతీయ ప్రజలను తబ్బిబ్బు చేసింది. ప్రధాన మోడీ రాకీయ లక్ష్యం దిశలో, స్వదేశీ ధర్మరక్షణ, ప్రతిష్ఠాపనకు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అంకురార్పణ చేసింది. దేశంలో కాషాయ పతాకం ఎగురుతోంది. అత్యున్నత ప్రామాణికత కలిగి 170 ఏళ్ల అంతర్జాతీయ చరిత్ర కలిగిన ఒక విశ్వవ్యాప్త న్యూస్ ఏజెన్సీ ఇటీవల



వల విడుదల చేసిన కథనం ప్రకారం ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ రాకీయ వారసత్వం ప్రస్తావన వింత సంచలనం సృష్టించింది. ప్రస్తుత కేంద్ర భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి దక్షిణాది రాజకీయ ప్రాబల్యం సాధించాలంటే,ప్రత్యక్షంగా సుదీర్ఘకాలంగా పార్టీతో అనుబంధం ఉన్న నాయకుల సత్తా సరిపోవడం లేదని తెలంగాణ రాజకీయం స్పష్టం చేసింది. ఆ విధంగా ఆలోచించినా, తెలుగు దేశం అండదండలుంటేనే అదిసాధ్యం కాగలదని అగ్రశ్రేణి నాయకత్వం అభిలషిస్తోంది. పైన పేర్కొన్న అంతర్జాతీయ వార్తా సంస్థ, ప్రధాని మోడీ బిజెపి సారధ్య వారసత్వాన్ని తెలుగు దేశం అధినేత చంద్రబాబు లేదా నారాలోకేష్ అయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.అది సాధ్యం కాకపోవచ్చు.కాని 2029నాటికి ప్రధాని మోడీకి 79ఏళ్లు వస్తున్నాయి. హోం మంత్రి అమిత్‌షా, యూ.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి దిగ్గజాలు ఉండనే ఉన్నారు. అదిగాక పోయినా మోడీ ఎక్కడా తాను మరోసారి ప్రధాని పదవి చేపట్టనని కానీ రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్నాననీ ప్రకటించలేదు. కానీ భారత దేశ ప్రధానిగా, భారతీయ జనతా పార్టీ ఆశయసిద్ధికి, భావజాలానికి దక్షిణాదినమరింత శక్తి చేకూరాలంటే చంద్రబాబు సారధ్య అవశ్యకతను మోడీ ఢిల్లీ నాయకత్వం గుర్తించిందనటం సుస్పష్టం.కాంగ్రెస్ పార్టీని నామరూపాలు లేకుండా అంతం చేయాలనే రాజకీయ లక్ష్యంతో పురోగమిస్తున్న భారతీయ జనతాపార్టీ, మేధావంతుల నాయకత్వం తెలుగుదేశం పార్టీలవంటి రాజకీయ శక్తి, యుక్తుల్ని ఆహ్వానిస్తోంది.తొలిదశలో మద్దతుఇచ్చి నిల బెట్టి, తర్వాత విలీనం కోరటం సహజపరిణామం.ప్రస్తుత భారత దేశం అధికారం రాజ్యాధిపత్య ధోరణులు, బిజెపి సిద్ధాంత ఆచరణకు అనుగుణంగా త్వరితగతి రూపుదిద్దు కొంటున్నాయి.ఒకప్పుడు నాస్తిక రాజకీయవేత్తలుగా ఉన్న ప్రముఖులు, మత ధర్మాలను బాహాటంగా అధికారం సాధించే దృష్ట్యా ఔదలదాలుస్తున్నారు. జన సామాన్యంలో కూడా భక్తితత్త్వం పెల్లుబికుతోంది. మీడియా ప్రభుత్వాధినేతల కనుసన్నలలో, ఆస్తికతను పోషిస్తోంది. కాంగ్రెస్‌వంటి ప్రతి పక్షాలు కూడా, ఆస్తికత్వం వైపు మొగ్గుచూపి, జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. టూరిజం అన్ని ఇజాలకు అతీతంగా, క్షేత్ర మహత్మ్య సందర్శనలకు ప్రాధాన్యం ఇస్తోంది. వందే భారత్ రైళ్లు, విమానాలు శరవేగంతో సహకరిస్తున్నాయి. ఇక తెలుగునాట సినీ ప్రపంచం ఆస్తిక భావజాలం శృతిమించి ప్రదర్శిస్తున్నా రాజకీయం ప్రోత్సహిస్తోంది. గతంలో సుదీర్ఘంగా రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు భారత ప్రధాని మోడీ, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించడం రాజకీయ విశ్లేషకులకు, దక్షిణాది ఆధిపత్య పరిణామాల పట్ల ఆసక్తికరమైన ఆలోచనలకు కారణం అవుతున్నాయి. ●

# రాజకీయం అంటే అధికారం కాదు.. బాధ్యత



- సాధారణ కార్యకర్తల మద్దతుతో అధ్యక్షుడినయ్యా
- బిజెపి కొత్త జాతీయ సారథి నితిన్ నబిన్ వెల్లడి
- సంప్రదాయాలను గౌరవించని పార్టీలకు రాజకీయాల్లో చోటులేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జనవరి 20:** బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ అధికారికంగా మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. ఈ రోజు తనకు ఒక సంకల్ప దినమని, తాను కేవలం ఒక పదవిని కాదు, బాధ్యతను కూడా స్వీకరిస్తున్నానని అన్నారు. "రాజకీయం అంటే అధికారం కాదు, అది ఒక ఆధ్యాత్మిక సాధన. అది భోగభాగ్యాలు కాదు, త్యాగం. అది విలాసం, సౌకర్యం కాదు, అది నిరాడంబరత. రాజకీయం అంటే అధికార స్థానం కాదు, అది బాధ్యత," అని నబిన్ అన్నారు. పార్టీ కార్యకర్తలకు, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, సాధారణ కార్యకర్తల మద్దతు వల్లే తాను పార్టీలో అత్యున్నత సంస్థాగత స్థానానికి చేరుకోగలిగానని నబిన్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. జాతీయ సేవ పట్ల ఆయనకున్న నిబద్ధత నుండి బిజెపి కార్యకర్తలు నిరంతరం స్ఫూర్తి పొందుతున్నారని అన్నారు. గుజరాత్‌లోని ఆనంద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రితో తన తొలి పరిచయాలను గుర్తుచేసుకుంటూ, ప్రజలతో భావోద్వేగంగా మమేకమైనప్పుడే నిజమైన నాయకత్వం వస్తుందని తాను నేర్చుకున్నానని నబిన్ చెప్పారు. అభివృద్ధి చెందిన భారతదేశం అనే కలను ఈ రోజు 140 కోట్ల మంది పౌరులు పంచుకుంటున్నారని, ఆ దార్శనికతను అందించినందుకు ప్రధానమంత్రికి ఘనత దక్కుతుందని ఆయన అన్నారు. జెపి నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు బిజెపి జాతీయ అధ్యక్షులుగా సంవత్సరాలుగా పార్టీ సంస్థను బలోపేతం చేయడంలో వారి పాత్రను ఆయన గుర్తించారు. పార్టీ సైద్ధాంతిక విధానాన్ని ప్రస్తావిస్తూ, "దేశమే ప్రథమం, పార్టీ తదుపరి, స్వప్రయోజనం చివరిది" అనే సూత్రంతో పనిచేస్తుందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు వంటి ప్రధాన జాతీయ నిర్ణయాలను కూడా ఆయన ప్రస్తావిస్తూ, అది జమ్మూ కాశ్మీర్‌లోని పరిస్థితిని మార్చివేసిందని అన్నారు. తమిళనాడు, అసోం, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయం సాధిస్తుందని నబిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల కఠోర శ్రమ, అంకితభావం ఈ ఐదు రాష్ట్రాల్లో విజయాన్ని అందిస్తాయని ఆయన అన్నారు. సాంస్కృతిక, మతపరమైన సంప్రదాయాలలో జోక్యం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి సంప్రదాయాలను వ్యతిరేకించే శక్తులకు భారత రాజకీయాలలో చోటు ఉండకూడదని నొక్కి చెప్పారు.

**బిజెపి కొత్త చీఫ్‌కు జెడ్‌కేటగిరీ భద్రత**

బిజెపి నూతన జాతీయాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దీం ఇకపై సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) కమాండోలు నితిన్ నబిన్‌కు రక్షణ కవచంగా వ్యవహరించనున్నారు. ఈ ఆదేశాల ప్రకారం... నితిన్ నబిన్ దేశవ్యాప్తంగా పర్యటించేటప్పుడు, బహిరంగ సభల్లో పాల్గొనే సమయంలో, అలాగే ఆయన నివాసం వద్ద సీఆర్పీఎఫ్ దళాలు 24 గంటలూ పహారా కాస్తాయి. సాధారణంగా కీలక రాజకీయ నేతలు, కేంద్ర మంత్రులకు ఇలాంటి ఉన్నతస్థాయి భద్రత కల్పిస్తారు. గతంలో బిజెపి అధ్యక్షుడిగా పనిచేసిన జెపి నడ్డాకు కూడా ఇదే తరహా భద్రతను కొనసాగించారు.



## గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరికకు
# మాక్రాన్ తిరస్కృతి

### షాంపేన్‌పై 200% సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరిక

**దావోస్, జనవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. గాజా పునర్నిర్మాణం కోసం తాను ప్రతిపాదించిన శాంతి మండలి బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరేందుకు విముఖత చూపించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఫ్రాన్స్ నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వైన్, షాంపేన్ లపై ఏకంగా 200 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. అయితే, టారిఫ్ లు విధిస్తానంటూ ట్రంప్ చేస్తున్న బెదిరింపులకు తాము లొంగబోమని మాక్రాన్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ తో జరిగిన యుద్ధంలో గాజా పూర్తిగా చితికిపోయిన విషయం తెలిసిందే. యుద్ధం జరుగుతున్న సమయంలోనే గాజా పునర్నిర్మాణ బాధ్యత తమదేనని ట్రంప్ ప్రకటించారు. శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించి ఇజ్రాయెల్ తో యుద్ధం విరమింపజేశారు. గతంలో చెప్పినట్లుగానే గాజా పునర్నిర్మాణం దిశగా ట్రంప్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే శాంతి మండలి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ అందులో చేరాలంటూ వివిధ దేశాలకు ఆహ్వానం పలికారు. ఫ్రాన్స్ కు కూడా ఆహ్వానం పలకగా మాక్రాన్ సున్నితంగా తిరస్కరించారు. శాంతి మండలి నిబంధనలు గాజా ప్రాంతానికే పరిమితం కాదని, మండలి పరిధి విస్తృతంగా ఉందని మాక్రాన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. అందుకే ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు మాక్రాన్ వెల్లడించారు. రష్యా, అర్జెంటీనా, భారత్, పాకిస్థాన్ సహా పలు దేశాలను శాంతి మండలిలో చేర్పించేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. దావోస్‌లో జరగనున్న సదస్సులో దీనిపై సంతకాలు చేయించాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఈ మండలిలో శాశ్వత సభ్యత్వం ఆశించే దేశాలు కనీసం 1 బిలియన్ డాలర్ల నిధులు సమకూర్చాలని ట్రంప్ నిబంధన పెట్టారు. ఈ నిబంధనను అమెరికా బలవంతపు వసూళ్లుగా ప్రపంచదేశాలు అనుమానిస్తున్నాయి.



## అట్టహాసంగా కేరళ మహాకుంభ్ ప్రారంభం

**తిరువనంతపురం, జనవరి 20:** కేరళలోని తిరునావాయలో నీల నది తీరంలో కేరళ కుంభ మేళాగా పిలిచే మహా మాఘ మహోత్సవం ప్రారంభమైంది. ఈ మహోత్సవాన్ని రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ధర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ సనాతన సంప్రదాయాన్ని, హిందూ ఆచారాలను ప్రశంసించారు. సనాతన సంప్రదాయాన్ని పాటించడం అంటే మరెవరికో వ్యతిరేకం కాదని ఆయన అన్నారు. భారతదేశం అందరినీ తనలో కలుపుకుని ముందుకు సాగుతుందని అన్నారు. నీల నదిని భరతపూజ నది అని కూడా అంటారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మహా మాఘ మహోత్సవాన్ని సుమారు 270 సంవత్సరాల తర్వాత పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. చివరి పూర్తిస్థాయి మహా మాఘ మహోత్సవం 1755లో జరిగిందని రికార్డులు వెల్లడిసున్నాయి. మంగళవారం ప్రారంభమైన ఈ మాఘ మహోత్సవం ఫిబ్రవరి 3 వరకు 15 రోజుల పాటు కొనసాగుతుంది. కేరళ, తమిళనాడుతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానమాచరిస్తారు. ఈసారి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. మాఘ మహోత్సవం సందర్భంగా కేరళ ఆర్టీసీ సుమారు 100 బస్సులను ఏర్పాటు చేసింది. ఈ పదిహేను రోజుల పాటు పాండిత్య చర్చలు, కలరిపయట్టు, యోగా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

# భారతీయ ఉద్యోగుల్లో వింత అసంతృప్తి

### 64% మాత్రమే ఉద్యోగంలో సంతృప్తి

**న్యూఢిల్లీ,జనవరి 20:** భారత్‌లోని ఉద్యోగుల్లో ఓ ఆసక్తికరమైన వైరుధ్యం కనిపిస్తోంది. దాదాపు 95 శాతం మంది తమ నైపుణ్యాలపై పూర్తి విశ్వాసంతో ఉన్నప్పటికీ, కేవలం 64 శాతం మంది మాత్రమే తమ ఉద్యోగంతో సంతృప్తిగా ఉన్నట్లు మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా ఉద్యోగుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించి మంగళవారం విడుదలచేసింది. నివేదిక ప్రకారం తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించగలమనే నమ్మకం 95 శాతం మందిలో ఉంది. కెరీర్ డెవలప్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని 90 శాతం, ప్రమోషన్లు వస్తాయని 84 శాతం, ఏఐ టెక్నాలజీని వాడటంలో నమ్మకంగా ఉన్నామని 90 శాతం మంది తెలిపారు. ఈ ఆత్మవిశ్వాసం వారిలో ఉద్యోగ సంతృప్తిని పెంచడం లేదని నివేదిక స్పష్టం చేసింది. సుమారు 53 శాతం మంది రోజూ తీవ్రమైన లేదా ఒక మోస్తరు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తేలింది. మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, మిడిల్ ఈస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ గులాటి మాట్లాడుతూ అధిక పనిభారం, ఎక్కువ పని గంటల కారణంగా 75 శాతం మంది బర్న్‌అవుట్‌కు గురవుతున్నారు. చాలామంది కొత్త అవకాశాల కోసం చూస్తున్నప్పటికీ, దాదాపు సగం మంది భద్రత కోసం ఉన్న ఉద్యోగాన్నే అంటిపెట్టుకుని ఉంటున్నారు" అని వివరించారు. బ్లూకాలర్ వర్కర్లలో (68 శాతం) శ్రేయస్సు తక్కువగా ఉండగా, జెన్‌జెడ్ మహిళలు (64 శాతం) అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వైట్‌కాలర్, సీనియర్ మేనేజర్లు తమ పనిలో సంతృప్తి పొందుతున్నప్పటికీ, వారే అత్యంత ఒత్తిడికి గురవుతున్న గ్రూపులుగా ఉన్నారని తేలింది. రంగాల వారీగా చూస్తే, ఎనర్జీ, యుటిలిటీస్ రంగంలో ఉద్యోగుల శ్రేయస్సు 72 శాతం అత్యల్పంగా ఉంది. హెల్త్‌కేర్ 52 శాతం, ఫైనాన్షియల్స్ 50 శాతం రంగాల వారు ఉద్యోగ భద్రతపై తక్కువ నమ్మకంతో ఉన్నారు. కేవలం నైపుణ్యాలపై విశ్వాసం ఉంటే సరిపోదని, ఉద్యోగులను నిలుపుకోవాలంటే కంపెనీలు స్పష్టమైన కెరీర్ మార్గాలు, మేనేజర్లపై నమ్మకం, ఉద్యోగుల సంక్షేమంపై పెట్టుబడి పెట్టాలని సందీప్ గులాటి సూచించారు.

# కర్ణాటక ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిపి సస్పెన్షన్



### రాసలీలల అధికారిపై సిఎం సీరియస్

**బెంగళూరు, జనవరి 20:** ఆఫీసు ఛాంబర్‌లోనే పలువురు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారి, డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీపీ డాక్టర్ కె. రామచంద్రరావును కర్ణాటక ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సిబ్బంది, పరిపాలన సంస్కరణల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రవర్తన ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందని, ప్రభుత్వ ఉద్యోగికి తగనిదని ఉత్తర్వుల్లో పేర్కొంది. రామచంద్రరావు తన కార్యాలయంలో పలువురు మహిళలతో సన్నిహితంగా మెలుగుతున్న వీడియోలు ఇటీవల సోషల్ మీడియాలో, పలు న్యూస్ ఛానళ్లలో విస్తృతంగా ప్రసారమయ్యాయి. ఈ వీడియోల ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన ప్రవర్తన అఖిల భారత సర్వీసుల (ప్రవర్తనా) నిబంధనలు 1968లోని రూల్ 3ను ఉల్లంఘించడమేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చాం. అందుకే విచారణ పూర్తయ్యే వరకు ఆయన్ను తక్షణమే సస్పెన్షన్‌లో ఉంచుతున్నామని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సస్పెన్షన్ కాలంలో ఆయనకు నిబంధనల ప్రకారం జీవనభృతి చెల్లిస్తామని, ప్రభుత్వ అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని స్పష్టం చేసింది. వైరల్ అయిన వీడియో క్లిప్పులలో రామచంద్రరావు తన అధికారిక ఛాంబర్‌లో యూనిఫాంలో ఉండగా మహిళను ముద్దుపెట్టుకోవడం కనిపించింది. మరో వీడియోలో సూట్‌లో ఉండగా, జాతీయ జెండా, పోలీస్ శాఖ చిహ్నం ముందు అదే తరహా ప్రవర్తన కనబరిచారు. ఈ వివాదంపై రామచంద్రరావు స్పందిస్తూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. అవన్నీ మార్ఫింగ్ చేసిన వీడియోలని, అలాంటి సంఘటన ఏదీ జరగలేదని తెలిపారు. ఈ విషయంపై తన న్యాయవాదితో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటానని చెప్పారు. వివరణ ఇచ్చేందుకు ఆయన హోంమంత్రి జి. పరమేశ్వర కార్యాలయానికి వెళ్లగా, ఆయన్ను కలిసేందుకు మంత్రి నిరాకరించినట్లు సమాచారం. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హోం శాఖ నుంచి నివేదిక కోరారు.

# మేనకగాంధీపై సుప్రీంకోర్టు అసహనం!

**న్యూఢిల్లీ, జనవరి 20:** వీధి శునకాల అంశానికి సంబంధించి తాము ఇచ్చిన తీర్పుపై కేంద్ర మాజీ మంత్రి మేనకాగాంధీ చేసిన విమర్శలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఆమె కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారంటూ మండిపడింది. అయినప్పటికీ న్యాయస్థానం ఔన్నత్యం దృష్ట్యా ఆమెపై చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. వీధి శునకాల అంశంపై న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతా, ఎన్‌వీ అంజారియాలో కూడిన సుప్రీం ధర్మాసనం మరోసారి మంగళవారం విచారణ జరిపింది. కోర్టు ఆచితూచీ వ్యవహరించాలని మీరు చెబుతారు. అయితే మీ క్లయింట్ ఎలాంటి వ్యాఖ్యలు చేశారో ఆమెను అడిగారా ఆమె ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతి ఒక్కరిపై వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆ సమయంలో ఆమె తీరు గమనించారా అని మేనకాగాంధీ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ రాజు రామచంద్రన్‌ను సుప్రీం బెంచ్ ప్రశ్నించింది. మేనకాగాంధీ మాజీ మంత్రిగా ఉన్నప్పుడు వీధి కుక్కల సమస్యను నివారించేందుకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరిపారని జస్టిస్ మెహతా ప్రశ్నించారు. శునకాలకు ఆహారం పెట్టేవారని జవాబుదారీ చేయాలని కోర్టు అంత తేలిగ్గా వ్యాఖ్యానించలేదని, సమస్య తీవ్రతను బట్టే వ్యాఖ్యానించిందని అన్నారు. కుక్కకాటు ఘటనల్లో రాష్ట్ర ప్రభుత్వాలు భారీ పరిహారం చెల్లించాలని, అలాంటి కేసుల్లో శునకాలకు ఆహారం పెట్టేవారిని జవాబుదారీ చేయాలని జనవరి 13న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది.

## సంక్షిప్తంగా..

### తిలకం పెట్టుకు వచ్చాడని హిందూబాలుడిపై వివక్ష



లండన్, జనవరి 20: తిలకం పెట్టుకుని స్కూలుకు వెళ్లిన ఎనిమిదేళ్ల బాలుడికి వింత పరిస్థితి ఎదురైంది. నుదుట తిలకం చూసి ఇదేం ఆచారమంటూ తోటి పిల్లలతో పాటు టీచర్లు కూడా పదేపదే ఆరాతీస్తూ ప్రత్యేకంగా చూడడంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యాడు. బాలుడి పరిస్థితి గమనించిన తల్లిదండ్రులు ఆ స్కూలు మానిపించేసి మరో స్కూలులో చేర్పించారు. లండన్ లోని ఓ స్కూలులో ఈ ఘటన చోటుచేసుకుంది. లండన్ లోని హిందూ కుటుంబానికి చెందిన బాలుడు ఇటీవల నుదుట తిలకం పెట్టుకుని స్కూలుకు వెళ్లాడు. తిలకంతో వచ్చిన ఆ బాలుడిని తోటి విద్యార్థులు వింతగా చూశారు. టీచర్లు సైతం ఆశ్చర్యంగా బాలుడి మతవిశ్వాసాల గురించి ఆరాతీశారు.

### అక్షయ్‌కుమార్ భద్రతాసిబ్బంది కారుకు ప్రమాదం!

ముంబయి,జనవరి 20: బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ భద్రతా సిబ్బంది ప్రయాణిస్తున్న కారు ముంబైలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. అయితే, ప్రమాద సమయంలో కారులో అక్షయ్ కుమార్ గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ లేరని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ముంబై పోలీసుల కథనం ప్రకారం నగరంలోని జుహూ ప్రాంతంలో ఉదయం 9 గంటల సమయంలో ఈ యాక్సిడెంట్ జరిగింది. అక్షయ్ కుమార్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది కోసం వినియోగించే కారును ఎదురుగా వస్తున్న ఓ ట్రక్కు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడగా, వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

### మీడియాకు పాకిస్థాన్ ఫోబియా: ఫరూక్ అబ్దుల్లా

**శ్రీనగర్, జనవరి 20:** మీడియాకు పాకిస్థాన్ ఫోబియా ఉందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాతీవ్ర వ్యాఖ్యలుచేసారు. పాకిస్థాన్‌తో భారత్ చర్చలు జరపాలా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. పొరుగు దేశాలను మార్చలేమని గతంలో మాజీ ప్రధాని వాజపేయి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారతదేశం కోసం తాము గతంలో బుల్లెట్లను ఎదుర్కొన్నామని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. అవసరమైతే దేశం కోసం మళ్ళీ బుల్లెట్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు జమ్ము కశ్మీర్‌లో రాళ్ల దాడులు, ఉగ్రవాదాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని బీజేపీ చేసిన ఆరోపణలను ఫరూక్ అబ్దుల్లా ఖండించారు.

### మ్యూజిక్ ఫెస్టివల్‌లో భారత యువకుడు మృతి

**ఫుకెట్,జనవరి 20:** థాయ్‌లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఫుకెట్‌లో ఓ భారతీయ యువకుడు అనుమానాస్పద రీతిలో మరణించాడు. మృతుడిని 28 ఏళ్ల జైన్ సాక్షమ్‌గా గుర్తించారు. ఓ మ్యూజిక్ ఫెస్టివల్‌కు హాజరైన తర్వాత ఈ నెల 18న తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. అతని శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో మృతికి గల కారణాలు అంతుచిక్కడం లేదు. ఫుకెట్‌లోని చెర్‌ంగ్ తలే ప్రాంతంలో జరిగిన ఎలక్ట్రిక్ డైసీ కార్నివాల్ అనే మూడు రోజుల మ్యూజిక్ ఫెస్టివల్‌కు జైన్ సాక్షమ్ హాజరయ్యాడు. కార్యక్రమం ముగిశాక,

సమీపంలోని పార్కింగ్ ప్రదేశానికి వెళ్లి అక్కడ వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆసుపత్రికి చేరేసరికి అతను షాక్‌లో ఉన్నాడని, కాసేపటికే స్పృహ కోల్పోయాడని వైద్యులు తెలిపారు. చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ, అతను మరణించాడు.

### శబరిమల ఆలయం మూసివేత

**పతనంతిట్ట, జనవరి 20:** కేరళలోని ప్రఖ్యాత శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా సాగిన మండల-మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర మంగళవారం ఉదయంతో ముగిసింది. సంప్రదాయబద్ధమైన పూజల అనంతరం ఉదయం 6:45 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు ప్రకటించింది. ఆనవాయితీ ప్రకారం పందలం రాజ కుటుంబ ప్రతినిధి పునర్తం నాళ్ నారాయణ వర్మ చివరి దర్శనం చేసుకున్న తర్వాత ఆలయాన్ని మూసివేశారు. అంతకుముందు ఉదయం 5 గంటలకు గణపతి హోమంతో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధాన పూజారి ఈడీ ప్రసాద్ నంబూద్రి, అయ్యప్ప స్వామి విగ్రహానికి విభూతి అభిషేకం నిర్వహించి, రుద్రాక్ష మాలతో అలంకరించారు. అనంతరం పవిత్రమైన హరివరాసనం గానం తర్వాత గర్భగుడి తలుపులను మూసివేశారు.

# 3 కిలోల వెండి శుభలేఖ

### కూతురి పెళ్లి చిరస్మరణీయం చేసిన తండ్రి



**జైపూర్, జనవరి 20:** కూతురి పెళ్లిని చిరస్మరణీయం చేయాలని ఓ తండ్రి చూపిన ప్రేమ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. జైపూర్‌కు చెందిన శివ్ జోహ్రి, తన కుమార్తె శ్రుతి జోహ్రి వివాహానికి ఏకంగా 3 కిలోల స్వచ్ఛమైన వెండితో ఓ అద్భుతమైన శుభలేఖను తయారు చేశారు. దీని విలువ సుమారు రూ. 25 లక్షలు. ఒక్క మేకు లేదా స్క్రూ కూడా వాడకుండా 128 వెండి ముక్కలతో ఈ పత్రికను రూపొందించారు. ఈ వెండి పత్రికపై 65 మంది దేవతామూర్తులను అత్యంత సుందరంగా చెక్కారు. పైన వినాయకుడి విగ్రహంతో పాటు "శ్రీ గణేశాయ నమః" అని రాసి ఉంది. గణేశుడికి కుడివైపు పార్వతీదేవి, ఎడమవైపు పరమశివుడు కొలువై ఉండగా, వారి కింద లక్ష్మీదేవి, విష్ణుమూర్తి విగ్రహాలు ఉన్నాయి. శ్రీకృష్ణుడి జీవిత ఘట్టాలు, విష్ణువు దశావతారాలు, అష్టలక్ష్మి స్వరూపాలు, సూర్యభగవానుడు, వేంకటేశ్వరస్వామి వంటి అనేక దైవ స్వరూపాలు ఈ పత్రికపై దర్శనమిస్తాయి. ఈ పత్రికను తానే స్వయంగా ఏడాది పాటు శ్రమించి తయారు చేశానని తండ్రి శివ్ జోహ్రి తెలిపారు. నా కుమార్తె పెళ్లికి బంధువులనే కాదు, దేవతలందరినీ కూడా ఆహ్వానించాలనుకున్నాను. నా బిడ్డకు తరతరాలు గుర్తుంచుకునేలా ఓ కానుక ఇవ్వాలన్నది నా కోరిక. ఆరు నెలల ఆలోచన తర్వాత ఈ ప్రత్యేకమైన శుభలేఖను తయారు చేయాలని నిర్ణయించుకుని, ఏడాది పాటు పనిచేశానని ఆయన వివరించారు. పత్రిక మధ్యలో వధూవరులు శ్రుతి జోహ్రి, హర్ష్ సోనీ పేర్లను చెక్కారు. వారి పేర్ల చుట్టూ ఏనుగులు పూల వర్షం కురిపిస్తున్నట్టుగా డిజైన్ చేశారు. లోపలి భాగంలో సంప్రదాయ పత్రికల మాదిరిగానే ఇరు కుటుంబాల సభ్యుల పేర్లను కూడా వెండిఅక్షరాల్లోనే ముద్రించారు.

# 'వాలెంటినో' బ్రాండ్ ఫౌండర్ వాలెంటినో గురవాని కన్నుమూత



**రోమ్, జనవరి 20:** ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్, వాలెంటినో బ్రాండ్ వ్యవస్థాపకుడు వాలెంటినో గరవాని (93) కన్నుమూశారు. రోమ్‌లోని తన నివాసంలో ఆయన ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు ఆయన ఫౌండేషన్ అధికారికంగా ప్రకటించింది. వయోభారంతోనే ఆయన మరణించినట్లు తెలుస్తోంది. వాలెంటినో తన కుటుంబ సభ్యుల సమక్షంలో కన్నుమూసినట్లు ఫౌండాజియోన్ వాలెంటినో గరవాని జియాన్కార్లో గియామెట్టి ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన మృతి పట్ల ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. "వాలెంటినో స్టైల్, సౌందర్యానికి తిరుగులేని మాస్టర్. ఇటాలియన్ హై ఫ్యాషన్‌కు శాశ్వత చిహ్నం. ఇటలీ ఒక లెజెండ్‌ను కోల్పోయింది" అని ఆమె నివాళులర్పించారు. 1932లో జన్మించిన వాలెంటినో, 1960లో తన భాగస్వామి జియాన్‌కార్లో గియామెట్టితో కలిసి రోమ్‌లో ఫ్యాషన్ హౌస్‌ను ప్రారంభించారు. దాదాపు 50 ఏళ్ల పాటు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలిన ఆయన 2008లో రిటైర్ అయ్యారు. ఆయన సృష్టించిన ప్రత్యేకమైన ఎరుపు రంగు వాలెంటినో రెడ్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. జాక్వెలిన్ కెన్నెడీ, ప్రిన్సెస్ డయానా వంటి ఎందరో ప్రముఖులకు ఆయన దుస్తులు డిజైన్ చేశారు. వాలెంటినో అంత్యక్రియలు ఈనెల 23న రోమ్‌లో జరగనున్నాయి. జనవరి 21, 22 తేదీల్లో ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఫౌండేషన్ కార్యాలయంలో ఉంచుతారు.

# బిజినెస్, టూరిస్టు వీసాలకోసం ఇక 'వీసాబాండ్'

### అమెరికా వెళ్లే వారికి కొత్త నిబంధనలు

**వాషింగ్టన్, జనవరి 20:** అమెరికా వెళ్లాలనుకునే వారికి, ముఖ్యంగా బిజినెస్, లేదా టూరిస్ట్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఆ దేశ విదేశాంగ శాఖ వీసాబాండ్ తెచ్చింది. కొన్ని ఎంపిక చేసిన దేశాల పౌరులకు కొత్తగా 'వీసా బాండ్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిబంధన కింద, వీసా మంజూరు చేయడానికి ముందు దరఖాస్తు దారులు 5,000 డాలర్ల నుంచి 15,000 డాలర్ల (సుమారు రూ.4.5 లక్షల నుంచి రూ.13.6 లక్షలు) వరకు బాండ్‌ను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ పైలట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మొత్తం 38 దేశాలను గుర్తించారు. ఈ జాబితాలో అల్జీరియా, అంగోలా, ఆంటిగ్వా అండ్ బార్బుడా, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, నైజీరియా, అల్జీరియా, అంగోలా, క్యూబా, ఉగాండా, వెనిజులా, జాంబియా, జింబాబ్వే, తజికిస్థాన్, టాంజానియా, ఫిజీ వంటి దేశాలు ఉన్నాయి. అయితే, ఈ జాబితాలో భారత్ పేరు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ నిబంధన కేవలం ఎంపిక చేసిన దేశాల పౌరులకు మాత్రమే వర్తిస్తుంది. వీసా ఇంటర్వ్యూ సమయంలో కాన్సులేట్ అధికారి, దరఖాస్తు దారుడి ప్రొఫైల్‌ను పరిశీలించి బాండ్ అవసరమా లేదా అని నిర్ణయిస్తారు. బాండ్ అవసరమని భావిస్తే 5,000, 10,000, లేదా 15,000 డాలర్లలో ఎంత మొత్తం చెల్లించాలో కూడా వారే నిర్దేశిస్తారు. అలా నిర్దేశించిన తర్వాత, దరఖాస్తు దారులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి చెందిన ఫారం 352 పూర్తి చేసి, యూఎస్ ట్రెజరీ అధికారిక ప్లాట్‌ఫామ్ ద్వారా మాత్రమే బాండ్ మొత్తాన్ని చెల్లించాలి. ఇతర థర్డ్‌పార్టీ వెబ్‌సైట్ల ద్వారా చెల్లింపులు చేయవద్దని, అలాంటి వాటికి తాము బాధ్యత వహించబోమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కాన్సులర్ అధికారి సూచన లేకుండా బాండ్ చెల్లించినా, మొత్తం తిరిగి రాదు. బాండ్ చెల్లించినా వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు.

# ప్రజావేదిక అర్జీలన్నీ పరిష్కరిస్తాం

- ఎన్టీఆర్ భవన్‌లో మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రజల నుంచి సమస్యల అర్జీల స్వీకరణ



విజయవాడ, జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజలతో నేరుగా అనుసంధానం అవ్వాలంటే అందుకు ప్రజా వేదిక ద్వారానే సాధ్యమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వ్యక్తిగత, సామాజిక, పరిపాలనా సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ప్రజా వేదికకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. భూవివాదాలు, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, ఉపాధి, పింఛన్లు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి అర్జీని మంత్రి స్వయంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా వినడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల ముఖ్య లక్ష్యం. ప్రజల వద్దకు వెళ్లి వారి ఇబ్బందులను తెలుసుకొని పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ విధానం అని అన్నారు. ప్రజలు భయపడకుండా, ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమర్పించిన అర్జీలన్నింటినీ సంబంధిత శాఖలకు పంపించి దశలవారీగా పరిష్కారం చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రతి అర్జీకి న్యాయం జరిగేలా చర్యలు ఉంటాయని మంత్రిగారు భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలు

- 2029 ఎన్నికలకు ముందే నీళ్లు తరలిస్తాం
- ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, శ్రీనివాసులు



కళ్యాణదుర్గం, జనవరి 20 ప్రభాతవార్త: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లి సమీపంలో గత ఏడాది జులై 5న బీటీపీ కాలువ పునఃప్రారంభించి, ఇప్పటి వరకు జరుగుతున్న పనుల పురోగతిని కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాల్వ శ్రీనివాసులు పరిశీలించారు. ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించి, మరింత వేగంగా పనులు జరిగేందుకు ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారాన్ని వీలైనంత త్వరగా ఇచ్చేలా ప్రతిపాదనలు పంపాలని సంబంధిత ఇంజనీయర్లు, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లు జగన్ రెండు సార్లు రాయదుర్గం, కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవాలకు వచ్చి రెండు నెలల్లో రైతులకు పరిహారం అందిస్తామని, మరోసారి వెళ్లిన వెంటనే భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇస్తానని మాట ఇచ్చి మడమ తిప్పాడన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన ఉషాశ్రీ చరణ్ భూదందాలు, కబ్జాలు, అక్రమ సంపాదనపైనే దృష్టి పెట్టి బీటీపీ ప్రాజెక్టను గాలికి వదిలేసిందన్నారు. తాము చేస్తున్న పనులను చూసి రైతులు స్వచ్ఛందంగా భూముల్లో కాలువ తవ్వేందుకు అంగీకరిస్తున్నారంటే, ఈ ప్రాంతానికి నీటి ప్రాధాన్యత ఎంతుందో అర్థం చేసుకుని, ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లి పనులు ప్రారంభించామన్నారు. కృష్ణా జలాలు వస్తే రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలు పూర్తి స్థాయిలో హార్టికల్చర్ హబ్‌గా తయారై దేశంలోనే అత్యంత నాణ్యమైన పంట ఉత్పత్తులు పండిస్తారని అన్నారు. కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రెండు మండలాల్లో ఉన్న 22 వేల ఎకరాలకు సాగునీరు అందుతాయని, అంతే కాకుండా బోరు బావులు రీచార్జ్ అయి రైతులు పంటలు పండించుకుని వలసల నుండి రైతులు విముక్తి పొందుతారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా 2029లోగా కృష్ణా జలాలతో బిటిపితో పాటు కళ్యాణదుర్గం 114 చెరువులను సాగునీటితో నింపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 23నుంచి శుభే ఆంధ్రాకే ఖురానోకా దీనీ ఇజ్తెమా



కడప, జనవరి 20 ప్రభాతవార్త: జనవరి 23, 24, 25 తేదీలలో జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి "శుభే ఆంధ్రాకే ఖురానోకా దీనీ ఇజ్తెమా" కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కడప జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం వైయస్ ఆర్ కడప జిల్లా సికె దిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామికవాడలో నిర్వహించే ఇస్తేమా కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్ల పై మంత్రులు ఎస్.సవిత, ఎన్.ఎం.డి ఫరూక్, రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణచైతన్య రెడ్డితో కలిసి అధికారులు, కార్యవర్గ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత మాట్లాడుతూ మైనార్టీ సోదరులు నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమంను మైనార్టీ సోదరులు ఎంతో నిజాయితీగా, సేవాభావంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, ఇది చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే అతి పెద్ద మైనార్టీ పండుగగా ఈ ఇస్తేమా ఉంటుందన్నారు. రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ మంత్రి మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే ఇస్తేమా కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణ నుండి కూడా ముస్లిం సోదరులు రావడం జరుగుతుందనన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇస్తేమా కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలనన్నారు. ఈ సమీక్షలో డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడు, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపిఐఐసి జెడ్ఎం శ్రీనివాసమూర్తి, డిపివో రాజ్యలక్ష్మి, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఆర్అండ్‌బి ఎస్ఈ చంద్ర శేఖర్, నాయకులు బిటెక్ రవి, అమీర్‌బాబు, తదితర అధికారులు, కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

విజయవాడ, జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: కార్మిక వర్గాలకు చంద్రబాబు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ఆర్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ప్రజావ్యతిరేక పాలన ఇక ఎంతో కాలం అధికారంలో కొనసాగదన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు చేసిన కుట్రలను ఒక్కొక్కటి ప్రజలకు అర్ధమవుతున్నాయన్నారు. త్వరలో చంద్రబాబు ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డిపి.వెంకటరమణ, ఏపీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎన్‌వి. సుధాకర్ రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, సోమశేఖర్ రెడ్డి, ఏపీఈపీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవి.సత్యనారాయణ, లక్ష్మీ [illegible]రావు, పలువురు యూనియన్ నాయకులు

# మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారాన్ని అందించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



విజయవాడ, జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఆర్‌టిజిఎస్‌పై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల్లో గతం కంటే పరిస్థితులు మెరుగయ్యాయని, అయితే మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందించడంతోపాటు పారిశుద్ధ్యం, తాగునీటి వసతులు మరింత మెరుగుపడాలన్నారు. ప్రజల సంతృప్తస్థాయి ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అమలును పర్యవేక్షించాలని సూచించారు. అన్న క్యాంటీన్లపై సంతృప్తి స్థాయి మెరుగ్గా ఉందని చెప్పారు. మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాల్లో దీనికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ అధికారులను ఆదేశించారు. ఆర్‌టిజిఎస్ కార్యకలాపాల ప్రగతిపైన ఆయన సమీక్ష నిర్వహించారు. సర్వైలెన్స్ కెమెరాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ కార్యదర్శి వినరుచంద్, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, సమాచారశాఖ డైరెక్టర్ విశ్వనాథన్, ఆర్‌టిజిఎస్ సిఇఒ ప్రఖర్‌జైన్, సంయుక్త కార్యదర్శి మలిక గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ నృత్య ప్రదర్శనలపై చర్యలు తీసుకోవాలి

విజయవాడ, జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: సంక్రాంతి పండగ సంస్కృతిని అసభ్య నృత్య ప్రదర్శనలు, కోట్ల రూపాయల కోడి పందేలతో దిగజార్చారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ ఆరోపించింది. కొత్త పంటలు, బంధవులతో గ్రామాలు కళకళలాడాల్సింది పోయి మహిళలను ఘోరంగా అవమానించే నృత్య ప్రదర్శనలు ఈ ఏడాది విస్తృతమవడంపై ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, సావిత్రి సంయుక్త ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. అసభ్య నృత్య ప్రదర్శనల కోసం ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసుకుని వేల సంఖ్యలో యువకులు అక్కడ పోగవుతుంటే పోలీసులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం ఇంత నిస్తేజంగా మారడంపై ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులను ఆయా పార్టీల నుంచి వెంటనే బహిష్కరించాలని కోరారు. నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ సంఘటన పట్ల ఎందుకు స్పందించలేదన్నారు. పండగల సందర్భంగా నీచమైన ప్రదర్శనలు జరగడం ఏ ధర్మమో ఆయన చెప్పాలన్నారు. భారతీయ సంస్కృతి గురించి మాట్లాడే బిజెపి నాయకులు, మంత్రులు ఇప్పుడు ఏమయ్యారన్నారు. మహిళలపై నీచంగా ప్రవర్తించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారంపై కలిసొచ్చే మహిళా, యువజన, విద్యార్థి సంఘాలను కలుపుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## అమరవీర జవాన్ కార్తీక్ విగ్రహ ఆవిష్కరణ

### - జవాన్ సేవలను కొనియాడిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్



బంగారుపాళ్యం, జనవరి 20 ప్రభాతవార్త: దేశ రక్షణలో ప్రాణాలు వదలిన అమరవీరుడు కార్తీక్ యాదవ్ విగ్రహావిష్కరణ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత ఏడాది జనవరి 25న నార్త్ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో జవాన్ కార్తీక్ యాదవ్ అమరుడయ్యాడు. రాగిమానుపెంట గ్రామంకు చెందిన వరదరాజులు, సెల్వి రెండవ కుమారుడు దేశ సైన్యంలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయాడు. అతని ప్రాణ త్యాగానికి స్ఫూర్తిగా అమర జవాన్ ట్రస్ట్ కార్తీక్ విగ్రహంను బంగారుపాళ్యంలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహంను కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ఆవిష్కరించి నివాళి అర్పించారు. అంతకుముందు బంగారుపాళ్యంలో విద్యార్థులు, మాజీ సైనికులు, తెలుగుదేశం నాయకులు, ప్రజలు జాతీయ జెండాలు చేపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక్ ధైర్య సాహసాలను కొనియాడారు. దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన కార్తీక్ మన మధ్య పుట్టడం గర్వకారణమన్నారు. కార్తీక్ కుటుంబానికి ప్రతి ఒక్కరు అండగా వుండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కార్తీక్ కుటుంబానికి ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో కార్తీక్ గుడి కట్టుకున్నాడన్నారు. భరతమాత రక్షణ కోసం దేనికైనా సిద్ధం అంటూ పోరాడిన కార్తీక్ వీరమరణం పొందారన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ జయచంద్రనాయుడు, మండల టిడిపి గౌరవ అధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, పార్టీ మండల కార్యదర్శి జనార్దన్‌గౌడు, నాయకులు కోదండయాదవ్, నాగరాజు, లోకనాథనాయుడు, కోకా ప్రకాష్, కమలనాథ రెడ్డి, బాలకృష్ణమనాయుడు, రాధాకృష్ణ, తహసిల్దారు షబ్బీర్ భాషా, సర్పంచ్‌లు తోట శ్రీహరి, ఉమాదేవి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. చివరిగా అమరులైన వీర జవాన్ తల్లిదండ్రులు సెల్వి, దేవరాజులును కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఇతర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఇందులో అమర జవాన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మామిడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా విచక్షణారహితంగా వాడితే దుష్పరిణామాలు



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శారద జయలక్ష్మీదేవి

సచివాలయం, జనవరి 20 ప్రభాతవార్త: వ్యవసాయంలో యూరియాను అధిక మోతాదులో విచక్షణారహితంగా వాడడం వల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. యూరియాను శాస్త్రీయ నిష్పత్తి (4:2:1)కి బదులుగా రైతులు విపరీతంగా (7:2:9:1) వాడుతున్నారన్నారు. దీనివల్ల నేల నిస్సారం కావడం, తెగుళ్ళు పెరగడం, పెట్టుబడి ఖర్చు పెరగడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడతాయన్నారు. ప్రభుత్వం శాస్త్రవేత్తలు సూచించిన కొన్ని ఆధునిక పద్దతుల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చున్నారు. దీనిలో భాగంగా 500ఎమ్ఎల్ బాటిల్ నానో యూరియా 45కిలోల బస్తా యూరియాతో సమానమన్నారు. భూసార పరీక్షల ద్వారా 20శాతం వరకు యూరియా వాడకాన్ని తగ్గించవచ్చున్నారు. వేప పూత పూసిన యూరియా (నీమ్ కోటెడ్ యూరియా) వాడకం వల్ల నత్రజనిని మొక్కలకు ఎక్కువ కాలం అందుబాటులో ఉంచుతుందన్నారు. యూరియా అనేది పంటకు మందు లాంటిదని, మోతాదు మించితే విషంగా మారుతుందన్నారు. సుస్థిర, లాభదాయక వ్యవసాయం కోసం శాస్త్రీయ పద్దతులు పాటించాలని ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీ దేవి తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న లావిద్యార్థి భవాని మృతదేహం

# లా విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం, జనవరి 20 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం నగరంలోని విజయనగర లా కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న భవాని(22) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నట్లు సమాచారం. రాప్తాడు మండలం గొల్లపల్లికి చెందిన భవానిను అనంతపురంలోని హాస్టల్ వద్ద రెండు రోజుల క్రితమే తండ్రి మల్లికార్జున వదిలి వెళ్ళినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అశోక్ నగర్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ భవాని కాలేజీకి వెళ్లి వచ్చేది. మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి భోజనం చేసి అనంతరం గదిలోకి వెళ్లినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. భవాని ఎంతసేపటికి గది తలుపులు తీయకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే భవాని గదిలో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉండిలో జంట హత్యలు?

- రైల్వే స్టేషన్ సమీపంలో పురుషుని మృతదేహం
- ఇంట్లో మంచానికి కట్టేసి ఉన్న మహిళ మృతదేహం
- కేసు నమోదు, డిఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు





ఉండి, జనవరి 20 ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఉండిలోని స్థానిక నిమ్మన్నపేటలో గత కొంతకాలంగా సహజీవనం చేస్తున్న జంట సోమవారం హత్యకు గురయ్యారు. ఉండి రైల్వే స్టేషన్ సమీపంలో పంట పొలాల్లోని పురుషుని మృతదేహం గుర్తించిన పోలీసులు మృతుడు కాపురం ఉంటున్న ఇంటిలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఉండిలో కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు, అందించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం గుత్తుల వారి పాలెం కు చెందిన దొంగ సుబ్బారావుకు (47) అదే ప్రాంతానికి చెందిన విజయలక్ష్మితో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. గత ఏడాది జూలై నెలలో వీరిద్దరని ఒకే గదిలో గుర్తించిన సుబ్బారావు భార్య వారిని నిలదీసి పెద్దలలో పెట్టారు. దీనిపై పెద్దలు పంచాయితీ పెట్టి వీరిద్దరిని చెట్టుకు కట్టేసి పనిష్మెంట్ ఇచ్చినట్లు పోలీసు విచారణలో తేలింది. అప్పటినుంచి సుబ్బారావు తన భార్య పిల్లలను వదిలి ఉండిలో స్థానిక నిమ్మలపేటలోని ఒక ఇల్లు అద్దెకి తీసుకొని కాపురం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా గత ఆదివారం తాను చర్చికి వెళ్తున్నట్లుగా విజయలక్ష్మి తన కుమార్తెకు చెప్పి ఉండిలో సుబ్బారావు ఇంటికి వచ్చేసింది. అయితే తన తల్లి ఎప్పటికీ రాకపోవడంతో విజయలక్ష్మి కుమార్తె పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు పెట్టింది. కాగా సోమవారం సుబ్బారావు మృతదేహాన్ని ఉండి రైల్వే స్టేషన్ పక్కన ఉన్న పంట పొలాల్లో గుర్తించిన పోలీసులు సుబ్బారావు మృతదేహం పక్కన పడి ఉన్న మూడు సెల్ ఫోన్లు ఆధారంగానూ అలాగే సుబ్బారావు మొలతాడుకు ఉన్న తాళం చెవి ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. సుబ్బారావు మృతదేహం దగ్గర పడి ఉన్న సెల్ ఫోన్ లో ఒకటి విజయలక్ష్మికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. విజయ లక్ష్మి సెల్ ఫోన్‌ను ఫ్లైట్ మోడ్ నుంచి తీయగా కొద్ది సమయంలోనే విజయలక్ష్మి కుమార్తె నుంచి ఫోన్ రింగ్ అయింది. ఆ ఫోను ఆన్సర్ చేసిన పోలీసులకు తాను ఈ ఫోన్ తాలూకా విజయలక్ష్మి కుమార్తెనని, విజయలక్ష్మి మిస్ అయినట్లు తాను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు కొత్త కోణంలో విచారణ ప్రారంభించి సుబ్బారావు అద్దెకుంటున్న ఇంటిలో పరిశీలించగా అక్కడ మంచానికి తాళ్లతో కట్టిపడేసి ఉన్న విజయలక్ష్మి మృతదేహం కనిపించింది. దీంతో ఖంగు తినటం పోలీసుల వంతు అయింది. దీనిపై రంగం లోకి దిగిన భీమవరం డిఎస్పి రఘువీర ఆకివీడు సీఐ జగదీశ్వర్ రావు దర్యాప్తు ప్రారంభించారు. హత్య కేసుగా నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు విలేకరులు సమావేశంలో వివరించారు.

### ఇది హత్య... ఆత్మహత్య??

సుబ్బారావు, విజయలక్ష్మిల మృతదేహాలను పరిశీలిస్తే ఇది హత్య లేక ఆత్మహత్య అని సందిగ్ధత తలెత్తుతుంది. సుబ్బారావు మృతదేహం పక్కన పడి ఉన్న మూడు సెల్ ఫోన్లు, అతని ఒంటిపై ఉన్న గాయాలను పరిశీలిస్తే ఖచ్చితంగా ఎవరైనా అతనిపై దాడి చేసి హత్య చేసి ఉంటారని తెలుస్తుంది. అలాగే ఇంటిలో ఉన్న విజయలక్ష్మి మృతదేహానికి కాళ్ల నుంచి నడుముకు మడత పెట్టి మరల మెడకు మేలేసి గట్టిగా కట్టేసి ఉంది. దీనిని పరిశీలిస్తే విజయలక్ష్మి సైతం ఎవరైనా హతమార్చారా అని అనుమానం వ్యక్తం అవుతుంది. విజయలక్ష్మిను హతమార్చి ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు వీలుగా గదిలో పెట్టే తాళం వేసి ఆ తాళాన్ని సుబ్బారావు మొలతాడుకు కట్టేసి ఉంటారని

# అధిక వడ్డీలకు తల్లి, కొడుకు బలి

### చీరాలలో విషాద ఘటన

చీరాల, జనవరి 20 ప్రభాతవార్త: ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాలనియోజకవర్గంలో విషాద ఘటన చోటుచేసుకుంది. అధిక వడ్డీలు కట్టలేక ఓ తల్లి, కొడుకు ఆత్మహత్య ప్రయత్నం నియోజకవర్గంలో కలకరం రేపింది. శ్రీనివాసకాలనిలో ఓ కాళీ స్థలంలో తల్లి వేముల సుజాత (55), కుమారుడు సాయి (24)తో కలిసి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు ఇరువురిని హుటాహుటిన చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలలోకి వెళితే చీరాల కోట్ల బజారులో నివాసం ఉంటున్న సుజాత భర్త కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కొడుకుతో కలిసి సుజాత చీరాల రైల్వే స్టేషన్ వద్ద టిఫిన్ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. చిరు వ్యాపారంతో జీవనం సాగిస్తున్న వీరికి అప్పటికే ఉన్న అప్పులతో అధిక వడ్డీలు పెరగడంతో అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. భాదితుడు వేముల సాయి మాట్లాడుతూ అప్పుల బాకీలు చెల్లించలేక వడ్డీ వ్యాపారుల ఒత్తిడితోనే తల్లితో కలిసి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లుగా తెలిపారు. అధిక శాతం శరీర భాగాలు కాలిపోవడంతో చికిత్స పొందుతూ తల్లి కొడుకులు మరణించడం జరిగింది. అధిక వడ్డీలు వసూలు చేస్తూ నిండుప్రాణాలను బలికొంటున్న వడ్డీ వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరారు.

# చిత్తూరు మహిళా పోలీసులు భేష్

- మద్యం మత్తులో పిల్లలను నిర్లక్ష్యం చేసిన తండ్రి
- బాలికను హాస్టల్‌లో చేర్పించి మానవత్వం చాటుకున్న పోలీసులు



హోప్ చిల్డ్రన్ స్కూల్ హాస్టల్‌లో బాలికను అప్పగిస్తున్న చిత్తూరు మహిళా పోలీసులు

చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త: మద్యంకు బానిసై కన్న పిల్లలను నిర్లక్ష్యం చేసి బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్న తండ్రిలో మార్పు కన్పించకపోవడంతో పాఠశాలలో చదువున్న బాలికను హాస్టల్‌లో చేర్పించి చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో నివాసం వుంటున్న రఘునాథ్‌కు ఇద్దరు పిల్లలు. ఇందులో కుమారుడికి 12 సంవత్సరాలు, కుమార్తెకు 10 సంవత్సరాలు. రఘునాథ్ భార్య కువైట్‌లో పని చేస్తూ కుటుంబ ఖర్చుల కోసం ప్రతి నెల డబ్బులు పంపేది. అయితే మద్యంకు బానిసైన రఘునాథ్ ఇంటికి రాకుండా తిరుగుతూ పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వుండేవాడు. ఈ క్రమంలో ఎప్పటిలా ఇంటికి తండ్రి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుమారుడు తండ్రికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రెడ్డప్ప సిబ్బందితో కలిసి రామ్‌నగర్‌కాలనీ చేరుకుని పిల్లల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం తండ్రికి పోలీసులు ఫోన్ చేస్తే ఇప్పుడు వస్తాను! రేపు వస్తాను! అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. కుమారుడు మాత్రం తాత్కాలికంగా ఎదురింట్లో వున్న తల్లి స్నేహితురాలి ఇంట్లో వుంటుండగా పిల్లల భద్రతను దృష్టిలో వుంచుకుని బాలికను ఆమె సమ్మతితో ప్రస్తుతం ఆమె చదువుకుంటున్న యాదమరి మండలం పుల్లయ్యగారిపల్లి గ్రామ సమీపంలో వున్న హోప్ చిల్డ్రన్ స్కూల్ హాస్టల్‌లో చేర్పించి హాస్టల్ యాజమాన్యానికి అప్పగించి చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ పోలీసులు మరోమారు మానవత్వం చాటుకున్నారు.




## దళితులపై దాడి నిందితులను శిక్షించాలి

విజయవాడ. జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: తోట్లవల్లూరులో 11 మంది దళితులపై కిరాతకంగా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విజయవాడ బీసెంట్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. పనికోసం తీసుకెళ్లి, దొంగతనం చేశారని, బలవంతంగా నేరాన్ని ఒప్పించేలా దళితులపై దాడి చేసిన వారిపై, హైకోర్ట్ నిబంధనలకు విరుద్ధంగా కోడిపందాలు, జూదం, గుండాట వంటి వాటిని నిర్వహించిన నిర్వాహకులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, సిపిఎం నాయకులు,



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఇఒ

## దుర్గమ్మవారి ఆలయంలో 23న వసంత పంచమి వేడుకలు

ఇంద్రకీలాద్రి, జనవరి 20 ప్రభాతవార్త : దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 23న వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 7 గంటల వరకు యూనిఫారం, గుర్తింపుకార్డుతో వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేశామన్నారు. అలాగే వారికి 6వ అంతస్థులో శ్రీ అమ్మవారి ప్రసాదంగా పెన్ను, లడ్డూ ప్రసాదం, కేక్రికంకణం, శ్రీ అమ్మవారి ఫోటో అందిస్తా మన్నారు. 6వ అంతస్థులో ఉదయంగా 500 మందికి అక్షరాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మవారు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతి మాతగా దర్శనమిస్తారన్నారు. అలాగే సరస్వతి హోమం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116ల విరాళాన్ని కడప జిల్లా నరసింహారెడ్డి, జ్యోతి దంపతులు మంగళ వారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు.



## ఆత్మకూరులో స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధికి రూ.1.80 కోట్లు మంజూరు

నెల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త- వైద్యం: స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి పనులపై నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి క్రీడా ప్రాదికార సంస్థ అధికారులు, ఇంజనీర్లు, ఆత్మకూరు మున్సిపల్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న భవనాలను పూర్తి చేయుటకు, క్రీడా ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, గ్రౌండ్ లెవెలింగ్ మొదలైన అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. స్టేడియం లోపల క్రీడా భవనాలు, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ కోర్టుల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు తయారు చేయాలని సూచించారు. అత్యాధునిక వసతి సౌకర్యాలు, క్రీడలకు అనువైన ఆహ్లాదకర వాతావరణం ఉండేటట్లు ఆత్మకూరు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేలా అధికారులు ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. తొలి విడతగా మంజూరైన నిధులతో ప్రాధాన్యతక్రమంలో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తామని మంత్రి ఆనం పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ సిఐ ఎన్.శ్రీనివాస్

## డిజిటల్ అరెస్ట్ లేనేలేదు

### సైబర్ క్రైమ్ సిఐ ఎన్.శ్రీనివాస్

విజయవాడ (గన్నవరం), జనవరి 20 ప్రభాతవార్త: మనదేశంలోని చట్టాల్లో డిజిటల్ అనే ప్రక్రియలేనేలేదని, ఇటువంటి కాల్స్ వస్తే కంగారు పడకుండా వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని లేదా 1930కి ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేయాలని విజయవాడ సైబర్ క్రైమ్ సిఐ ఎన్.శ్రీనివాస్ సూచించారు. సైబర్‌నేరాలపై విజయవాడలోని ఏపిస్టేట్ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలోని సమాచార, పౌరసంబందాలశాఖ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం వివిధప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రోజురోజుకీ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వి నియోగం చేస్తూ సైబర్‌నేరగాళ్ళు రోజుకో అవతారంలో రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలు సురక్షింతంగా ఆన్‌లైన్ సేవలు పొందాలంటే అనుమానాస్పద లింక్‌ల జోలికి పోవద్దని హితవు పలికారు. డిజిటల్ అరెస్ట్ అంటూ పోలీస్‌ల పేరుతో ఫోన్ వస్తే కంగారుపడవద్దని హితవు పలికారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ బిడబ్ల్యూ దాసన్, డిఐపిఆర్ఓ కెవి.రమణారావు, అదనపు పిఆర్ఓ కె.రవి, ఏవిసూపర్‌వైజర్ వివి.ప్రసాద్, డిసిఓ ఏ.మురళీకృష్ణ, భూసేకరణకోర్టు రిజిస్ట్రార్ ఎన్.సూర్యనారాయణ వివిద ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజోలు ఘటనపై మహిళా కమీషన్ సీరియస్

విజయవాడ (గన్నవరం), జనవరి 20, ప్రభాతవార్త :రాజోలు నియోజకవర్గం గోగన్నమఠం గ్రామంలో ఇటీవల డ్యాన్సర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సుమోటోగా స్వీకరించి వివరాలు సమర్పించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. గోగన్నమఠం గ్రామంలో ఇటీవల మహిళా డాన్సర్‌లపై భూపతిరాజు వెంకటసత్యన్నారాయణ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్న సంగతి మహిళా కమీషన్ దృష్టికి రాగా వెంటనే స్పందించి కమీషన్ సదరు ఘటనపై వివరాలు సేకరించారు. ఈఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుసుకుని తక్షణమే సంబందిత ఘటనపై పూర్తి వివరాలు, సాక్ష్యాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించారు. మహిళల భద్రత, గౌరవానికి భంగం కలిగిస్తూ వారిపట్ల అసభ్యకరంగా ప్రవరి_ంచటం సిగ్గుచేటని సదరు వ్యాఖ్యలు చేసిన వ్యక్తి సంజాయిషీ కోరుతూ సమన్లు జారీ చేసారు. మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేదిలేదని మహిళా కమీషన్ చైర్మన్ హెచ్చరించారు.

# ఆవిష్కరణ- పరిశ్రమ నడుమ అంతరాలు లేకుండా నిర్మాణాత్మక చర్యలు

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఎపిలో ఇన్నోవేషన్స్‌కు ప్రోత్సాహకాలు
- ఇన్నోవేషన్స్‌లో పెట్టుబడులపై అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం
- మౌలిక సదుపాయాలు, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో భారీగా తగ్గుతున్న పెట్టుబడులు
- ఇన్నోవేషన్స్ పై ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి నారా లోకేష్



విజయవాడ, జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కరణల కోసం స్థానికంగా క్యాపిటల్‌ను సమీకరించి, దీర్ఘకాలిక రాబడులను ఇచ్చే ఆవిష్కరణల ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తూ విశ్వసనీయ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) ఆధ్వర్యంలో దృఢమైన ఆవిష్కరణల కోసం పెట్టుబడులను బలోపేతం చేయడంలో మనం ఎక్కడికెళ్తాం అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్త ఆవిష్కరణలకు క్యాపిటల్ పెట్టుబడులలో లోపాలు ఎందుకు ఉన్నాయి? పెట్టుబడి లేకపోవడం వల్ల ఆవిష్కరణలు ఎలా ఆగిపోతున్నాయి? ఆవిష్కరణాత్మక ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి క్యాపిటల్ పెట్టుబడులపై అంతర్జాతీయంగా ఏ విధంగా దృష్టిసారించాలి అనే అంశాలపై చర్చించారు. సదస్సులో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పెట్టుబడులను ఆకర్షించడం అనేది కేవలం సంస్థలను తీసుకు రావడం కాదు, ఆవిష్కరణలు అవసరమైన స్థిరమైన ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయడమని అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు గమ్య స్థానంగా మారిన ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన మేము స్వల్పకాలిక ప్రోత్సాహకాలపై కాకుండా.. నమ్మకం, సామర్థ్యం, దీర్ఘకాలిక నిబద్ధత, విజిబిలిటీ కలిగి ఉంటేనే ఆవిష్కరణలు వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో మేము ఆవిష్కరణ, పరిశ్రమ మధ్య అంతరాన్ని తగ్గించేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాం. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ లకు ప్రోత్సాహం కల్పిస్తున్నాం. విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్, సిస్కో, ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్‌తో భాగస్వామ్యంతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లతోపాటు ఆర్ అండ్ డిపై ప్రత్యక్షంగా పెట్టుబడి పెడుతున్నాం. తద్వారా ఆలోచనలు వేగంగా స్టార్టప్‌లుగా మారతాయి. ఇదే సమయంలో మేము ప్రతిభపై కూడా పెట్టుబడి పెడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక ప్రతిభ ప్రపంచ సవాళ్లకు పరిష్కారం చూపుతుందని మేం భావిస్తున్నాం. ఈ దిశగా ముందుకు సాగుతూ మేము పారిశ్రామిక క్లస్టర్లలో ఆర్ అండ్ డిని ఏకీకృతం చేస్తూ టాలెంట్ పై పెట్టుబడి పెట్టి, ప్రపంచ భాగస్వామ్యాలకు విశ్వసనీయ యాంకర్‌గా పని చేస్తున్నాం. అనిశ్చితి లేని పాలసీలు, డిజిటల్ గవర్నెన్స్, భారతదేశంలో మొట్టమొదటి సారిగా పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ఎస్క్రో మెకానిజం ప్రవేశపెట్టాం. ఇవన్నీ పెట్టుబడిదారులకు భరోసా కల్పించడమేగాక స్థిరమైన ఆవిష్కరణలకు ఊతమిస్తున్నాయి. 2047 నాటికి క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను సాధించేందుకు ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ తెచ్చాం. ఈ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి, 167 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫ్రంటియర్ టెక్నాలజీలలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోసం క్వాంటమ్ వ్యాలీ, భారతదేశంలో మొట్టమొదటి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. త్రిముఖ వ్యూహంతో మేం ముందుకు సాగుతున్నాం. 1).వివిధ రంగాలకు సంబంధించిన క్లస్టర్లవారీ అభివృద్ధి. 2).విశ్వవిద్యాలయాలు, నైపుణ్య సంస్థలతో పరిశ్రమలు అనుసంధానించడం 3).దీర్ఘకాలిక విలువను సృష్టించే విధానాన్ని రూపొందించడం. ట్రిపుల్ హెలిక్స్ మోడల్‌ను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ అప్లయిడ్ రీసెర్చ్, కొలాబరేటివ్ ఆర్ అండ్ డి, పరిశ్రమ నేతృత్వంలోని ఆవిష్కరణ వేదికలలో స్థిరమైన పెట్టుబడిపై దృష్టి సారిస్తోంది. ఇది ఆధునిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి దోహదపడుతుంది. ఇందుకోసం ప్రభుత్వం, పారిశ్రామిక సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయడంతో ఆంధ్రప్రదేశ్ లో అద్భుతమైన ఫలితాలు సాధించాం. కేవలం 18 నెల వ్యవధిలో మా రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబి) ద్వారా రూ. 8.75 లక్షల కోట్ల (యుఎస్‌డి 97 బిలియన్) విలువైన 211 ప్రాజెక్టులను ఆమోదించింది. ఈ పెట్టుబడుల ద్వారా 8.36 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరతలు ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించే క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ప్రభావం చూపుతున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక విభజన, సాంకేతిక అస్థిరతలు, పర్యావరణ సంక్షోభాలు, పెరుగుతున్న అసమానతలు ఇందుకు ప్రధాన అడ్డంకులుగా మారాయి. మరోవైపు డీగ్లోబలైజేషన్ జాతీయనియంత్రిత వ్యవస్థలను పెంపొందిస్తోంది. ఇది ఆర్థిక మార్కెట్లపై కూడా ప్రభావం చూపుతోంది. పెరిగిన పాలసీ అనిశ్చితి, వాణిజ్య అడ్డంకుల నేపథ్యంలో ప్రపంచ ఇన్నోవేషన్ క్యాపిటల్ తక్కువ గ్రాఫికల్ ప్రాంతాల్లో కేంద్రీకరిస్తోంది. ఇది సిస్టమిక్ రిస్క్‌ను, అసమానతలను సృష్టిస్తుంది. యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) నివేదిక ప్రకారం 2024లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులు భారీగా తగ్గిపోయాయి. పునరుత్పాదక శక్తి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు 31, నీరు, స్వచ్ఛత రంగాల్లో 30, వ్యవసాయఆహార రంగాల్లో 19 తగ్గాయి. అంతర్జాతీయ సమాజ సంక్షేమంలో కీలకమైన ఈ రంగాలు దీర్ఘకాలికంగా తక్కువ నిధులతో ఉండటం ఆందోళనకరం. ఈ పరిస్థితుల్లో రెన్యువబుల్ ఎనర్జీ, రీజనరేటివ్ ప్రొడక్షన్, సమ్మిళిత సమాజాలు, ఆహార వ్యవస్థలు వంటి రంగాల్లో ప్రభుత్వాలు స్థిరమైన పెట్టుబడులు పెట్టడం అత్యవసరం. లాభాలపై దృష్టి పెట్టే ప్రైవేట్ సంస్థలు ప్రాథమిక పరిశోధన, ప్రారంభదశ టెక్నాలజీలు, ఎకోసిస్టమ్ అభివృద్ధిపై తక్కువ పెట్టుబడులు పెడతాయి. ఈ అంతరాన్ని భర్తీచేయడానికి పబ్లిక్ ఫైనాన్స్ ద్వారా గ్రాంట్లు, ఆర్ అండ్ డి సబ్సిడీలు, మిశ్రమ ఆర్థిక సహాయం, వ్యూహాత్మక రంగాలలో నేరుగా పెట్టుబడులు పెట్టాలి. ఆవిష్కరణలకు అవసరమైన ఎకోసిస్టమ్ నిర్మాణానికి నియంత్రిత చట్రాలు, డిజిటల్, ఫిజికల్, ఎడ్యుకేషనల్ మౌలిక సదుపాయాలను ప్రభుత్వాలు కల్పించడం తప్పనిసరి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు స్థిరమైన ఆవిష్కరణల పెరుగుదలకు అవసరమైన నైపుణ్యాలతో వర్క్ ఫోర్స్ ను సన్నద్ధం చేసే విద్య, శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించడంపై దృష్టిసారించాలని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.




## ఎపిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటరు ఏర్పాటు చేయండి

- ఐబిఎం చైర్మన్, సిఇఓ అర్వింద్ కృష్ణతో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ భేటీ

విజయవాడ, జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: దావోస్ పర్యటనల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి పలువురు పెట్టుబడుదారులతో సమావేశాల్లో బీజీబీజీగా ఉంటున్నారు. ఈ క్రమంలో వారు ఐబీఎం చైర్మన్, సీఈవో అర్వింద్ కృష్ణ భేటీ అయ్యారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుపై ఐబీఎం సీఈవోతో చర్చించారు.దేశంలో అత్యుత్తమ స్థాయిలో అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి నారా లోకేష్ ఐబీఎం సీఈవోకు వివరించారు. అక్కడ క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పాలని సీఎం చంద్రబాబు కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వాలని ఐబీఎంను ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ కోరారు. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది యువతకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఐబీఎం సీఈవో అర్వింద్ కృష్ణ వారికి తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని ఐబీఎం సీఈవో సానుకూలంగా స్పందించారు. ఏపీ పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యతతో పాటు, భద్రత కల్పిస్తుందని ఐబిఎంకు సీఎం చంద్రబాబు వివరించారు. ఐబిఎంతో పలు సాంకేతికంశాలపైన సీఎం చంద్రబాబు, నారా లోకేష్ చర్చించారు. ఏపీలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నుంచి ప్రపంచం ఎలా ముందుకు వెళ్తోందో నేర్చుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రస్తుతం అంతా గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉందని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా 2047 నాటికి అగ్రస్థానానికి చేరుతుందని సీఎం పేర్కొన్నారు.

## యువత కొత్త ఆలోచనలతో వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చాలి

ఎన్.జి. రంగా వర్శిటీ ఉపకులపతి శారదా

తిరుపతి విద్య,జనవరి 20 ప్రభాత వార్త: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్శిటీ లో పోషణ ఇంక్యుబేటర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, తిరుపతిలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు మద్దతుగా వ్యవసాయ అంకుర సంస్థలకు గ్రాంట్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా 7వ బ్యాచ్కు (ప్రీ సీడ్ కేటగిరీ) ఒకే విడతలో మొత్తం గ్రాంట్, 5వ బ్యాచ్‌కు (సీడ్ కేటగిరీ) రెండవ విడత గ్రాంట్ అందజేశారు. మొత్తం 11 స్టార్టప్‌లకు రూ.55 లక్షలు గ్రాంటును అందజేసారు. 7వ బ్యాచ్ ప్రీసీడ్ స్టార్టప్‌లతో పోషణ ఇంక్యుబేటర్ పరస్పర అవగాహన ఒప్పందాలకి సంతకాలు, 5వ కోహోర్ట్ సీడ్ స్టేజ్ ఇంక్యుబేటీలతో అనుబంధ అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మి ్మ దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ వర్శిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ, పి.జి. డీన్, డా. ఏ.వి. రమణ, సహా వ్యవసాయ పరిశోధన సంచాలకులు డా.ఎం.జాన్సన్, ఆర్‌ఏఆర్ఎస్ సహాయ సంచాలకులు డాక్టర్ వి. సుమతి, పోషణ ఇంక్యుబేటర్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కదిరి మోహన్, ఆర్‌ఏఆర్ఎస్ వివిధ విభాగాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. డాక్టర్ శారదా జయలక్ష్మి ్మ దేవి మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పోషణ ఇంక్యుబేటర్ రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తోంది. యువత కొత్త ఆలోచనలతో వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చేలా ప్రయత్నించాలి. ఈ గ్రాంట్‌లను అందజేయడం విశ్వవిద్యాలయానికి గర్వకారణం అని అన్నారు.

డాక్టర్ వి. సుమతి మాట్లాడుతూ, ఈ గ్రాంట్లు వ్యవసాయ అంకుర సంస్థలు ముందుకు సాగేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం ద్వారా రైతులకు మేలు కలిగించే ఆవిష్కరణలను ప్రోత్సహించాలి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇంక్యుబేటర్‌కు చెందిన వివిధ బ్యాచ్ల 11 స్టార్టప్ స్థాపకులు పాల్గొని, తమ ఆవిష్కరణలు, అభివృద్ధికి గ్రాంట్ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ నిధులతో వ్యవసాయ రంగంలో నూతన మార్పులు తీసుకురావడమే తమ

## మళ్లీ ఎర్రచందనం స్మగ్లింగ్



ఉదయగిరి (నెల్లూరు), జనవరి 20, ప్రభాతవార్త: ఎర్ర చందనం స్మగ్లర్ల నిలయమైన ఉదయగిరి అడవి ప్రాంతం కొంత కాలంగా స్తబ్దుగా ఉండిపోయింది. అధికారుల చొరువ స్థానికులు సహకరించకపోవడం లాంటి కారణాలతో పూర్తి స్థాయిలో స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట పడి ఉంది. కానీ ఆదివారం జరిగిన సంఘటనతో ప్రశాంతమైన ఉదయగిరి అడవుల్లో మళ్లీ ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు స్మగ్లర్లు శ్రీకారం చుట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది. వెలిగొండ నల్లమల అడవుల్లో అంతర్భాగంగా ఉన్న ఉదయగిరి అటవీ రేంజ్ లో విరివిగా ఎర్ర చందనం చెట్లు ఉన్నాయి. అయితే ఆ సంపదను ఎలాగైనా తరలించుకు వెళ్దామని పక్కాగా ప్రణాళిక సిద్ధం చేసిన స్మగ్లర్లు గ్రామస్తుల చేతికి అడ్డంగా దొరికారు. కాశీ నాయన ఆరాధన ఉత్సవాలు జరుగుతున్న క్రమంలో ఆ హడావుడిలో సంపదను తరలించుకు వెళ్దాం అన్న వారి ప్రణాళిక బెడిసి కొట్టింది. గొర్రెల దొంగలుగా భావించిన గ్రామస్తులు లారీని అడ్డగించి తనిఖీ చేయడంతో ఎర్ర చందనం దుందులు బయటపడ్డాయి. పోలీసులకు సమాచారం ఇచ్చే లోపు ఎర్ర చందనం దొంగలు అడవుల్లోకి పారిపోవడం విశేషం. ఆర్లపడియ బీటులో ఉన్న అటవీ శాఖ అధికారుల నిద్రావస్థకు ఈ సంఘటన అద్దం పడుతుందని, పరిసర గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి ఉదయగిరి రేంజ్ పరిధిలో ఉన్న అటవీ శాఖ సిబ్బందిపై నిఘా ఏర్పాటు చేయాలని సరిగ్గా డ్యూటీలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## సమూల మార్పులతో రీ సర్వే 2.0



- ఇప్పటికి 2,097 గ్రామాల్లో పూర్తి
- రీ సర్వే సమయం 143రోజులకు పెంపు
- రీసర్వే 1.0 అంతా తప్పల తడకే

సచివాలయం, జనవరి 20 ప్రభాతవార్త: రైతుల భూమి హక్కులను డిజిటలీకరణ చేస్తూ భవిష్యత్తులో ఎలాంటి భూ ఆక్రమాలకు తావు లేకుండా పటిష్టమైన టెక్నాలజీతో కూటమి ప్రభుత్వం రీ సర్వే 2.0ను నిర్వహిస్తుంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వేను నిర్వహిస్తుంది. రీ సర్వే 2.0లో కూటమి ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తుందంటూ కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకొంది.రీ సర్వే 2.0లో బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేయడానికి ఏమాత్రం అవకాశం లేకుండా చేస్తుంది. గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే 1.0లో జరిగిన తప్పులకు అస్కారం లేకుండా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు దశల్లో 2,097గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసింది. 4వ దశలో మరో 1,613గ్రామాల్లో రీ సర్వే 2.0 నిర్వహిస్తుంది.

### గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు

గత ప్రభుత్వం డ్రోన్ల ద్వారా తీసిన చిత్రాలు (ఓఆర్ఐ) ఆధారంగా రీ సర్వే చేసింది. అయితే సరైన సంఖ్యలో రోవర్లను ఉపయోగించక పోవడంతో చాలా చోట్ల ప్రైవేట్ భూముల విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. దీనికి తోడు రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూటింగ్(భూమిపై సర్వే) నిర్వహించే ముందు, నిర్వహించిన తర్వాత భూ యజమానులకు సరైన సమాచారం ఇవ్వలేదు. రీ సర్వే కాలం మొత్తాన్ని కేవలం 90రోజుల్లోనే పూర్తి చేశారు. రీ సర్వే చేసే సమయంలో భూప యజమానులు లేకపోవడం, వారి భూమి హద్దులు స్పష్టంగా చెప్పేవారు లేకపోవడంతో అధిక సంఖ్యలో జాయింట్ ఎల్పీనెంబర్లు, జాయింట్ ఎల్పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్)లు ఏర్పాడ్డాయి. దీంతో రీ సర్వే 1.0 పట్ల రైతలు ఆందోళన చెందారు. దీంతో కూటమి ప్రభుత్వానికి రీ సర్వే 1.0పై దాదాపు 7.5లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయి.

### స్టాటిక్‌గా క్యూఆర్ కోడ్

గత ప్రభుత్వం రీ సర్వేను తప్పుల తడకగా నిర్వహించడమే కాక రీ సర్వే అనంతరం రైతులకు పంపిణీ చేయాల్సిన భూమి హక్కు పత్రాలపైన జగన్ బొమ్మ ముద్రించింది. ఇది రైతుల్లో మరింత ఆందోళన పెంచింది.దీనితోపాటు భూమి హక్కు పత్రాల్లోనూ అనేక తప్పులను కూడా ప్రచురించారు. భూమిహక్కు పత్రాలపై తాము కూడా క్యూఆర్ కోడ్ ప్రచురించామని జగన్‌రెడ్డి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ గత ప్రభుత్వం క్యూఆర్‌కోడ్ స్టాటిక్‌గా ఉంటుంది. అంటే క్యూఆర్ కోడ్ ముద్రించే నాటికి ఉన్న సమాచారం మాత్రమే ఆ క్యూఆర్ కోడ్‌లో ఉంటుంది. ఆ తర్వాత జరిగే మ్యూటేషన్ వివరాలు గానీ, సబ్ డివిజన్ వివరాలు కానీ ఆ క్యూర్‌కోడ్‌లో ఉండవు, అంతేకాక ఆ క్యూఆర్‌కోడ్ లో నావిగేషన్ సిస్టమ్ కూడా లేదు.

### జగన్‌రెడ్డి గొప్పల తిప్పలు : మంత్రి అనగాని

5ఏళ్ళ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నాశనం చేసిన జగన్‌రెడ్డికి ప్రస్తుతం ఉనికి సమస్య వెంటాడుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని తన గొప్పగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. రీసర్వే విషయంలో తనదే మొత్తం క్రెడిట్ అంటూ కలరింగ్ ఇస్తూ అభాసుపాలవుతున్నారు. అతని హయాంలో జరిగిన రీ సర్వేలో ఎన్ని తప్పులు జరిగాయో ప్రజలందరికీ తెలుసు, గత ప్రభుత్వ విధానానికి, మా ప్రభుత్వ రీ సర్వేకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. రైతుల, భూ యజమానల సంక్షేమం కోరి మేం రీ సర్వే 2.0 నిర్వహిస్తున్నాం. కానీ జగన్‌రెడ్డి ప్రజల ఆస్తులను కబళించేందుకు రీ సర్వేను ఆయుధంగా చేసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం రీ సర్వే 1.0లో తప్పులన్నీ సరిదిద్ది రైతులకు, భూ యజమానులకు అండగా నిలబడిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు.




## హెచ్ఐవి ఉన్నవారిపై వివక్ష నేరం

- గోప్యత హక్కు తప్పనిసరి
- ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్‌పర్సన్ తోట త్రిమూర్తులు

తిరుపతి కలెక్టరేట్, జనవరి, 20 ప్రభాతవార్త: ప్రజారోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్‌పర్సన్ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన జీవోలు 85, 127, 311 అమలుపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ఆయన దిశానిర్దేశం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, అసిస్టెంట్ సెక్రటరీ, కమిటీ ఇంచార్జ్ విశ్వనాథం, అప్సక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠ రెడ్డి సంబంధిత అధికారులతో కలసి ప్రభుత్వ ఉత్తర్వుల ఉద్దేశ్యాలు, అమలు విధానం, ప్రస్తుత స్థితి, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. హెచ్‌ఐవితో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఆరోగ్య సంరక్షణ, నివాసం (గృహం), ఉపాధి, విద్య మరియు బీమా రంగాల్లో వివక్ష చూపించడం చట్టరీత్యా నేరమని సంబంధిత అధికారులు తెలిపారు. ఇటువంటి వివక్షకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం శిక్షలు విధించబడతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ శాసనసభ్యులు పీలేరు, సింగనమల, నగిరి, సత్తెనపల్లి, కావలి కిషోర్‌కుమార్ రెడ్డి, శ్రావణి గాలి భానుప్రకాష్, కన్నా లక్ష్మీ ్మనారాయణ, వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డిఎంఈ రఘునందన్, డిపిహెచ్ అండ్ ఎఫ్ డబ్ల్యు డా పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, డిఎం అండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్ స్విమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ శైలజ, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, శ్రీ పద్మావతి మహిళా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉష కళావత్, రిజిస్టర్ అపర్ణ, డిప్యూటీ రిజిస్టర్ రెడ్డి, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐవిఆర్ కాల్స్ వల్ల ఉద్యోగుల మనోభావాలకు భంగం


విజయవాడ, జనవరి 20, ప్రభాతవార్త: ఐవిఆర్ఎస్ కాల్స్ పేరుతో వీఆర్వోలపై, ఇతర అధికారులపై చేస్తున్న ఐవిఆర్ కాల్స్ వల్ల ఉద్యోగుల మనోభావలకు భంగం కలుగు తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఐవి ఆర్ఎస్ కాల్స్‌లో వస్తున్న రిపోర్టులు వాస్తవాలు కాదని, కావాలని తప్పుడు రిపోర్టులు చూపించి రాష్ట్ర ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని కొంతమంది అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని భూపతి రాజు రవీంద్ర రాజు స్పష్టం చేశారు. కావాలని కొంతమంది అధికారులు ఐవిఆర్ఎస్ కాల్స్ పేరుతో మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఎవరైనా తప్పు చేస్తే అది రుజువుతే చర్యలు తీసుకుంటే మేం కూడా హర్షిస్తాం. ఈ ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ఎక్కడైనా, ఎప్పుడైనా అధికారులు వద్ద బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఈ నెల 2 నుండి రీసర్వే జరిగిన గ్రామలలో నిజాయితీగా పనిచేసిన కూడా తప్పుడు ప్రచారంతో ఐవీఆర్ఎస్ కాల్స్ పేరుతో విఆర్వోల మనోభావాలను దెబ్బతీసే విధంగా అధికారులు వీఆర్వోలపై దుష్ప్రచారం చేస్తున్నందున రాష్ట్రవ్యాప్తంగా వర్క్ టు రూల్ పాటించాలని ఈనెల 12వ తేదీన రాష్ట్ర సీసీఎల్ఏ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చామన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న రెవిన్యూ ఉద్యోగులందరూ కలిసి త్వరలోనే రెవిన్యూ జేఏసీ ఏర్పాటు చేసి రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని భూపతిరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తెలియజేశారు.



# టాటా స్టీల్ చెస్‌లో గుకేష్‌తో అర్జున్ డ్రా

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ లో తన దేశస్థుడు దొమ్మరాజు గుకేష్ తో జరిగిన రౌండ్ 3లో గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ టోర్నమెంట్‌లో తన రెండవ డ్రా ఆడాడు. అయినా అర్జున్ మరో 4 మంది ఆటగాళ్లతో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు. ఉజ్బెకిస్తాన్‌కు గ్రాండ్ మాస్టర్ నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్, అమెరికా గ్రాండ్ మాస్టర్ హాన్స్ నీమాన్, జర్మనీకి గ్రాండ్ మాస్టర్ మాథియాస్ బ్లూబామ్ మరియు నెదర్లాండ్ గ్రాండ్ మాస్టర్ జోర్డాన్ వాన్ ఫారెస్ట్ ఒక్కొక్కరు 2 పాయింట్లతో ఉన్నారు. అయితే డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రౌండ్3లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన థాయ్ దై వాన్ న్గుయెన్‌తో జరిగిన డ్రా తో బోర్డులో తన మొదటి పాయింట్లను సంపాదించాడు. అంతకు ముందు, అర్జున్ చేతిలో తొలి రౌండ్‌లో ఓటమి పాలైన ప్రాగ్, రౌండ్ 2లో ఉజ్బెక్ గ్రాండ్ మాస్టర్ నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ చేతిలో బ్లాక్ పావులతో ఓడిపోయాడు. అలాగే అరవింద్ చితంబరం నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్‌తో వరుసగా మూడో డ్రా ఆడి అజేయంగా నిలిచి 5 మంది లీడర్ల కంటే అర పాయింట్ వెనుకబడి ఉన్నాడు. విజ్క్ ఆన్ జీ ఈ సంవత్సరం మొట్టమొదటి సూపర్ బిలీ క్లాసికల్ టోర్నమెంట్, మాస్టర్స్ విభాగంలో 14 మంది పాల్గొంటుండగా, ఒకే రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు.



# ప్రో రెజ్లింగ్ లీగ్‌లో యుపి చేతిలో ఢిల్లీ చిత్తు

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 యొక్క 7వ మ్యాచ్‌లో యుపి డామినేటర్స్ 5-4 తేడాతో ఢిల్లీ దంగల్ వారియర్స్‌ను ఓడించి, 4-1 తేడాతో కీలక విజయాన్ని సాధించింది. అనస్తాసియా అల్పీవా, కెప్టెన్ సుజీత్ కల్కల్ లతో ఢిల్లీ టై యొక్క ప్రారంభంలో ఆధిపత్యం చెలాయించిన తర్వాత, యుపి తప్స్య గహ్లావత్, కెప్టెన్ నిషా దహియా నేతృత్వంలో చివరి దశలో పుంజుకుంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత అంటిమ్ పంఘల్ నుండి నిర్ణయాత్మక ఫైనల్ ప్రదర్శనను ప్రదర్శించింది. 86 కిలోల పురుషుల బౌట్‌లో ఢిల్లీ మైఖైలోవ్ వాసిల్‌ను 7-4 తేడాతో ఓడించింది. తర్వాత అల్పీవా 76 కిలోల మహిళల విభాగంలో ఆధిక్యాన్ని రెట్టింపుచేసింది. వరుస టేక్‌డౌన్‌అండ్‌టర్న్ కాంబినేషన్‌లతో ఓజో దమోలా హన్నాను 11-2 తేడాతో ఓడించింది. 74 కిలోల పురుషుల పోటీలో ఢిల్లీ జోరు కొనసాగింది. అజర్‌బైజాన్‌కు చెందిన తురాన్ బేరామోవ్ అభిమన్యు మండ్వాల్‌ను 3-0 తేడాతో ఓడించి ఢిల్లీని 30 ఆధిక్యంలోకి నెట్టాడు. 57 కిలోల మహిళల బౌట్‌లో అండర్ 20 ప్రపంచ ఛాంపియన్ తప్స్య గహ్లావత్ ద్వారా యుపి ఖాతా తెరిచింది. ఆమె 8-2తో విజయం సాధించి యుపిని తిరిగి టైలోకి తీసుకువచ్చింది. అయితే, 65 కిలోల పురుషుల విభాగంలో సుజీత్ కల్కల్ కమాండింగ్ ప్రదర్శన ఇవ్వడంతో ఢిల్లీ వెంటనే స్పందించింది. విశాల్ కాళీ రామన్‌ను ఓడించి ఢిల్లీ ఆధిక్యాన్ని 4-1కి పెంచింది. పురుషుల 57 కిలోల బౌట్‌లో రాహుల్ దేస్వాల్ శుభమ్ కౌశిక్‌పై 8-5 తేడాతో విజయం సాధించడంతో టై మారిపోయింది. అక్కడ జస్పూరన్ సింగ్ రోనక్‌ను 3-1 తేడాతో ఓడించి అంతరాన్ని మరింత తగ్గించాడు. 62 కిలోల మహిళల బౌట్‌లో కెప్టెన్ నిషా దహియా బౌలింగ్ వేసి అంజ్లీని 9-5తో ఓడించి టైను 4-4తో సమం చేసింది.




# న్యూజిలాండ్‌తో ఓటమి ఫలితం

## టీమిండియా వన్డే నుండి ముగ్గురు ఔట్.. బిసిసిఐ సెలక్టర్ల కఠిన నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** భారత్, న్యూజిలాండ్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆడాయి. న్యూజిలాండ్ ఈ సిరీస్‌ను 2-1 తేడాతో గెలుచుకుంది. కివీస్ భారత్‌లో వన్డే సిరీస్‌ను గెలుచుకోవడం ఇదే తొలిసారి. రెండు జట్ల మధ్య ఏడుసార్లు ద్వైపాక్షి క సిరీస్‌లు జరిగినా కానీ టీమిండియాపై భారత్‌లో ఒక్కసారి కూడా కివీస్ గెలిచింది లేదు. నాలుగు ఐసీసీ టోర్నమెంట్లు సహా భారత్ కు 16 సార్లు వచ్చిన న్యూజిలాండ్ ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయింది. అంతేకాదు కేవలం మూడుసార్లు మాత్రమే సిరీస్ ఫలితం చివరి మ్యాచ్ లో తేలింది. కానీ, ఈసారి మాత్రం న్యూజిలాండ్ పట్టు వదల్లేదు. మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ ను 2-1తో గెలుచుకుని చరిత్ర నెలకొల్పి టీమిండియాకు మరో పరాభవం మిగిల్చింది. ఏడు సిరీస్ ల తర్వాత సొంతగడ్డపై భారత్ కు వన్డేల్లో పరాజయం ఎదురైంది. ఈ ఓటమి తర్వాత, టీం ఇండియా తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, భారత్ తన జట్టులో మార్పులు చేయడం అనివార్యమైన నేపథ్యంలో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్టర్ల కమిటీ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. వన్డే జట్టు ఓటమికి ముగ్గురు ఆటగాళ్లపై వేటు పడే అవకాశం ఉంది. నితీష్ కుమార్‌రెడ్డి ఇప్పటివరకు టీ20ల్లో బాగా రాణించాడు. అయితే, వన్డేల్లో అతను ప్రభావం చూపలేకపోయాడు. నితీష్ నాలుగు వన్డేల్లో కేవలం 100 పరుగులు మాత్రమే చేశాడు. అంతేకాకుండా ఒక్క వికెట్ కూడా తీయలేదు. వన్డేల్లో తనను తాను నిరూపించుకోలేకపోయాడు. అలాగే భారత అనుభవజ్ఞుడైన ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ప్రదర్శన కూడా క్షీ ణించింది. న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో జడేజా బ్యాటింగ్‌తోనూ, బంతితోనూ విఫలమయ్యాడు. 2025లో 10 వన్డేల్లో జడేజా కేవలం 106 పరుగులు చేసి 12 వికెట్లు పడగొట్టాడు. అతని స్థానంలో అక్షర్ పటేల్‌ను పరిగణించవచ్చు. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ కృష్ణ కూడా వన్డేల్లో స్థిరమైన అవకాశాలను పొందుతున్నాడు. అయితే, అతను ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వడం లేదు. న్యూజిలాండ్‌లో కృష్ణ వన్డే సిరీస్‌లో ఘోరంగా ఆడాడు. కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అతను అవసరమైన ప్రభావాన్ని చూపలేకపోయాడు. అతని స్థానంలో ప్లేయింగ్ ఎలెవన్‌లో అర్ష్‌దీప్ సింగ్ మంచి ఎంపిక. మూడవ వన్డేలో, ప్రసిద్ స్థానంలో అర్ష్‌దీప్‌కు అవకాశం ఇవ్వబడింది మరియు అతను బాగా బౌలింగ్ చేశాడు. ఈ నేపథ్యంలో వీరిని వరల్డ్ కప్ జట్టు నుండి తొలగించేందుకు సెలక్టర్ల కమిటీ దాదాపు ఒక నిర్ణయం

# వెస్టిండీస్ ఘోర ఓటమి

## 38 రన్స్‌తో అఫ్ఘానిస్థాన్ ఘన విజయం



**న్యూఢిల్లీ:** మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి టీ20లో ఆఫ్ఘనిస్తాన్ 38 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. జద్రాన్ (87) అజేయంగా, రసూలి (84) రాణించి స్కోరును 181-3కి పెంచారు. వెస్టిండీస్ టాప్‌ఆర్డర్ స్పిన్ ద్వయం రషీద్ ఖాన్ (2-19), ముజీబ్ ఉర్ రెహమాన్ (2-29) లతో పోరాడటానికి ఇబ్బంది పడింది. క్వెంటిన్ సాంప్సన్ (30), గుడకేష్ మోటీ (28) ప్రదర్శనతో 143-9 స్కోరుకు చేరుకుంది. తొలి బంతికే రహ్మానుల్లా గుర్బాజ్ రనౌట్ కావడంతో వెస్టిండీస్ కెప్టెన్ బ్రాండన్ సెదికుల్లా అటల్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకున్నాడు. ఆ సమయంలో ఆఫ్ఘనిస్తాన్ మూడో ఓవర్‌లో 219తో పడిపోయింది. కానీ జాద్రాన్, రసూలి వెస్టిండీస్ బౌలింగ్‌లో 113 బంతుల్లో మూడవ వికెట్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వెస్టిండీస్ అవుట్ ఫీల్డ్‌లో కూడా పేలవంగా ఆడి డెత్ ఓవర్లలో కనీసం 3 క్యాచ్‌లను వదులుకుంది. జద్రాన్, రసూలి చివరి 6 ఓవర్లలో 70 పరుగులు చేశారు. ఫాస్ట్ బౌలర్లు మాథ్యూ ఫోర్డ్, షమర్ జోసెఫ్ 91 పరుగులు, ఖారీ పియరీ (0-42) చేశాడు. పవర్ ప్లేలో వెస్టిండీస్ 3-42తో తడబడింది. తొలి ఓవర్లోనే ముజీబ్ కింగ్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. రసూలి అవుట్‌ఫీల్డ్‌లో ఎవిన్ లూయిస్ టాప్‌ఎడ్జ్‌ను పట్టుకోగా, జాన్సన్ చార్లెస్ ఎల్‌బిడబ్ల్యూగా అవుట్ అయ్యాడు. రషీద్ తన వరుస ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టగా, అందులో షిమ్రాన్ హెట్మైర్ (7) కీలక వికెట్ కూడా ఉంది, తొమ్మిదవ ఓవర్లో వెస్టిండీస్ 550కి మరింత దిగజారింది. సాంప్సన్, ఫోర్డ్ (25) కలిసి వెస్టిండీస్ అత్యుత్తమ భాగస్వామ్యంలో 45 పరుగులు చేశారు. ఆ తర్వాత ఫాస్ట్ బౌలర్ జియావుర్ రెహమాన్ తన మొదటి 4 బంతుల్లో 16 పరుగులు ఇచ్చి, తన రిటర్న్ స్పెల్‌లో 2 వికెట్లు పడగొట్టి 336తో ముగించాడు.



# ఇండోనేసియా మాస్టర్స్‌లో.. మెయిన్ డ్రాకు అన్మోల్, ఆకర్షి

**న్యూఢిల్లీ:** ఇండోనేసియా మాస్టర్స్-2026 ప్రచారానికి భారత షట్లర్లు అన్మోల్ ఖర్బ్, ఆకర్షి కశ్యప్ ప్రధాన డ్రాకు దూసుకెళ్లి శుభారంభం చేశారు. ఇస్టోరా సెనాయన్‌లో మంగళవారం గంటసేపు జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో అన్మోల్ కెనడాకు చెందిన వెన్ యు జాంగ్‌ను 21-18, 20-22, 21-19 తేడాతో ఓడించగా, ఆకర్షి 21-13, 21-17 తేడాతో ఇషారాణి బారువాను చిత్తు చేసింది. మరోవైపు, మహిళల సింగిల్స్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లో డెన్మార్క్‌కు చెందిన అమాలియా షుల్జ్ చేతిలో 12-21, 16-21 తేడాతో ఓడిపోయి తస్నిమ్ మీర్ నిష్క్రమించింది. అలాగే భారత జంట రష్మి గణేష్-సానియా సిక్కందర్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లో ఓడిపోవడంతో మహిళల డబుల్స్ మెయిన్ డ్రాలో భారత్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. 34 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఈ భారత్ జంట చైనా జంట కెంగ్ షు లియాంగ్-లి హువా జౌ చేతిలో 21-23, 10-21 తేడాతో ఓడిపోయింది. దీంతో ఇండోనేషియా మాస్టర్స్ 2026 మెయిన్ డ్రాలో అర్హత సాధించిన భారత్ షట్లర్ల పేర్లు ఖరారాయ్యారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, శెట్టి ఆయుష్, కిదాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జ్, మహిళల సింగిల్స్‌లో పివి సింధు, మాళవిక బన్సోద్, తన్వి శర్మ, అన్మోల్ ఖర్బ్, ఆకర్షి కష్యాప్, పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అంశకరుణన్-ఎంఆర్ అర్జున్, మిక్స్‌డ్ డబుల్స్‌లో కపిల ధృవ్-తనీషా క్రాస్టో, రోహన్ కపూర్-గద్దె రుత్విక ఉన్నారు.

# 'కల'గా మారుతున్న బంగారం, వెండి కొనుగోళ్లు

## ఒక్కరోజులోనే రూ.12వేలు పెరిగిన వెండి

## పసిడిధరలు కూడా రూ.1040 పెరుగుదల



**ముంబయి, జనవరి 20:** బంగారం కొనుగోళ్లు అనేది ఇపుడు సామాన్యమధ్యతరగతికి కలగా మారితే ఇప్పుడు వెండి కూడా అదే బాటలో పట్టింది. వెండి ధరలు ఊహించని స్థాయిలో పెరిగి ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్‌తో పాటు, సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు ఇవిలు, 5జి టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వెండి వినియోగం భారీగా పెరగడం దీనికి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. గత నాలుగు రోజుల్లోనే కిలో వెండి ధర ఏకంగా రూ.24 వేల వరకు పెరగడం గమనార్హం. ఇందులో ఒక్క రోజులోనే రూ.12 వేల పెరుగుదల నమోదైంది. దీంతో హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.3.30లక్షలకు చేరింది. ఇంతవరకు వెండిని తక్కువ ధరకే కొనుగోలు చేసే అవకాశం ఉండగా, ఇప్పుడు అది కూడా అందని స్థాయికి చేరింది. ఇక బంగారం ధరలు కూడా అదే దిశగా పరుగులు తీస్తున్నాయి. మంగళవారం ఒక్కరోజే 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,040 పెరిగి రూ.1,47,280కు చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.950 పెరిగి రూ.1,35లక్షలుగా నమోదైంది. 24 క్యారెట్ల బంగారం ధర త్వరలోనే రూ.1,50లక్షల మార్కును తాకుతుందన్న అంచనాలు న్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. వచ్చే నెల నుంచి శుక్ర మోఢ్యమి ముగిసి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటంతో బంగారం, వెండి ఆభరణాలపై డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రాబోయే రోజుల్లో ధరలు ఇంకా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని బులియన్ నిపుణులు పేర్కొంటున్నారు.

# ఫోన్‌పే ఐపిఒకు సెబీ సిగ్నల్




**న్యూఢిల్లీ,జనవరి 20:** ఆర్థికసేవల చెల్లింపుల సంస్థ ఫోన్‌పే ఐపిఒకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సుదీర్ఘ పరిశీలన అనంతరం కొన్ని మార్పులు సూచించింది. ఆ తర్వాత అప్‌డేట్‌చేసిన డిహెచ్ ఆర్‌పిని ఫోన్‌పే త్వరలో అందచేయనున్నది. ఫోన్‌పే ఐపిఒ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరుగుతుంది. ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను పబ్లిక్ ఇష్యూద్వారా విక్రయిస్తారు. ఫ్రెస్ ఇష్యూ ఉండదని సంకేతాలున్నాయి. కంపెనీకి పబ్లిక్ ఇష్యూద్వారా ఎలాంటి నిధులు రావు. ప్రస్తుతం డిజిటల్‌పేమెంట్ మార్కెట్‌లో ఫోన్‌పేదే జోరు. మొత్తం యుపిఐ లావాదేవీల్లో 45శాతం ఈ యాప్‌లోనే జరుగుతాయి. గత ఏడాది డిసెంబరులో 9.8 బిలియన్ లావాదేవీలు జరిగాయని ఎన్పీసిఐ డేటా చెపుతోంది. 2024-25 ఆర్థికసంవత్సరానికిగాను రూ.7115 కోట్ల ఆదాయం పొందింది. ఐపిఒ సైజు, ధరల శ్రేణి వంటి వివరాలు త్వరలో వెల్లడి అవుతాయి. ఐపిఒ సుమారు రూ.12వేల కోట్లవరకూ ఉంటుందని అంచనా.

# రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి!

## ఈక్విటీ సూచీల్లో అన్నింటా అమ్మకాల జోరు

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, జనవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో మునిగిపోయాయి. అమెరికా, ఐరోపా మధ్య టారిఫ్ అనిశ్చితి, భౌగోళిక, రాజకీయ పరమైన ఉద్రిక్తతలు, ఎఫ్ఐఐల అమ్మకాల ఒత్తిడితో సూచీలు మంగళవారం భారీగా నష్టపోయాయి. ఐటీ స్టాక్స్ ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా నష్టపోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ కూడా 25,200 దిగువకు చేరింది. ఆ తర్వాత సూచీలు కాస్త కోలుకొని రెండు నెలల కనిష్టానికి చేరాయి. ఒక్కరోజులోనే రూ.9లక్షల కోట్లకుపైగా సంపద ఆవిరి అయింది. గత సెషన్‌లో 324 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ మంగళవారం ఏకంగా 1,066 పాయింట్లు తగ్గింది. ఉదయం 83వేల 207 పాయింట్ల వద్ద సూచీ ప్రారంభమైంది. మొదట్లో 83వేల 254 పాయింట్ల గరిష్ఠస్థాయి నమోదు చేసింది. తర్వాత అన్ని రంగాల సూచీలు విపరీతమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొగా సెన్సెక్స్ ఒక దశలో 82వేల 11 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు 82వేల 180 పాయింట్ల వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీనిఫ్టీ 353 పాయింట్లు తగ్గి 25 వేల 232పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఒక దశలో 400 పాయింట్లు తగ్గి 25,200 దిగువకు చేరింది. ఫలితంగా మంగళవారం మదుపర్ల సంపద దాదాపు ఒక్కరోజులోనే రూ.9 లక్షల కోట్ల పైనే ఆవిరైంది. బిఎస్ఇలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9.46 లక్షల కోట్లు క్షీణించి రూ.455.7 లక్షల కోట్లకు చేరింది. ఇంట్రాడేలో 82,010.58 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, చివరికి 1065.71 పాయింట్ల నష్టంతో 82,180.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 353 పాయింట్ల నష్టంతో 25,232.50 వద్ద స్థిరపడింది.

ఇక సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ఎటెర్నల్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, ట్రెంట్ ప్రధానంగా నష్టపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 90.97గా ఉంది. ఐటీ షేర్లలో అమ్మకాలు మన సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.1 శాతం మేర పతనం కాగా, విప్రో 3 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ షేర్లు 7 శాతం మేర క్షీణించాయి. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా ఆయా కంపెనీలు బలహీన త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. ఫలితంగా ఐటీ కంపెనీల లాభాలపై ఆందోళన వ్యక్తమవుతున్న వేళ ఐటీ స్టాక్స్ భారీ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు సహకరించకుంటే టారిఫ్‌లు విధిస్తానని యూరోపియన్ యూనియన్ దేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల క్రమంలో మళ్లీ టారిఫ్ వార్ భయాలు మార్కెట్లలో మొదలయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. గ్లోబల్ టారిఫ్ విధానంపై అమెరికా సుప్రీం కోర్టు తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తం కావడంతో ఆ ప్రభావం ఆప్రభావం మార్కెట్లపై పడింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్ఐఐలు సోమవారం కూడా రూ.3263 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. ఫలితంగా దేశీయ మార్కెట్లు భారీగా నష్టపోయాయి.

# ఐటిసి నికరలాభం రూ.235.13కోట్లు

**ముంబయి, జనవరి 20:** ఐటిసి హోటల్స్ మూడవ త్రైమాసికంలో నికరలాభాలు 9.4శాతం పెంచుకోగలిగింది. డిసెంబరు చివరినాటికి మూడు నెలల కాలానికిగాను 235.13 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదేకాలంలో 214.9శాతం మాత్రమే ఆర్జించినసంస్థ ఈసారి పెంచుకోగలిగింది. త్రైమాసికం వారీగాచూస్తే నికరలాభం 77 శాతం పెరిగింది. 132.77 కోట్లే అంతకుముందు త్రైమాసికంలో వచ్చింది. కంపెనీ ఆర్థికఫలితాలు కొత్త లేబర్‌కోడ్‌ల ప్రభావం కూడా చవిచూసాయని, ఒక్కసారి వ్యయంగా 52.53 కోట్లు అదనంగా భారం పడిందని వెల్లడించింది. తొమ్మిదినెలల కాలానికిగాను ఏకకాలానికి లేబర్‌కోడ్‌ల కారణంగా ఈ మొత్తం భరించినట్లు కంపెనీ వివరించింది. ఆతిథ్యరంగంలో దిగ్గజంగా ఉన్న ఈ కంపెనీ రాబడులు కూడా 21.9శాతంపెరిగి 1004.51 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 832.04 కోట్లు ఆర్జించిన కంపెనీకి భారీ స్థాయిలో రాబడులుకూడా వచ్చాయి. ఇక ఈ త్రైమాసికంలో వ్యయాలుకూడా 870.22కోట్లుగా ఉన్నాయి. 17.5శాతం పెరిగాయి. క్రమానుగతంగా చూస్తే త్రైమాసికం వారీగా 24.3శాతంగా ఉన్నాయి. ఐటిసి హోటళ్ల షేర్లు 2.4శాతం క్షీణించి 180.8 రూపాయలుగా బిఎస్ఇలో కొనసాగింది. కంపెనీ ప్రతి వాటాకు రాబడులు రూ.1.13గా ఉన్నట్లు తెల్పింది.

# రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్

## ఎస్బీఐ రీసెర్చి నివేదిక వెల్లడి




**న్యూఢిల్లీ,జనవరి 20:** భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా దూసుకెళ్తోంది. 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని భారతీయ స్టేట్ బ్యాంకు రీసెర్చ్ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, 2030 నాటికి భారత్ ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారుతుందని అంచనావేసింది. ప్రస్తుతం దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలో ఉన్న భారత్, 2030 నాటికి ఎగువ మధ్యఆదాయ దేశాల కేటగిరీలోకి చేరుతుందని నివేదిక పేర్కొంది. ఆసమయానికి తలసరి ఆదాయం 4000 డాలర్ల (సుమారు రూ.3.30 లక్షలు) మార్కును అందుకోవచ్చని తెలిపింది. ఈ మార్పుతో చైనా, ఇండోనేషియా వంటి దేశాల సరసన భారత్ నిలుస్తుందని ఎస్‌బిఐ విశ్లేషించింది. "భారత్ మరో నాలుగేళ్లలో, అంటే 2030 నాటికి తలసరి ఆదాయంలో 4000 డాలర్లకు చేరి ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారనుందిచి" అని నివేదికలో పేర్కొంది. ఆర్థిక వృద్ధిలో కీలక మైలురాళ్లను కూడా ఈ నివేదిక ప్రస్తావించింది. సుమారు రెండేళ్లలో, అంటే 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి భారత జిడిపి ఐదులక్షలకోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అలాగే, 2035-36 నాటికి 10 లక్షలకోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని పేర్కొంది. ప్రపంచ బ్యాంకు వర్గీకరణ ప్రకారం, ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారాలంటే తలసరి స్థూల జాతీయ ఆదాయం (జిడిపి) సుమారు 4,500 డాలర్లు ఉండాలి.

# 'ర్యాన్‌ఎయిర్' కొనుగోలుకు మస్క్ ఒపీనియన్ పోల్!




**వాషింగ్టన్, జనవరి 20:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తన సోషల్ మీడియా పోస్ట్‌తో సంచలనం సృష్టించారు. యూరప్‌కు చెందిన అతిపెద్ద బడ్జెట్ ఎయిర్‌లైన్ ర్యాన్‌ఎయిర్‌ను కొనుగోలు చేయవచ్చా అంటూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోల్ ప్రారంభించారు. ర్యాన్‌ఎయిర్ సిఇఒ మైఖేల్ ఓలియరీతో జరిగిన తీవ్ర వాగ్వాదం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ర్యాన్‌ఎయిర్ విమానాల్లో స్టార్‌లింక్ సేవలను ఇన్‌ఫ్లైట్ వైఫైగా ఉపయోగించడంపై మొదలైన వ్యాపార విభేదం వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. తమ వ్యాపారానికి స్టార్‌లింక్ ఖర్చులు సరిపడవని ర్యాన్‌ఎయిర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ర్యాన్‌ఎయిర్ సిఇఒ ఓలియరీ మస్క్‌ను "ఒక ఇడియట్" అని, అతడిని ఎవరూ పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. దీనిపై మస్క్ ఘాటుగా స్పందిస్తూ ఓలియరీ "అట్టర్ ఇడియట్" అని, "అతడిని ఉద్యోగంలో నుంచి తీసేయండి" అని పోస్ట్ చేశారు. ఈక్రమంలోనే ర్యాన్‌ఎయిర్‌ను కొనుగోలు చేయాలా వద్దా అని పోల్ నిర్వహించారు. కొద్ది గంటల్లోనే ఈ పోల్‌కు 7.50 లక్షలకు పైగా ఓట్లు రాగా, 76.8 శాతం మంది కొనుగోలుకు మద్దతు తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.